అనుదినం... జనస్వరం

సమగ్ర తెలుగు దినపత్రిక

www.navatelangana.com

ఆదివారం 4-6-2023

నవతెలంగాణ

సంపుటి : 9 | సంచిక : 154 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు (వెబ్‌లో సోపతి) | వెల : రూ. 8.00





శవాల దిబ్బ

మరుభూమిని తలపించిన బహనగబజార్ స్టేషన్

ప్రయివేటు నిర్వహణ వల్లే ఈ ఘోర విషాదం

- 288 మంది మృతి : రైల్వేశాఖ
- మరో 900 మందికి గాయాలు
- బాధితులకు ప్రధాని మోడీ, సీఎంలు నవీన్, మమతా బెనర్జీ పరామర్శ
- కారుచీకట్లలో వెల్లువెత్తిన మానవతాసాయం
- క్షతగాత్రుల కోసం వేలాది మంది రక్తదానం

చెల్లాచెదురుగా పడిన బోగీలు.. రక్తం తడారని రైళ్ల శకలాలు.. పట్టాల మధ్యనే తరలించేందుకు సిద్ధం చేసిన మృతదేహాలు.. తమవారి కోసం రెప్పవాల్చకుండా వెతుకుతున్న అభాగ్యులు.. సాయం కోసం స్థానికులు ముందుకొచ్చారు. అంతులేని దు:ఖంతో ఆ ప్రాంతమంతా మరుభూమిని తలపించింది. ఈ ఘోర రైలు ప్రమాద ఘటన జరిగి 24 గంటలు గడిచినా.. ప్రమాదస్థలిలో విషాదఛాయలు తొలగిపోలేదు. శని వారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలోనూ ఒడిశాలోని బాలాసోర్ సమీపంలోని బహనగబజార్ స్టేషన్ వద్ద కనిపించిన భీతావహదృశ్యాలివి.

న్యూఢిల్లీ : సిగ్నలింగ్ వ్యవస్థ వైఫల్యంతో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్స్‌ను ఢీకొనడం.. ఆ బోగీలు మరో మెయిన్ ట్రాక్‌లోకి ఒరిగిపోవడం.. ఆ తర్వాత వాటిని యశ్వంత్‌పూర్ సూపర్ ఫాస్ట్ రైలు ఢీకొనడం వెంటవెంటనే జరిగాయి. శకలాలు ఇంకా పూర్తిగా తొలగించనందున.. ఒడిశా ఘోరకలిలో ఇప్పటి వరకు 288 మంది మరణించారనీ, మరో 900 మంది గాయపడ్డారని భారతీయ రైల్వే అధికారికంగా ప్రకటించింది.

ప్రమాదస్థలిని, ఆ తర్వాత క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆస్పత్రులను ప్రధాని మోడీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, వివిధ రాష్ట్రాల నుంచి వెళ్లిన ఉన్నతస్థాయి బృందాలు సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై రైల్వేశాఖ, ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులు ప్రధానికి వివరించారు. అనంతరం ఆయన ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ప్రమాదానికి కారణమైనవారు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామని ప్రకటించారు.

'గొప్పలు మానుకొని ఆధునీకరణ చర్యలు చేపట్టండి'

కేంద్రం రైల్వేశాఖ పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణే ఈ ప్రమాదానికి కారణమని ప్రతిపక్షాలకు చెందిన నాయకులు విమర్శించారు. వందేభారత్, బుల్లెట్ రైళ్ల మోజులో పడి సాధారణ ప్రజలు ప్రయాణించే సర్వీసుల భద్రతను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వేల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఉన్న సిబ్బందితో పని భారం పెరిగిపోవడం, నిధుల కొరతతో సిగ్నలింగ్ వంటి సాంకేతిక వ్యవస్థలు ఆధునీకరణకు నోచుకోక అఘోరిస్తున్నాయని వాపోయారు. ఒడిశా ఘోర ప్రమాదాలకు బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తక్షణమే రాజీనామా చేయాలని ...2లో

సమగ్రంగా దర్యాప్తు చేయాలి

రైలు ప్రమాద మృతులకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సంతాపం



ఇటీవల కాలంలో ఎన్నడూ లేని రీతిలో జరిగిన అత్యంత ఘోర మైన రైలు ప్రమాదంలో మరణిం చిన వారి కుటుంబాలకు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సంతా పం తెలియచేసింది. గాయపడిన వారికి సత్వరమే వైద్య సహాయం అందేలా చూడడం ద్వారా మృతుల సంఖ్య పెరగకుండా చూడాలని సంబంధిత అధికారులను పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో కోరింది. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో బహనాగా రైల్వే స్టేషన్‌కు సమీపంలో మూడు రైళ్ళు ఢీ కొన్న ప్రమాదానికి దారి తీసిన కారణాలను కూలంకషమైన దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. రైల్వే భద్రతకు సంబంధించిన అంశాలపై తలెత్తుతున్న ప్రశ్నలకు ప్రాధాన్యత ఇవ్వాలని, మోడీ ప్రభుత్వం చేపట్టే ఆధునీకరణ ప్రణాళికల్లో దీన్ని ఎంత మాత్రమూ విస్మరించరాదని పొలిట్‌బ్యూరో పేర్కొంది..

6.35 హౌరా నుంచి వస్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ బాలాసోర్ లోని బహానాగా బజార్ రైల్వేస్టేషన్ నుంచి బయలు దేరింది. ఈ ట్రైన్ చెన్నైకు వెళ్లాలి.

6.54 కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ మెయిన్ లైన్‌పై ఉన్నది. కొద్దిదూరంలో లూప్‌లైన్‌లో గూడ్స్ ట్రైన్ ఆగి ఉన్నది.

6.55 కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఒక్కసారిగా లూప్ లైన్‌పైకి వచ్చేసింది. గూడ్స్ రైలును ఢీకొట్టింది.

6.59 కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ బోగీలు పడిన పట్టాలపైకి బెంగళూరు.. హౌరా ఎక్స్‌ప్రెస్ వచ్చేసింది.

7.00 కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ బోగీలను బెంగ ళూరు.. హౌరా ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది.దీంతో భారీగా ప్రాణనష్టం జరిగింది.

సిగ్నల్ ఇచ్చారు కానీ...



కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కి సిగ్నల్ ఇచ్చారనీ, కానీ వెంటనే వెనక్కి తీసుకున్నారనీ, ఈలోగా కోరమాండల్ లూప్‌లైన్‌లోకి ప్రవేశించి అక్కడ ఆగి వున్న గూడ్స్ రైలును ఢీ కొందని రైల్వే అధికారుల బృందం ప్రాథమిక దర్యాప్తులో తేలింది. సిగ్నల్ ఇచ్చి ఎందుకు వెనక్కి తీసుకున్నారన్న కారణాన్ని ఆ నివేదికలో స్పష్టం చేయలేదు. ఇదిలా వుండగా, సీనియర్ డిప్యూటీ కమర్షియల్ మేనేజర్, సౌత్ ఈస్ట్ రైల్వేస్ ప్రతినిధి రాజేష్ కుమార్ ప్రమాదం జరిగిన తీరును హిందూతో వివరిస్తూ, "లూప్ లైన్‌లో గూడ్స్ ...2లో

ప్రధాని మోడీ పరామర్శ



ప్రధాని ప్రమాద స్థలిని శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను సమీక్షించారు. స్థానిక అధికారులు, విపత్తు సహాయక సిబ్బంది, రైల్వే అధికారులతో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ఈ మహా విషాద సమయంలో యావత్ ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అక్కడ నుంచే క్యాబినెట్ సెక్రెటరీ, ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సాయం అందేలా చూడాల్సిందిగా ఆదేశించారు. అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు జరపాలని ఆదేశిస్తూ, దోషులెవరైనా వదిలిపెట్టేది లేదని చెప్పారు.

సిబ్బంది కొరత.. లక్షల్లో ఖాళీలు | లోకోపైలెట్లపై తీవ్ర పని ఒత్తిడి

దేశంలో వందేభారత్ రైళ్లు, అమృత్ భారత్ స్టేషన్‌లు అంటూ ప్రధాని మోడీ పచ్చ జెండా ఊపి ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. భారత రైల్వేలో అపూర్వ మార్పులు తీసుకొస్తున్నామంటూ ఇటు రైల్వే శాఖ సామాజిక మాధ్యమాల్లో ఊదరగొడుతున్నది. ఒడిశాలోని రైలు ప్రమాదం మాత్రం భారత రైల్వే శాఖకు ఒక హెచ్చరికను పంపింది. ఆదాయాన్ని గడిస్తున్న రైల్వే శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నది. లక్షలాది సంఖ్యలో ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయి. అయితే అవి భర్తీకి నోచుకోకపోవడం, అది సిబ్బంది కొరతకు దారి తీయడంతో మిగిలిన ఉద్యోగులపై తీవ్ర పని భారం పడుతున్నది. దీంతో నిర్ణీత పని గంటలకు మించి డ్యూటీ చేయాల్సి రావటం, విశ్రాంతి లేకపోవటం, నిద్ర లేమి, బిజీ షెడ్యూల్.. వంటి కారణాలు ఒడిశా వంటి భారీ ప్రమాదాలకు కారణమవుతున్నాయని విశ్లేషకులు తెలిపారు.

ముఖ్యంగా, రైల్వేలో లోకోపైలెట్ల పాత్ర చాలా కీలకమనీ, వారు 12 గంటలకు మించి పని చేయాల్సిన పరిస్థితులు ఇక్కడ ఉన్నాయని కొందరు ఉద్యోగులు తెలిపారు.

నెర్రెలుబారిన నేల దేశానికే ధాన్యాగారం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తొమ్మిదేండ్లలోనే నెర్రెలు బారిన తెలంగాణ నేల దేశానికి ధాన్యాగారమైం దంటే... దానికి ముఖ్య మంత్రి కేసీఆర్ నేతృత్వం లోని రైతు ప్రభుత్వమే కారణమని రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ట్వీట్ చేశారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని పథకాల వల్లనే ఈ అద్భుతం సాధ్యమైందని చెప్పారు. రైతు బంధు పథకం ద్వారా 65 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయంగా రూ.66 వేల కోట్లు ఇచ్చిన ఏకైక ప్రభుత్వమని కొనియాడారు. రైతు బీమా ద్వారా ఒక్కో రైతుకు రూ. 5 లక్షల చొప్పున లక్షా 782 రైతు కుటుంబాలకు రూ.5,039 కోట్లు పరిహారంగా చెల్లించిందని తెలిపారు. 27 లక్షల వ్యవసాయ మోటార్లకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణయేనని స్పష్టం చేశారు. ప్రతిదశలోనూ రైతుకు అండగా ...5లో

రైతుల జీవితాల్లో వెలుగు

- సంబురంగా రైతు దినోత్సవ వేడుకలు
- వినూత్నంగా ఎడ్లబండ్లతో ర్యాలీలు



నవతెలంగాణ- మొఫిసిల్ యంత్రాగం

వలసలను అరికట్టి, రైతుల జీవితాల్లో వెలుగులు నింపి, రైతే రాజుగా నేడు గ్రామ గ్రామాన రైతులు "రైతు దినోత్సవాన్ని" ఆనంద ఉత్సాహాలతో సంబరాలు చేసుకుంటున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వనపర్తి జిల్లా నాగవరంలో జరిగిన రైతు దినోత్సవం వేడుకలకు మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం నుండి నాగవరం రైతు వేదిక వరకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తో కలిసి ఎడ్ల బండిపై ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఎండాకాలంలో సైతం చెరువులు అలుగులు పారుతూ రెండు పంటలను పుష్కలంగా పండిస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు ఆయన మహబూబ్ నగర్ మండలం కోడూరులో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ...5లో

బ్రిజ్ భూషణ్ వేధింపులు నిజమే

- ఢిల్లీ పోలీసులకు సాక్షుల వాంగ్మూలం
- సాక్షుల్లో ఇద్దరు రెజ్లర్లు, అంతర్జాతీయ రిఫరీ, కోచ్
- నాలుగు రాష్ట్రాల్లో 125 మంది సాక్షులు



న్యూఢిల్లీ : రెజ్లర్లను బీజేపీ ఎంపీ, డబ్లూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేధించడం వాస్తవమేనని నలుగురు సాక్షులు ధ్రువీ కరించారు. ఆ సాక్షుల్లో ఇద్దరు రెజ్లర్లు, ఒక టాప్ రిఫరీ, ఒక రాష్ట్ర కోచ్ ఉన్నారు. సంఘటన జరిగిన ఆరు గంటల తరువాత తనను పిలిచారని కోచ్ చెప్పారు. ఆరోపణల గురించి తెలుసునని రిఫరీ తెలిపారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ...5లో

రెండేండ్ల కిందటే ప్రధానికి చెప్పాం

ఎఫ్ఐఆర్‌లో రెజ్లర్లు 5లో..

కేసీఆర్ దోపిడీని ఎంత కాలం భరిద్దాం?

అమెరికా న్యూజెర్సీలో తెలంగాణ అవిర్భావ దినోత్సవ వేడుకల్లో రేవంత్




నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తొమ్మిదేండ్లుగా సీఎం కేసీఆర్‌ను భరించామనీ, ఇంకా ఎంతకాలం భరిద్దామని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.కాంగ్రెస్ విజయంతోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని చెప్పారు. అమెరికా న్యూజెర్సీలో ఎన్ఆర్ఐలు నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రేవంత్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అన్ని వర్గాలు ఎంతో శ్రమించి పోరాటాలు చేశాయన్నారు. వారు త్యాగాలు చేసి రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకుంటే ఒక్క కేసీఆర్ కుటుంబమే పదేండ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తూ అడ్డగోలుగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. అమెరికాలో ఉన్న తెలంగాణ ప్రజలు మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రూ. 5 లక్షల కోట్ల అప్పు చేశారని తెలిపారు. రూ 22 లక్షల కోట్లు ఖర్చు చేసినా తెలంగాణ ప్రజల సగటు జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా పూర్తి స్థాయి లో అమలు చేయలేదన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన అని చెప్పినందుకే బీఆర్ఎస్‌కు రెండు సార్లు అవకాశం ఇచ్చారనీ, కానీ కేసీఆర్ ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా ...5లో

ప్రశ్నించే తత్వంపై దాడి

డార్విన్ సిద్ధాంతం తొలగింపుపై పరిశోధకుల ఆగ్రహం

- నిర్దిష్ట అజెండా ఉండవచ్చు
- చారిత్రక వాస్తవాలను వక్రీకరిస్తున్నారు
- పరిశోధనలపై ఆంక్షలు విధిస్తున్నారు



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పదో తరగతి పాఠ్య పుస్తకాల నుంచి డార్విన్ పరిణామ సిద్ధాం తాన్ని తొలగిస్తూ ఎన్సీఈఆర్టీ తీసుకున్న నిర్ణయంపై పలువురు పరిశోధకులు మండిపడ్డారు. ఇప్పటి వరకూ ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనసాగుతున్న పరిశోధనలకు కళ్లెం వేసి, దేశ యువతను ప్రశ్నించే తత్వం నుండి దూరం చేసేందుకే ఈ చర్యకు పాల్పడ్డారని వారు విమర్శించారు. దేశ లౌకిక స్వభావాన్ని బీజేపీ అవమానిస్తోందని బ్రిటన్‌కు చెందిన జీవ శాస్త్రవేత్త రిచర్డ్ ...5లో

ప్రజాభిప్రాయానికి పెద్దపీట వేస్తేనే ప్రగతి

విద్య ప్రయివేటీకరణతో పెరుగుతున్న అంతరాలు • సర్కారు విద్యాసంస్థల్లో ఖాళీలు భర్తీ చేయాలి



పజాస్వామ్యంలో ప్రజాభిప్రాయానికి పెద్దపీట వేస్తేనే రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకెళ్తుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అలవర్చుకోవాల్సిన అవసరముందని చెప్పారు. మానవాభివృద్ధి సూచికలో ఏ రాష్ట్రం ముందంజలో ఉంటే అది అభివృద్ధిలోనూ ముందుంటుందని వివరించారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. కొందరికే అందించడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వరంగం బలోపేతం అయితేనే అందరికీ నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

ములాఖాత్

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలపై ఏమంటారు? ప్రజల ఆకాంక్షలు నెరవేరాయంటారా?

తెలంగాణ ఆవిర్భవించి తొమ్మిదేండ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నది. ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా?అన్నది బీఆర్ఎస్ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంపై ఆధారపడి ఉన్నది. వాటిని గమనిస్తే పాక్షికంగానే నెరవేర్చింది. సాగునీరు, విద్యుత్, చెరువుల పునరుద్ధరణ, హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పన, హరితహారం, సంక్షేమ కార్యక్రమాల అమలు, ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చింది. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి దళితబంధు పేరుతో రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నది. ఇది ప్రారంభదశలోనే ఉన్నది. పూర్తిగా విజయవంతమైందని చెప్పలేం. అందరికీ ఒకే రకమైన విద్య అని 2014లో ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కానీ విద్యారంగం ఇంకొంత ప్రయివేటురంగంలోకి వెళ్లిపోయింది.

అనేక రంగాల్లో అభివృద్ధితో దేశానికే ఆదర్శమంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నది కదా. మీరేమంటారు?

దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్నారు గురజాడ. మానవాభివృద్ధి సూచికలో ప్రథమ స్థానంలో ఉంటే ఆ రాష్ట్ర అభివృద్ధిలో కూడా ప్రథమ స్థానంలో ఉంటుంది. దీనికి విద్యావైద్యం, ఉపాధి, తలసరి ఆదాయం పంపిణీ కీలకం. ఈ రంగాల్లో రాష్ట్ర ...2లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

11న గ్రూప్-1 ప్రిలిమ్స్

- 3.80 లక్షల మంది దరఖాస్తు
- నేటినుంచి వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు : టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 11న తెలంగాణ తొలి గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించనుంది. ఆబ్జెక్టివ్ విధానంలో ఈ పరీక్ష జరుగుతుందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతేడాది ఏప్రిల్ 26న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే గతేడాది అక్టోబర్ 16న గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్ష కూడా జరిగింది. ఆ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, వారిలో 2,85,916 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అందులో 25,150 మంది అభ్యర్థులను గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలకు కూడా అర్హత సాధించినట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. అయితే ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంతో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. దీంతో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను ఈనెల 11న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా ఆదివారం నుంచి ఈనెల 11 వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని పేర్కొన్నారు. అక్టోబర్ 16న నిర్వహించిన పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్ చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. కొత్త హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ముందుగానే వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని, తర్వాత ఎక్కువ మంది అభ్యర్థులు ఒకేసారి తీసుకుంటే సాంకేతిక సమస్యలొస్తాయని తెలిపారు. హాల్‌టికెట్లలో ఉండే మార్గదర్శకాలను పాటించాలని కోరారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. అయితే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం టీఎస్‌పీఎస్సీలో పది పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇంకోవైపు టీఎస్‌పీఎస్సీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా బిఎం సంతోష్‌ను, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా ఎస్ జగదీశ్వర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

దేశానికే ఆదర్శం

- సీఎం కేసీఆర్‌కు స్వామీజీల ఆశీస్సులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్రం వ్యవసాయం సహా అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందనీ, అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారని జగద్గురు పంచాచార్య స్వామీజీలు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును అభినందించారు. దార్శనిక పాలనతోనే ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు. తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వీరశైవ పంచ పీఠంలోని కాశీ, ఉజ్జయినీ, శ్రీశైల పీఠాల జగద్గురువులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆహ్వానించారు. చంద్రశేఖర శివాచార్య మహాస్వామి (కాశీ), సిద్ధలింగ శివాచార్య మహాస్వామి (ఉజ్జయినీ), చెన్నసిద్ధ రమా పండితారాధ్య శివాచార్య మహాస్వామి(శ్రీశైలం) శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. వారితో పాటు మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలనుంచి పలువురు శివాచార్య మహాస్వాములు హాజరయ్యారు. సీఎం కేసీఆర్, ఆయన భార్య శోభ దంపతులను స్వామీజీలు ఆశీర్వదించారు. రాజకీయంగా సీఎం ఆకాంక్షలు నెరవేరతాయనీ, దానికి తమ సహకారం అందిస్తామనీ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్ దంపతులు, రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్, మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలు శంకరన్న దోంఢ్గే, మాణిక్ కదమ్, హిమాన్షు తివారి తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన రాజద్రోహం చట్టాన్ని రద్దు చేయాలి : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ :భారతీయ శిక్షా స్మృతిలోని దేశద్రోహం నిబంధనను సర్దుబాటు చేయడంపై లా కమిషన్ చేసిన సిఫారసులు సమగ్రంగా లేవని, పైగా సుప్రీంకోర్టు వ్యాఖ్యలను అవి తోసిపుచ్చుతున్నాయని సిపిఎం పొలిట్ బ్యూరో పేర్కొంది. ఈ కాలం చెల్లిన చట్టాన్ని శాసన పుస్తకాల నుంచి తొలగించేందుకు తగిన చట్టపరమైన చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకునే వరకు దేశద్రోహ చట్టం అమలుపై సుప్రీం కోర్టు స్టే విధించింది. అయితే, కనీస జైలు శిక్షను గతంలోని మూడు సంవత్సరాల నుంచి ఏడేండ్లకు పెంచడం ద్వారా దేశద్రోహం చట్ట నిబంధనలను లా కమిషన్ మరింత బలోపేతం చేసినట్లు కనిపిస్తోంది. ప్రతిపక్ష పార్టీల నేతలను లక్ష్యంగా చేసుకునేందుకు ఈడీ, సీబీఐలను దారుణంగా దుర్వినియోగ పరుస్తున్న నేపథ్యంలో ఈ సిఫార్సులు అరిష్టాన్ని కలగచేస్తాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

సర్కారు బడుల్లో వెజ్ బిర్యానీ

- విద్యార్థులకు ఉదయం రాగిజావ
- వారంలో మూడు రోజులు గుడ్డు
- మధ్యాహ్న భోజనం మెనూ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని సర్కారు బడుల్లో వెజ్‌బిర్యానీ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు ఉదయం రాగిజావ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. వారంలో మూడు రోజులు గుడ్డు అందించనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన శనివారం మధ్యాహ్న భోజనం మెనూను విడుదల చేశారు. విద్యార్థులకు వారంలో ఒక రోజు కిచిడీ, వెజ్ బిర్యానీ అందించాలని నిర్ణయించామని తెలిపారు. విద్యార్థులకు ఉదయం వారంలో మూడు రోజులు రాగిజావ అందించనున్నట్టు వివరించారు. ప్రతిరోజూ మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ అందిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికీ రోజుకు రూ.5.45, ఆరు నుంచి ఎనిమిదో విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.8.17, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10.67 చెల్లిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 26,065 సర్కారు బడుల్లో 23 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పథకం అమలుకు అయ్యే మొత్తం వ్యయం రూ.323.71 కోట్లలో కేంద్రం రూ.203.76 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.119.95 కోట్లను భరిస్తున్నాయి.

మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు

వారం	రోజువారీగా ఇచ్చే భోజనం
సోమవారం	కిచిడీ+మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు
మంగళవారం	అన్నం+సాంబార్+మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ
బుధవారం	అన్నం+ఆకుకూర పప్పు+మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు
గురువారం	వెజిటబుల్ బిర్యానీ+మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ
శుక్రవారం	అన్నం+సాంబార్+మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు
శనివారం	అన్నం+ఆకుకూర పప్పు+మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ

సహాయానికి సిద్ధం

- కోరమాండల్ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో బాధితులకు సహాయ, పునరావాస కార్యక్రమాల్లో సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రకటించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఒడిశా ప్రభుత్వం, దక్షిణ మధ్య రైల్వే అధికారులను సంప్రదించారు. ఈ రైలు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రయాణికులు ఎవరూ లేరని ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ జనరల్ మేనేజర్ తెలిపారు. అయినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రైల్వే అధికారులతో నిరంతరం సంప్రదిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

శవాల దిబ్బ



(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర న్యాయ విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలన్నారు. ఇప్పటికైనా గొప్పలు మానుకొని క్షేత్రస్థాయిలో రైల్వేల ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఒడిషాలోని బాలాసోర్ జిల్లాలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రైల్వే ప్రమాదంలో మృతుల సంఖ్య 288కి పెరిగింది. క్షతగాత్రుల సంఖ్య 900కి చేరిందని సౌత్ ఈస్ట్ రైల్వే ప్రతినిధి ఆదిత్య చౌదరి శనివారం తెలిపారు. గాయపడిన వారందరినీ కాపాడి, ఆస్పత్రుల్లో చేర్చడం కూడా పూర్తయిందని చెప్పారు. మొత్తంగా సహాయక చర్యలు పూర్తయ్యాయని రైల్వే ప్రకటించింది. ప్రస్తుతం బాలాసోర్‌లో పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. సహాయక, పునరుద్ధరణ చర్యల కోసం సైన్యాన్ని రంగంలోకి దింపారు. వాయు సేనకు చెందిన విమానాలను కూడా మోహరించారు. అయితే ప్రమాద తీవ్రతను దృష్టిలో వుంచుకుంటే మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు వున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఒకదానిపైకి మరొక బోగీ ఎక్కడం, బోగీలు వంకర్లు తిరిగిపోవడంతో లోపల ఇరుక్కుపోయిన వారిని రక్షించడానికి, మృతదేహాలను వెలికి తీయడానికి పెద్ద పెద్ద క్రేన్లు, బుల్డోజర్లను ప్రమాద స్థలానికి రప్పించాల్సి వచ్చింది.

మనసును కలిచివేసింది : నవీన్ పట్నాయక్

బాలాసోర్‌లోని జిల్లా హెడ్‌క్వార్టర్ ఆస్పత్రిని సందర్శించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బాధితులను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి వారికి అందిస్తున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాటాడుతూ.. ఈ విషాద ఘటన తన మనస్సునెంతో కలిచివేసిందని అన్నారు. సకాలంలో స్థానికులు స్పందించిన తీరును ప్రశంసిస్తూ వారికి కృతజ్ఞతలు చెప్పాలని తెలిపారు. ఈ ప్రమాదం నేపథ్యంలో ఒక రోజు సంతాప దినాన్ని ప్రకటించారు.

ఉన్నత స్థాయి దర్యాప్తు : అశ్విని వైష్ణవ్

ఒడిశా దుర్ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తును రైల్వే చేపడుతుందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ప్రకటించారు. సౌత్ ఈస్ట్రన్ సర్కిల్ రైల్వే భద్రతా కమిషనర్ నేతృత్వంలో ఈ దర్యాప్తు సాగుతుందని అధికారులు శనివారం తెలిపారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పరిధిలో రైల్వే భద్రతా కమిషనర్ కార్యాలయం పని చేస్తుంది. ఇటువంటి ప్రమాదాలపై దర్యాప్తు జరుపుతుంది.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : ప్రతిపక్షాల డిమాండ్

భారతీయ రైల్వే చరిత్రలోనే అత్యంత ఘోరమైన దుర్ఘటనల్లో నాల్గవదిగా భావిస్తున్న ఈ ఘోర ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు శనివారం డిమాండ్ చేశాయి. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నాయి. జరిగిన ఘోరంపై కాంగ్రెస్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. రైల్వే నిర్వహణలో ప్రయాణికుల భద్రతకే పెద్ద పీట వేయాల్సి వుందని పేర్కొంది. సీపీఎం(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య ట్వీట్ చేస్తూ, "భారతీయ రైల్వేలో మనకు సిగ్నలింగ్, భద్రతా వ్యవస్థలు లేవా? లేదా ఇటువంటి మహా విషాదాలు ఇకపై దేశంలో రైల్వే ప్రయాణాల్లో సాధారణం కానున్నాయా? బాధితులకు, వారి కుటుంబాలకు మనం సమాధానం చెప్పాల్సి వుంది." అని పేర్కొన్నారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలని సీపీఐ, ఆర్జేడీలు డిమాండ్ చేశాయి. సవివరమైన రీతిలో దర్యాప్తు జరగాల్సి ఉన్నదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి కె.పళనిసామి వివరించారు. ప్రమాద స్థలిని సందర్శించిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మాట్లాడుతూ ఈ ఘోర ప్రమాదం వెనుక ఏదో తప్పు జరిగిందనీ, దానిపై సక్రమంగా దర్యాప్తు జరగాలని కోరారు. ప్రమాదానికి గురైన బోగీల్లో మూడింటిని సోదా చేయలేదని విమర్శించారు.

యుద్ధ భూమిని తలపిస్తున్న బాలాసోర్ జిల్లా ఆస్పత్రి

తెల్లవారు జామున 2గంటల సమయం...బహనగ రైల్వే స్టేషన్ మార్చురీని తలపిస్తోంది. బోగీల నుంచి వెలికి తీసిన మృతదేహాలు అక్కడ గుట్టలుగా పడివున్నాయి. వాటిని ట్రక్కుల్లో తీసుకుని ఆ సమీపంలోని హైస్కూల్ ఆవరణలో ఉంచారు. నేలపై నిర్జీవంగా పడి వున్న ఆ శవాల జేబుల్లోని మొబైల్స్ నిరంతరంగా మోగుతునే వున్నాయి. తమవారి ఆచూకీ తెలుసుకునేందుకు ఆతృతగా వారు చేస్తున్న ఫోన్లతో ఆ ప్రాంతమంతా మారుమోగుతోంది. వరుసగా వస్తున్న బాధితుల ఆక్రందనలతో బాలాసోర్ జిల్లా ఆస్పత్రి, సోరో హాస్పిటల్‌లు కదన రంగాన్ని తలపించాయి. స్ట్రెచర్లపై, బయట కారిడార్లలో, గదుల్లో ఎక్కడ చూసినా క్షతగాత్రులే కనిపిస్తున్నారు. వారికి అవసరమైన చికిత్సలందిస్తూ డాక్టర్లు, నర్సులు అవిశ్రాంతంగా సేవలందిస్తున్నారు.

33 రైళ్ళ రద్దు

శుక్రవారం ఒడిశా ప్రమాదంతో మొత్తంగా 33 రైళ్ళను పూర్తిగా రద్దు చేసినట్టు నైరుతి రైల్వే శనివారం ప్రకటించింది. కాగా మరికొన్ని రైళ్ళను పాక్షికంగా రద్దు చేయగా, మరికొన్నింటిని దారి మళ్ళించారు. ప్రమాద స్థలిలో చిక్కుకుపోయిన ప్రయాణికులను తీసుకెళ్ళిన రెండు రైళ్ళు శనివారం హౌరా చేరుకున్నాయి.

కవచ్ ఆ రూట్‌లో లేదు

ప్రమాదం జరిగిన మార్గంలో యాంటీ ట్రెయిన్ కొలిజన్ సిస్టమ్ 'కవచ్' అందుబాటులో లేదని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. రైల్వే నెట్‌వర్క్ వ్యాప్తంగా కవచ్‌ను నెలకొల్పడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లోకో పైలట్ సిగ్నల్‌ను విస్మరించినపుడు కవచ్ వ్యవస్థ పైలట్‌ను అప్రమత్తం చేస్తుంది, బ్రేక్‌లను పూర్తిగా అదుపులోకి తీసుకుని రైలు కదలికలను నిలిపివేస్తుంది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర రైల్వే మంత్రి వైష్ణవ్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేలో 14.93 శాంక్షన్ పోస్టులలో 3.14 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 1.35 లక్షల ఖాళీలను భర్తీ చేయనున్నట్టు ఆయన చెప్పారు. దీంతో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి ఇటు రైల్వే ప్రమాదాలకు అడ్డుకట్టవేయటంతో పాటు అటు నిరుద్యోగుల బాధలను తొలగించాలని సామాజికవేత్తలు, పౌర సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

ప్రపంచ దేశాల అధ్యక్షులు, ప్రధానుల సంతాపం

ఒడిశా రైలు ప్రమాదం పట్ల పలువురు ప్రపంచంలోని పలు దేశాధినేతలతో సహా ప్రధానులు స్పందించారు. విచారం వ్యక్తం చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, బ్రిటీష్ ప్రధాని రిషి సునక్, జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో, నేపాల్ ప్రధాని ప్రచండ, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ మేరకు సంతాప సందేశాలు పంపించారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షులు కసాబా కోరోసి కూడా తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని మోడీకి సంతాపాన్ని తెలియచేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమయంలో భారత్‌కు అండగా ఉంటామని వారు ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోడీకి టెలిగ్రామ్ ద్వారా సంతాపం తెలిపారు.

దయచేసి ఒడిశాలో రైలు ఢీకొన్న విషాద సంఘటనపై మా ప్రగాఢ సానుభూతిని అంగీకరించండి. ఈ విపత్తులో వారి బంధువులు, సన్నిహితులను కోల్పోయిన వారి బాధను మేము పంచుకుంటున్నాము. గాయపడిన ప్రతి ఒక్కరూ త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాము.

- పుతిన్, రష్యా అధ్యక్షులు

ప్రాణాలతో బయటపడిన వారికి, రెస్క్యూ ఆపరేషన్‌లలో అవిశ్రాంతంగా పనిచేస్తున్న వారికి తన హృదయపూర్వక మద్దతు తెలుపుతున్నాను. ఒడిశాలో జరిగిన విషాద సంఘటనల వల్ల ప్రభావితమైన వారందరికీ, మరణించిన వారి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను.

- రిషి సునక్, బ్రిటన్ ప్రధాని

ఒడిశా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదంలో అనేకమంది విలువైన ప్రాణాలను కోల్పోవడం.. గాయపడిన వార్తలకు నేను చాలా బాధపడ్డాను. జపాన్ ప్రభుత్వం, ప్రజల తరపున, వారికి మా హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

- కిషిదా, జపాన్ ప్రధాని

క్లిష్ట సమయంలో కెనడియన్లు భారత ప్రజలకు అండగా నిలుస్తున్నాం. భారత్‌లోని ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద చిత్రాలు, నివేదికలు నా హృదయాన్ని విచ్ఛిన్నం చేశాయి. తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

- ట్రూడో, కెనడా ప్రధాని

ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం జరగడం నాకు బాధ కలిగించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జీ, ప్రభుత్వం.. మృతుల కుటుంబాలకు ఈ దుఃఖ సమయంలో.. వారికి నా సానుభూతి తెలుపుతున్నాను.

- ప్రచండ, నేపాల్ ప్రధాని

రైలు ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నా. భారత్‌లో జరిగిన రైలు ప్రమాదంలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయినందుకు చాలా బాధగా ఉంది. ఈ విషాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారి కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను.

- షెహబాజ్ షరీఫ్, పాక్ ప్రధాని

సిగ్నల్ ఇచ్చారు కానీ...

రైలు ఆగి వుంది. గంటకు 130కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న కోరమండల్ లూప్‌లైన్‌లోకి వెళ్ళి అక్కడ నిలిచిన గూడ్స్‌ను వెనక నుంచి ఢీ కొట్టింది. మెయిన్ లైన్‌లో వెళ్ళేందుకు కోరమండల్‌కు సిగ్నల్ అప్పటికే ఇచ్చారు. అయినా కోరమండల్ తన దిశ మార్చుకుని ఎందుకు లూప్‌లైన్‌లోకి వెళ్ళిందో తెలియడం లేదు." అని చెప్పారు. కోరమండల్ ఇంజన్ మొత్తంగా గూడ్స్ రైలును పైకెత్తేసింది. దీంతో కోరమండల్‌కి చెందిన 12బోగీలు పట్టాలు తప్పాయి, అదే సమయంలో ఎదురుగా వస్తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ అప్పటికే ప్రమాద స్థలిని దాటింది కానీ దాని చివరి రెండు జనరల్ బోగీలను కోరమాండల్ చివరి బోగీలు ఢీ కొన్నాయి. దీంతో ఆ జనరల్ బోగీలు దెబ్బతిన్నాయన్నారు.





ప్రజాభిప్రాయానికి పెద్దపీట వేస్తేనే ప్రగతి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం కృషి నామమాత్రంగానే ఉంది. జీఎస్‌డీపీలోగాని తలసరి ఆదాయంలోగాని ఉన్నత స్థితిలో ఉండొచ్చు. ఒకరికి రూ.కోటి ఆదాయం, మరొకరికి రూ.రెండు లక్షల ఆదాయం ఉంటుంది. ఇద్దరి తలసరి ఆదాయం రూ.51 లక్షలవుతుంది. కానీ రూ.రెండు లక్షల ఆదాయం ఉన్న కుటుంబం రూ.51 లక్షలకు ఎప్పుడు చేరుకుంటుంది. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలి.

సర్కారు బడుల్లో ఆంగ్ల మాధ్యమం, గురుకులాలను పెద్దఎత్తున ప్రవేశపెట్టామని ప్రభుత్వం చెప్పడంపై మీ అభిప్రాయమేంటీ?

దేశంలోనే అత్యధిక గురుకులాలున్న రాష్ట్రం తెలంగాణ అన్నది యదార్థం. 60 లక్షల మంది విద్యార్థులున్న ఈ రాష్ట్రంలో గురుకులాల్లో చదువుకునేది ఐదు లక్షల మంది మాత్రమే. ప్రభుత్వ మండల, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలతోపాటు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలు సర్కారు ఆధీనంలో ఉన్నాయి. ఈ స్కూళ్ల అభివృద్ధి కోసం 2021, డిసెంబర్ వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టలేదు. 2022, జనవరిలో మన ఊరు మనబడి కార్యక్రమాన్ని 9,123 స్కూళ్లలో రూ.3,497 కోట్లతో మొదటి విడత చేపట్టింది. నిర్దిష్టమైన బడ్జెట్ కేటాయింపుల్లేక నేటికీ మూడో వంతు బడుల్లో కూడా పనులు పూర్తి కాలేదు. ఏ బడులకైతే తక్కువ పనులు, రంగులు, డ్యూయెల్ డెస్క్‌లు, గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేసే 1,500 బడుల్లో పనులు పూర్తయినట్టు కనిపిస్తున్నది. ఎక్కువ అవసరాలున్న పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదు. బడికి టీచర్ కీలకం. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు వస్తున్నాయి కానీ ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ జారీ కావడం లేదు. ఈ విద్యా సంవత్సరమైనా ప్రతి బడికి పారిశుధ్యం, ఇతర పనుల కోసం సర్వీసు పర్సన్లను నియమించాలి. కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ అభినందనీయం. జూన్ ఒకటో తేదీ నుంచి గెస్ట్ లెక్చరర్లను నియ మించాలి. విశ్వ విద్యాలయాల్లో ఖాళీ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి. వర్సిటీ కాంట్రాక్టు అధ్యా పకులను క్రమబద్ధీకరించాలి. నిర్వహణ గ్రాంటును పెంచాలి.

కొన్ని రాష్ట్రాలు, ప్రయివేటు విద్యాసంస్థల్లో డిజిటల్ విద్య అమలవుతున్నది. దీనిపై ఏమంటారు?

రాష్ట్రంలో పాఠశాల విద్య మొదలుకుని ఉన్నత విద్య వరకు అంతరాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే విద్యలో అంతరాలను తొలగించే అవకాశముంటుంది. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 20 శాతం, కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో పది శాతం నిధులు కేటాయించాలి. అప్పుడు అంతరా ల్లేని విద్య అందించొచ్చు.ప్రయివేటు విద్యలోనూ చాలా అంతరాలు కనిపిస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నది.



తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మీ సందేశమేంటీ?

నేను ఒక టీచర్‌ను. ప్రజాస్వామ్యమంటే 'ప్రజల చేత, ప్రజల కొం^కు, ప్రజలే పరిపాలించు కునేది' అనే వాక్యాన్ని పదే పదే భావిభారత పౌరుల కు చెప్పాను. చట్టసభల్లో సభ్యున్ని అయ్యాక ఆ నిర్వచనం తలకిందులు అయి నట్టు కనిపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం దాన్ని సవరించుకోవాలి. ప్రజాస్వామ్యంలో సాధ్యమైనంత మేరకు ప్రజల అభిప్రాయాలకు పెద్దపీట వేయాలి. అప్పుడే ప్రగతి సాధ్యం. ప్రజల అభిప్రాయాలను వ్యక్తీకరించేది వివిధ ప్రజా సంఘాలు, సమూహాలు, రాజకీయ పార్టీలు. ఈ సమూహాలతో అవసర మైన సందర్భాల్లో చర్చించే ఆనవాయితీ రాష్ట్ర ప్రభుత్వం అలవర్చుకోవాలి.

ఉపాధి కోసం యువత పోరాడాలి

జులై 8 నుంచి హైదరాబాద్‌లో జాతీయస్థాయి వర్క్‌షాప్

- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధి అవకాశాల కోసం యువత పోరాడాలని ఏఐవైఎఫ్ నేతలు పిలుపునిచ్చా రు. వచ్చేనెల 8 నుంచి పదో తేదీ వరకు హైదరాబాద్‌లో ఇదే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రకటిం చారు. శనివారం హైదరాబాద్‌లోని హిమా యత్‌నగర్‌లో అందుకు సంబంధించిన పోస్ట ర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లీ ఉల్లాఖాద్రీ, కార్యదర్శి కె ధర్మేంద్ర మాట్లాడుతూ మత ఛాందస విధానాలను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మత పోకడలతో యువత పెడదారి పడుతు న్నారని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ విధానా లను దేశమంతా వ్యాపింపచేసేందుకు బీజేపీ నేతలు కుయుక్తులు పన్నుతున్నారని అన్నా రు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించ డంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని చెప్పారు. నిరుద్యోగుల ను మోసం చేస్తున్న టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అన్ని పరీక్షలనూ పారదర్శకంగా నిర్వ హించాలని కోరారు. జాతీయ స్థాయి వర్క్ షాప్‌కు అన్ని రాష్ట్రాల ప్రతినిధులు, మేధా వులు, పలువురు ఎంపీలు హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్ శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి సత్యప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు శ్రీమాన్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను ఆదుకోవాలి

ఒడిశాలో రైలు ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సానుభూతిని ప్రకటించింది. మరణించిన వారి కుటుంబాలను, క్షతగాత్రులను కేంద్రం ఆదుకోవాలని, తక్షణమే ఆర్థిక సహాయాన్ని వేగంగా అందించాలని కోరింది.

తొమ్మిదేండ్లలో పోలీస్‌శాఖకు రూ.59,200 కోట్లు

- శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం
- నేటి 'దశాబ్ది'లో 'సురక్షా' దినోత్సవం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 9 ఏండ్లలో పోలీసుశాఖకు ప్రభుత్వం రూ.59,200 కోట్ల నిధుల్ని కేటాయించింది. ఆ శాఖను పూర్తిగా ఆధునీకరిం చడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. రూ.775 కోట్లతో 551 కొత్త పోలీస్ స్టేషన్ భవనాలు నిర్మాణమయ్యాయి. అలాగే అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చు కుంటూ పోలీస్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని పోలీస్ స్టేష న్లన్నింటినీ ఈ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు.

తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా 48,096 పోస్టులు భర్తీ చేశారు. మహిళల భద్రతకు 331 షీ టీమ్స్, 12 భరోసా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్టు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు పలు వేదికలపై చెప్పారు. ఫలితంగా నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఏదైనా నేరం జరిగినా నిందితులను పట్టుకోవడం సులభతరమైంది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్లో కల్తీలు, నకిలీలపై కఠినంగా వ్యవహరిస్తూ నేరస్తులపై పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపేలా ఆర్డినెన్స్ తెచ్చిన మొట్ట మొదటి రాష్ట్రం తెలంగాణానే. మాదక ద్రవ్యాల నియంత్రణ, మహిళల అక్రమ రవాణాపై పోలీసుశాఖకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఫలితంగా ఆయా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. అలాగే పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులకు వేగవంత మైన సేవలందించేందుకు ఆధునిక సాంకేతికతనువ వినియోగంలోకి తెచ్చారు. రాష్ట్ర పోలీసుల సాంకేతిక ఆధారిత కార్యక్రమాల్లో 60కి పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారు. అలాగే హోంగార్డుల డ్యూటీ అలవెన్స్‌ను రోజుకు రూ.300 నుంచి రూ.921కి పెంచారు. ట్రాఫిక్ నియంత్రణలోనూ రాష్ట్ర పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేస్తుంది. హైదరాబాద్‌లో రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే ట్రాఫిక్ నిర్వహణలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ప్రభుత్వం చెప్తున్నది.

నవశరణ్ సింగ్‌పై ఈడీ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం

- 350 మందికిపైగా విద్యావేత్తలు, పౌర సంఘం సభ్యుల లేఖ


న్యూఢిల్లీ:పరిశోధకురాలు, రచయిత, కార్యకర్త అయిన డాక్టర్ నవశరణ్ సింగ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారించటంపై పౌర సమాజం నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. నవశరణ్ సింగ్‌పై ఈడీ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు భారతీయ విద్యా వేత్తలు, పరిశోధకులు, న్యాయ నిపుణులు, కళాకారులు, పౌర సంఘం సభ్యులు పేర్కొన్నారు. దాదాపు 350 మందికి పైగా తమ సంతకాలతో కూడిన ఒక లేఖను విడుదల చేశారు. ఇందులో వారి ఆందోళనలను, అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'ఇటీవల సంవత్సరాలలో ఇతర విద్యావేత్తలు, మానవ హక్కు ల కార్యకర్తలను ప్రశ్నించే పద్ధతిలో నవశరణ్ సింగ్‌ను ఈడీ సుదీర్ఘంగా విచా రించినట్టు కనిపిస్తున్నది. పీఎంఎల్‌ఏ భారత ప్రజాస్వామ్యానికి చీకటి మచ్చ" అని లేఖలో వారు వివరించారు. వ్యవసాయం, మహిళల హక్కులు, రైతులు, శాంతి వంటి అంశాలలో నవ శరణ్‌సింగ్ అత్యున్నత సమగ్రత కలిగిన పరిశో ధకులని నొక్కి చెప్పారు. రాజ్యాంగ విలువలను సమర్థించిన ఇలాంటి వ్యక్తిపై వేధింపులు నిలిపివేయాలని ప్ర భుత్వం, ఈడీని వారు డిమాండ్ చేశారు. మనీలాండ రింగ్ చట్టం (పీఎం ఎల్ఏ) కింద నవశరణ్ సింగ్‌ను ఈడీ గతనెల 10న విచారించిన విషయం విదితమే. మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద సాగు చట్టాలకు వ్యతిరేకంగా నవశరణ్‌సింగ్ పో రాడారు. హక్కుల కార్యకర్త అ యిన హర్ష్ మందర్ నేతృత్వం లోని అమన్ బిరాదారి బోర్డులో వీరు సభ్యులుగా ఉన్నారు.

రైల్వేశాఖ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

కేంద్ర ప్రభుత్వ విధానాలూ కారణమే

- మరణించిన వారికి సీపీఐ(ఎం) సంతాపం
- సమగ్ర దర్యాప్తు జరిపించాలని తమ్మినేని డిమాండ్





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైల్వే శాఖ నిర్లక్ష్యం వల్లే ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లా బహగానా రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన ఘోర ప్రమాదం జరిగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా ఈ ప్రమాదం జరిగేందుకు కారణమని తెలిపింది. ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాద ఘటనలో ఇప్పటివరకు సుమారు 300 మంది ప్రయాణికులు మరణించినట్టు, వెయ్యి మంది తీవ్ర గాయాలపాలైనట్టు తెలుస్తున్నదని పేర్కొన్నారు. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని వివరించారు. ప్రయాణికుల్లో సుమారు 170 మంది తెలుగు వారున్నారని, కొద్దిమంది చికిత్స పొందుతున్నట్టు వార్తలొస్తున్నాయని తెలిపారు. రైల్వేల ఆధునీకరణలో భాగంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని విమర్శించారు. వేలాదిమంది ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్ల సొబగుల కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. అదే సమయంలో రైల్వేలైన్లు, సిగ్నల్ వ్యవస్థ, ట్రాకుల ఆధునీకరణ చేపట్టకపోవడం శోచనీయమని విమర్శించారు. రైల్వేశాఖలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా ట్రాక్ పర్యవేక్షణ, తదితరాల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, గాయపడినవారికి మెరుగైన వైద్య సదుపాయం అందించాలని డిమాండ్ చేశారు. రైల్వే భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మోడీదే నైతిక బాధ్యత : కూనంనేని

ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి ప్రధాని మోడీ నైతిక బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మృతులకు సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. భారత రైల్వేలో కవచ్ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదాలను అరికట్టనున్నట్టు మోడీ ఘనంగా ప్రకటించారని, అలాంటప్పుడు ఈ ప్రమాదానికి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. రూ.కోట్లు ఖర్చుతో రూపొందించిన ఆ పరిజ్ఞానాన్ని రైల్వే స్టేషన్లు, రైల్వేల్లో ఎందుకు అమర్చలేదని తెలిపారు. ప్రయివేటీకరణతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రయివేటు వ్యక్తులు లాభాలే పరమావధిగా భావించి ఉద్యోగులను తగ్గించి, పనిచేస్తున్న వారిపై భారాలు మోపుతారని విమర్శించారు. రైల్వే శాఖ నిర్లక్ష్యంతో వందల మంది ప్రాణాలను బలిగొన్నదని తెలిపారు. ఇప్పటికైనా రైల్వే ప్రయివేటీకరణను కేంద్రం ఆపాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.కోటి, గాయపడిన వారికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ఈ ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలిపారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : ప్రజాపంథా

ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం పట్ల సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఇది ప్రమాదమే కాదని, రైల్వే శాఖ నిర్లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. రైల్వే ప్రయివేటీకరణతో ఉన్న వారిపై పనిభారం పెరగడం, సిగ్నల్ వ్యవస్థలో లోపాలుండం వల్ల వందల మంది మరణానికి కారణమైందని పేర్కొన్నారు. మరణించిన వారిలో ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.25 లక్షలు, పాక్షికంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరపాలని తెలిపారు. దీనికి నైతిక బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి, ఉన్నతాధికారులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



ఘనంగా రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-అంబర్ పేట: ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎక్స్ హాస్పిటల్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎక్స్ గ్రూప్ ఆఫ్ చైర్మెన్ కీర్తికర్ రెడ్డి, దీపక్ రెడ్డి, సీఈవో శ్రీకాంత్ వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'పర్సా' జీవితం స్ఫూర్తిదాయకం

సీఐటీయూ ఆధ్వర్యంలో శతజయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కార్మికోద్యమ నేత పర్సా సత్యనారాయణ జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన కార్మిక పక్షపాతి అనీ, జీవితాంతం వారి హక్కుల కోసమే పనిచేశారని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన శనివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పర్సా సత్యనారాయణ శతజయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పర్సా సత్యనారాయణ సమకాలికులు పీ రాజారావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు, భూపాల్ మాట్లాడారు. అనేక కఠిన పరీక్షలు తట్టుకొని నిలబడిన ధీశాలి 'పర్సా' అని చెప్పారు. కార్మికోద్యమం, కష్టజీవుల కోసం జీవితాంతం శ్రమించారని అన్నారు. ఆయన ఆశయసాధనకు కార్యకర్తలంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ కార్పొరేట్, మతోన్మాద విధానాలను దూకుడుగా అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల నిరుద్యోగం పెరిగి అసమానతలు పెచ్చరిల్లుతున్నాయనీ, ద్రవ్యోల్బణం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆఫీసు బేరర్లు ఎస్ రమ, పీ జయలక్ష్మి, జే వెంకటేష్, బీ మధు, కూరపాటి రమేష్, జే మల్లిఖార్జున్, కే ఈశ్వరరావు, జే చంద్రశేఖర్, రాజారెడ్డి, ముత్యంరావు, కళ్యాణం వెంకటేశ్వర్లు, మందా నర్సింహారావు, ఏజే రమేష్, బీరం మల్లేష్, గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



వీఐటీ-ఏపీ యూనివర్సిటీ డే వేడుకలు

హైదరాబాద్ : వీఐటీ-ఏపీ యూనివర్సిటీలో యూనివర్సిటీడే వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోష్ గ్లోబల్ టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్ బోనం రాజ్ కుమార్, గౌరవ అతిథిగా వీఐటీ వ్యవస్థాపకులు, చాన్సలర్ డాక్టర్ విశ్వనాథన్ పాల్గొన్నారు. యూనివర్సిటీ వార్షిక రిపోర్టును రాజ్‌కుమార్ ఆవిష్కరించారు. తర్వాత మహాత్మా గాంధీ అకడమిక్ బ్లాక్‌లో మేకర్స్ స్పేస్ అండ్ ఇంజినీరింగ్ క్లినిక్‌లను ప్రారంభించారు. వీఐటీ-ఏపీ 2017లో ప్రారంభమైనప్పటి నుంచి దాని ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు ఆయన అభినందనలు తెలిపారు. వీఐటీలోని నాలుగు క్యాంపస్‌లలో సుమారు 80 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని జి. విశ్వనాథన్ అన్నారు. అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నామనీ, ఇందుకు విద్యార్థుల విజయమే నిదర్శనమన్నారు. యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్.వి కోటారెడ్డి యూనివర్సిటీ వార్షిక నివేదికను చదివి యూనివర్సిటీ ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో అవార్డులు గెలుచుకున్న విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందిని సత్కరించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి, డిప్యూటీ డైరెక్టర్ (విద్యార్థి సంక్షేమం) డాక్టర్ అనుపమ నంబూరు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్హత కలిగిన వృత్తిదారులందరికీ

రూ.లక్ష రుణమివ్వాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పి ఆశయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజకీయ జోక్యం లేకుండా అర్హత కలిగిన వృత్తిదారులందరికీ రూ.లక్ష రుణమివ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజి గూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో బెల్లపు దుర్గారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ నియోజకవర్గానికి కేవలం 1200-1500 మంది వృత్తిదారులకు మాత్రమే రుణాలిస్తామంటూ సర్కార్ చెప్పటం సరికాదని తెలిపారు.అర్హత కలిగిన అందరికీ వాటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ వృత్తి సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నాయకులు, వృత్తిదారుల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. తద్వారా రుణాల పంపిణీకి విధి విధానాలను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.



ఎందుకిలా జరిగింది? ఎవరు దీనికి కారకులు? మానవతప్పిదమా? సాంకేతిక లోపమా? వ్యవస్థాగత వైఫల్యమా, యాదృచ్ఛికమా దర్యాప్తు అనంతరం ఏదో ఒక కారణాన్ని లేదా కారణాలను బయటపెట్టవచ్చు. మన రైల్వే వ్యవస్థకు సుదీర్ఘ చరిత్ర ఉంది. చాలా నిబద్ధంగా పనిచేసే శ్రామికులూ, పటిష్టమైన జాగ్రత్తలూ, విధి విధానాలు ఉంటాయి. మరి గూడ్స్ ఆగివున్న ట్రాక్‌పైకి మరో రైలు ఎలా వచ్చింది! ఎందుకు వచ్చింది. ఇది తేలవలసి ఉన్నది.

ఒడిశా విషాదం

సంపాదకీయం

మృత్యు ప్రయాణం... వందలాది ప్రాణాలను కబళించిన దుర్ఘటన. హాహాకారాలు, ఆర్తనాదాలు, క్షతగాత్రుల రక్తఘోషలతో ఎరుపెక్కిన ఆవరణం. క్షణాలలోనే యుద్ధక్షేత్రంలా బీభత్సదృశ్యం. గమ్యస్థానాలు గాలికెగిరిపోయి, ముగింపు గీతాన్ని రచించింది. ఒడిశాలో జరిగిన ఘోర కోరమండల్ రైలు ప్రమాదం దేశాన్ని విషాదంలో ముంచింది. రక్తసిక్తమైన ఆ ప్రదేశమంతా మృత్యువు విలయతాండవం చేసింది. ఒకే చోట మూడు రైళ్ళు ప్రమాదానికి లోనయిన అతి పెద్ద ఘటన ఇది. ఇప్పటికే 278మంది ప్రయాణీకులు మృతిచెందారని అధికారికంగా ప్రకటిస్తున్నారు. ఇది మరింత పెరిగే అవకాశముందనీ చెబుతున్నారు. దాదాపు వేయిమందికి పైగా తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్నారు. మూడోతేదీ సాయంత్రం పశ్చిమబెంగాల్ షాలిమార్ నుంచి చెన్నయ్ సెంట్రల్‌కు ప్రయాణిస్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఒడిషాలోని బాలాసోర్‌లో బహానాగ్ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు తప్పి గూడ్స్ రైలును ఢీకొట్టింది. పక్కనే ఉన్న ట్రాక్‌పై కోచ్‌లు పడిపోగా, అటుగా వచ్చిన బెంగళూరు హౌరా ఎక్స్‌ప్రెస్ పడివున్న కోచ్‌లను ఢీకొట్టింది. ఐదారు బోగీలు చెల్లాచెదురైపోవటంతో పెనుప్రమాదం సంభవించింది.

దాదాపు 120మైళ్ళ వేగంతో ప్రయాణిస్తున్న రైలు ఢీకొడితే ఎంత బీభత్సంగా మారుతుంది! తమిళనాడు, బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, కర్నాటక ప్రజలు ప్రయాణికుల్లో ఉన్నారు. తెలుగు ప్రాంతాల ప్రజలే మృతుల్లో ఎక్కువ మంది ఉంటారని అంటున్నారు. తమిళనాడుకు చెందిన 38మంది మరణించారని ప్రకటించారు. ప్రమాదం జరగగానే స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా సహాయ సహకారాలు అందించి, క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. రక్తదానం చేయటానికి వందలాది మంది జనం ముందుకు రావటం చూస్తుంటే మానవీయాంశ ప్రజల్లో ఘననీయంగా ఉందని రుజువవుతుంది. రైల్వే సిబ్బంది, విమానయాన సిబ్బంది, పోలీసులు ప్రయాణీకుల రక్షణ చర్యల్లో ముమ్మరంగానే పాల్గొంటున్నారు. పోయిన ప్రాణాలను చూస్తుంటే దుఃఖం నిండుతుంది. కుప్పలుగా శవాలు, కాళ్ళూ, చేతులు విరిగి రక్తప్రవాహాలతో తడిచిన ఆ ప్రదేశం ప్రతి ఒక్కరినీ కదిలిస్తోంది. కలచివేస్తోంది. ఎన్ని లక్షల ఎక్స్‌గ్రేషియాలు ప్రకటించినా తన వాళ్లను కోల్పోయిన దుఃఖాన్ని ఆపలేదు.

ఎందుకిలా జరిగింది? ఎవరు దీనికి కారకులు? మానవతప్పిదమా? సాంకేతిక లోపమా? వ్యవస్థాగత వైఫల్యమా, యాదృచ్ఛికమా దర్యాప్తు అనంతరం ఏదో ఒక కారణాన్ని లేదా కారణాలను బయటపెట్టవచ్చు. మన రైల్వే వ్యవస్థకు సుదీర్ఘ చరిత్ర ఉంది. చాలా నిబద్ధంగా పనిచేసే శ్రామికులూ, పటిష్టమైన జాగ్రత్తలూ, విధి విధానాలు ఉంటాయి. మరి గూడ్స్ ఆగివున్న ట్రాక్‌పైకి మరో రైలు ఎలా వచ్చింది! ఎందుకు వచ్చింది. ఇది తేలవలసి ఉన్నది. ఏదో సమన్వయం లోపం విభాగాల మధ్య ఉన్నట్టు తోస్తున్నది. బహనాగ్ రైల్వేస్టేషన్‌లో సిగ్నలింగ్‌లో వైఫల్యం జరిగింది. నిపుణులు చెబుతున్నదాన్ని బట్టి రైల్వే సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి పెరిగిందని తెలుస్తున్నది. మనం రైలు వేగాల గురించి, అధిక రైళ్ల గురించి మాట్లాడుతుంటాం. కానీ అందుకు కావలసిన ఏర్పాట్లను సరిచేసుకోము. ఏదైనా లోపాలుంటే ఏదో సరిచేసి తిరిగి పంపిస్తారు తప్ప కొత్తకోచ్‌లు సిద్ధంగా ఉండవు. కోచ్‌లు, ఇంజిన్‌ల లోపాలను సరిచేయగలిగే 2000మంది సిబ్బంది కొరత ఉందని చెబుతున్నారు. మొత్తం 2,80,000మంది సిబ్బంది ఖాళీలున్నాయి. రైళ్ళు పెంచుతున్నారు. కానీ ప్రతి సంవత్సరం రెండు శాతం చొప్పున ఉద్యోగులను తప్పిస్తున్నారు. బుల్లెట్ ట్రెయిన్, వందేభారత్ రైళ్ళు, సూపర్ స్పీడుపై మోజు పెంచుతారు కానీ, సేఫ్టీ విభాగంలో ఉండాల్సిన ఉద్యోగులు మాత్రం కొరతలోనే. లోకోపైలట్స్ సిబ్బంది కొరతా ఉంది. ఇకపోతే ప్రధానంగా ప్రతి విభాగాన్నీ ప్రయివేటుకు కాంట్రాక్టుకు కట్టబెట్టేశారు. కాంట్రాక్టుకు తీసుకున్న వాడు పదిమంది చేయాల్సిన చోట ఇద్దరు, ముగ్గురితో పనిచేయిస్తున్నాడు. సిగ్నలింగ్ వ్యవస్థనూ కాంట్రాక్టుకు ఇచ్చేశారు. గతంలో శాశ్వత ఉద్యోగులుగా ఉన్న గాంగ్‌మెన్‌లు, ట్రాక్‌మెన్‌లు, కిందితరగతి ఉద్యోగులు అంకితభావంతో శ్రద్ధగా అప్రమత్తంగా ఉండి పనులు చేసేవారు. ఇప్పుడు కాంట్రాక్టు కార్మికులకు అంతటి బాధ్యత ఎక్కడుంటుంది! ప్రపంచ రైల్వే సిస్టంతో మన రైల్వేలను పోల్చుకోవద్దు. మన భౌగోళిక పరిస్థితులు వేరు, మన జనాభావేరు. దీనికి తగిన విధమైన స్పీడును, ప్రయాణ విస్తరణను చేపట్టవల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.


కాబట్టి ప్రారంభించిన రైలునే పదిసార్లు ప్రారంభించి రాజకీయ ప్రయోజనాలను పొందటమే ధ్యేయంగా పనిచేస్తున్న పాలకులు, సామాన్యులు ప్రయాణించే రైళ్ల బాగోగులను పట్టించుకోవాలి. ప్రయివేటీకరణే అన్నింటికీ పరిష్కారం అనే మానసిక స్థితి నుండి బయటపడి వాస్తవాలను ఆలోచించాలి. ప్రజల భద్రతకు ఏం చేయాలో తెలుసుకుని ఇప్పటికైనా పూనుకోవాలి. జరిగిన దుర్ఘటనకు పాలకులు బాధ్యత వహించాలి. దుఃఖితులకు ఓదార్పు నివ్వాలి.

ఎక్కడైనా సరే విధానాలు మారకుండా నాయకుల గొప్పతనమే కీలకమన్న ప్రచారాలు ఆపాలి. విభజన సమస్యలు ఇచ్చిపుచ్చుకునే రీతిలో పరిష్కరించుకోవాలి. కావాలని వాటిని పేరబెట్టిన కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడి తేవాలి. సహేతుకమైన సత్వర పరిష్కారాలు ఉభయులకూ మేలు చేస్తాయి. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు లౌకిక విలువలను, మతసామరస్యాన్ని కోరుకుంటారు. ఏపీలో పాలకపార్టీలన్నీ బీజేపీతో చేరినా ప్రజలు మాత్రం గతంలో వలెనే ఇప్పుడూ మతరాజకీయాలను ఆదరించే ప్రసక్తి ఉండదు. ఆ లౌకిక ప్రజాస్వామ్యాన్ని, సహోదర భావాన్ని కాపాడుకోవడమే తెలుగు రాష్ట్రాలకు నిజమైన రక్ష.

బీజేపీపై పోరాటానికి మద్దతు తెలిపిన వామపక్షాలు మునుగోడు ఉప ఎన్నికలలో బీఆర్ఎస్ గెలుపునకు కారణమైనాయి. కర్నాటక విజయం తర్వాత కాంగ్రెస్ హడావుడి పెరగ్గా బీజేపీ హంగామా తగ్గింది. అనేక చిన్నపార్టీలు కూడా కేవలం బీఆర్ఎస్‌పైనే కేంద్రీకరించి మతతత్వ రాజకీయాలపై మాట్లాడటం లేదు. ఈ మధ్యలోనే నూతన సచివాలయం, అంబేద్కర్ విగ్రహం అమరుల స్థూపం వంటివాటితో కేసీఆర్ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం తీవ్రంగానే చేస్తున్నారు. ఈ విధంగా తెలంగాణ రాజకీయం మూడో ఎన్నికలతో కొత్త మలుపుతిరిగే పరిస్థితి నెలకొంది.

రెండు రాష్ట్రాలు - రెండు దృశ్యాలు

జూన్ రెండవ తేదీతో తెలుగు రాష్ట్రాల విభజన పదో ఏట ప్రవేశించింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ దశమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభించాయి. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం నవంబర్ ఒకటవతేదీనే అవతరణ దినోత్సవంగా జరుపుతున్నారు. ఈ తొమ్మిదేండ్ల పరిస్థితులపై మీడియా చర్చలు నిర్వహించింది. తెలంగాణ నుంచి అప్పటి ఉద్యమ కారులు వివిధ పార్టీల నాయకులు చర్చల్లో పాల్గొంటే ఏపీ నుంచి మాత్రం ప్రధానంగా నాడు ఈ తతంగానికి చివరిదాకా భాగం పంచుకున్న నాటి కాంగ్రెస్ మాజీ ఎంపిలే ప్రతినిధులయ్యారు. పత్రికలలోనూ వివిధ వాదనలతో వ్యాసాలు వచ్చాయి.




తెలకపల్లి రవి

తెలంగాణలో ఏడాది పొడుగునా ఉత్సవాలు జరపడమే గాక ఏడాది చివరలో ఎన్నికలు వస్తాయి గనక ఎక్కువ వాదోపవాదాలు జరుగుతాయి. అదే ఏపీ విషయానికి వస్తే వేడుకగా జరుపుకోవడం కంటే విభజన సమస్యలపై దృష్టి ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రానికి సంబంధించిన రెవెన్యూ లోటు భర్తీ, తెలంగాణ నుంచి బకాయిలు, నదీజలాల పంపిణీ వంటివాటిపై బోలెడు ఫిర్యాదులున్నాయి. వీటికి తెలంగాణ వాదనలు మరో విధంగా ఉన్నాయి. రావలసిన బకాయిలపైనా ఉభయ రాష్ట్రాలు భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాల విషయానికి వస్తే కూడా తెలంగాణలో వరసుగా టీఆర్ఎస్/బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో కొనసాగుతుంటే, ఏపీలో మొదటి పర్యాయం చంద్రబాబు నాయుడు టీడీపీ సర్కారు తర్వాత వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీ సర్కారు పాలన సాగుతున్నది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరో ఏడాదిలో ఉమ్మడి రాజధాని హోదా ముగిసిపోనుండగా, ఏపీ రాజధాని సమస్య ఎడతెగని ప్రతిష్టంభనగా మారింది. ఇలా రెండు రాష్ట్రాలు రెండు భిన్న దృశ్యాలను తలపిస్తున్నాయి.

తెలంగాణలో పరిస్థితి

తెలంగాణ ఏర్పడిన తొలిదశలో కేసీఆర్ అవతలిపార్టీల నుంచి భారీగా ఎంఎల్ఎలను చేర్చుకున్నారు. బంగారు తెలంగాణ నిర్మాణానికి వారంతా కలసి వచ్చినట్టు చెప్పారు. స్వల్పమెజార్టీతోనే అధికారానికి వచ్చిన టీఆర్ఎస్ అధినేత తన ప్రభుత్వాన్ని కూలదోసేకుట్ర జరుగుతున్నట్టు సమాచారం రావడం వల్లనే ఈ చర్య తీసుకున్నట్టు చెప్పారు. నెమ్మదిగా తెలంగాణలో కాంగ్రెస్, టీడీపీల నుంచి చాలామంది నాయకులు టీఆర్ఎస్‌లో చేరారు. రెండోసారి శాసనసభ ఎన్నికల తర్వాత ఆ లెజిస్లేచర్ పార్టీలే అదృశ్యమయ్యాయనే వాతావరణం కల్పించబడింది. మరోవైపున పాలనాపరంగా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై అత్యధిక ప్రాధాన్యత పెట్టారు. దానికి సంబంధించి అనేక ఆరోపణలు భారీ అప్పులు కూడా పెరిగాయి కానీ దాని ప్రయోజనం తిరుగులేనిదన్న వాదనపైనే ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లింది. చెరువుల పునరుద్ధరణ, యాదాద్రి పునర్నిర్మాణం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, విద్యుదుత్పత్తి, గురుకులాలు, కొత్తజిల్లాలు, రైతుబంధు, దళితబంధు, వైద్యం ఇలా వివిధ పథకాలపై కేంద్రీకరించారు. హైదరాబాద్ అప్పటికే ఐటిహబ్‌గా ఉంది గనక దాన్ని మరింత వేగవంతం చేశారు. ధనిక రాష్ట్రం అన్న మాట చెబుతూనే వీటి కోసం అప్పులు కూడా భారీగానే చేశారు. మొత్తంపైన కేసీఆర్ పాలనపై తొలిదశలో మొత్తం ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్ కొనసాగింది. మీడియా యుద్ధాలూ సాగాయి. ఉద్యోగుల విషయంలోనూ పలు సమస్యలున్నా సానుకూల నిర్ణయాలు తీసుకుని సద్భావన కోసం కృషి చేశారు. అనేక అంశాల్లో విమర్శలూ ఉన్నా మొత్తంపైన మిశ్రమ ప్రభావమే కనిపించింది. కరోనా వ్యాప్తికి ముందువరకూ కేసీఆర్ చాలావరకూ కేంద్రంతో మోడీతో సత్సంబంధాలే నెరిపారు. అయితే బండి సంజయ్ తదితరుల నాయకత్వం మోడీ మలిదశ అధికారం వచ్చాక క్రమేణా కేంద్ర విధానాలపై విమర్శలు పెంచారు. రాష్ట్రాల హక్కులకు భంగం, మతతత్వ రాజకీయాలు గట్టిగా వ్యతిరేకించడం మొదలెట్టారు. తన పార్టీని బీఆర్ఎస్‌గా మార్చారు. ఈ దశలో బీజేపీ తానే అధికారంలోకి వస్తానంటూ హడావుడి చేసి మతరాజకీయాలు పెంచేందుకు ప్రయత్నించింది. కాంగ్రెస్ అనైక్యత ఒకవైపు, దేశవ్యాపిత బలహీనత ఇంకోవైపు వెంటాడాయి. మొత్తంపైన కేసీఆర్ కుటుంబపాలన అన్నదే ఈరెండు పార్టీలకూ ప్రధాన నినాదంగా తయారైంది. ప్రతిపక్షాల ఆందోళనలపైనా ప్రభుత్వం తీవ్రంగానే వ్యవహరించింది. బీఆర్ఎస్‌గా మారాక చుట్టుపక్కల రాష్ట్రాలలో కార్యకలాపాలు పెంచేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర సమితి భారత రాష్ట్ర సమితిగా మారడం ఒక రాజకీయ మార్పు. అయితే ప్రతిపక్ష ఐక్యత పట్ల ఇప్పటికీ బీఆర్ఎస్‌కు భిన్న వ్యాఖ్యలు చేస్తుంటుంది. మోడీని దించడమే కీలకం కాదని ప్రభుత్వ నిర్వహణ మారడం కీలకమని అంటుంటుంది. తమకు ఫ్రంట్‌లు స్టంట్‌ల పట్ల ఆసక్తి లేదని తాజాగా కూడా కేటీఆర్ చెప్పారు.



బీజేపీపై పోరాటానికి మద్దతు తెలిపిన వామపక్షాలు మునుగోడు ఉప ఎన్నికలలో బీఆర్ఎస్ గెలుపునకు కారణమైనాయి. కర్నాటక విజయం తర్వాత కాంగ్రెస్ హడావుడి పెరగ్గా బీజేపీ హంగామా తగ్గింది. అనేక చిన్నపార్టీలు కూడా కేవలం బీఆర్ఎస్‌పైనే కేంద్రీకరించి మతతత్వ రాజకీయాలపై మాట్లాడటం లేదు. ఈ మధ్యలోనే నూతన సచివాలయం, అంబేద్కర్ విగ్రహం అమరుల స్థూపం వంటివాటితో కేసీఆర్ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం తీవ్రంగానే చేస్తున్నారు. ఈ విధంగా తెలంగాణ రాజకీయం మూడో ఎన్నికలతో కొత్త మలుపుతిరిగే పరిస్థితి నెలకొంది.

ఏపీలో ఏమవుతోంది?

ఏపీ విషయానికి వస్తే ఈ కాలంలో రెండు ప్రభుత్వాలు మారాయి. చంద్రబాబు ఘోర పరాజయం, జగన్ వైసీపీ అసాధారణ మెజార్టీ అక్కడ పరిస్థితిని మార్చేశాయి. చంద్రబాబు గొప్పగా చెప్పుకున్న రాజధాని అమరావతి తొలిదశలో ఉండగానే దిగిపోయారు. జగన్ మూడు రాజధానుల విదానం ప్రకటించి లీగల్ రాజకీయ వివాదం చేస్తున్నారు. టీడీపీ హైటెక్ విజన్ ప్రచారంతో కాలం గడిపితే, జగన్ అచ్చంగా బటన్‌నొక్కి సంక్షేమ పథకాల నిధులు బదలాయించే విధానం పెట్టుకున్నారు. కియా వంటి ఒకటి రెండు కంపెనీలు తప్పితే పెట్టుబడులు రావడం ఉపాధి కల్పన చాలా సమస్యగా మారాయి. సచివాలయ వాలంటీర్ల ఉద్యోగాలే జగన్ ప్రభుత్వం ప్రధానాంశంగా చెప్పుకుంటుంది. అప్పులు విపరీతంగా పెరిగాయి. పైగా కేంద్రం విభజన చట్టంలోని హామీలు అమలు చేయకపోవడం వల్ల రాష్ట్రం మరింత నష్టపోయింది. ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, రెవెన్యూలోటు ప్రతిదీ అసంపూర్ణంగానే మిగిలింది. హైదరాబాదులో ఉమ్మడి సంస్థల నిధుల విభజన కూడా చాలాభాగం మిగిలేవుంది. చంద్రబాబు హయాంలో ప్రభుత్వంలో కూడా ఉన్న బీజేపీ ఇందులో ఒక్కటైనా పూర్తి చేసేందుకు ప్రయత్నించింది లేదు. జగన్ చంద్రబాబు కూడా బీజేపీతో మంచిగా లోబడి ఉండటానికి పాకులాడటంతో ఏపీ పరిస్థితి అధ్వాన్నంగానే తయారైంది. తన పాలన కొనసాగివుంటే అద్భుతమైన అభివృద్ధి జరిగేదని చంద్రబాబు అంటుంటే తన సంక్షేమ పథకాలే మహత్తరమైనవని జగన్ ప్రచారం సాగుతున్నది. ఉభయులూ కలిసి కేంద్రంపై ఒత్తిడి తేవడానికి పోరాడవలసింది పోయి దాని మెప్పుకోసం పాకులాడటంలో పోటీ పడుతున్నారు. మధ్యలో జనసేన సరేసరి. ఏతావాతా ఏపీ అభివృద్ధి వెనకబడిపోవడం కాదనలేని సత్యం. ప్రతిపక్షాలపై నిర్బంధం అసహన రాజకీయాలు, మీడియా వివాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇన్నిటి మధ్యనా రాష్ట్రంలో ఒక అనిశ్చితి ఏర్పడింది. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపనలు, భూమిపూజలు పెంచుతున్నా అవి పూర్తి కావడానికి నిధులు కాని వ్యవధికాని లేవు. ఆఖరుకు చంద్రబాబు కూడా తన 2020, 2047 విజన్‌లు పక్కనపెట్టి జగన్ తరహా పథకాలు అమలు చేస్తానని ప్రణాళిక ప్రకటించడం మొదలెట్టారు. ఏమైనా రాజధాని, పోలవరం, రాయలసీమ వంటి సమస్యలేవీ ఎన్నికల లోపు పరిష్కారమయ్యే ఆశలు లేవు. ఒక్కముక్కలో చెప్పాలంటే విభజితాంధ్ర ప్రదేశ్ పరిస్థితి అయోమయంగానే తయారైంది. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ లాంటి కొత్త సవాళ్లు కూడా ముంచుకొచ్చాయి. ప్రకృతి వనరులూ ప్రజల శక్తియుక్తులకు లోటులేని ఏపీ సమగ్రాభివృద్ధి ప్రాంతీయ సమతుల్యత దిశలో అడుగులు వేయాలి. టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారి ఏపీలోనూ రాజకీయ ప్రవేశం చేసింది గనక రెండు రాష్ట్రాల రాజకీయాలు మాట్లాడుతున్నది.

సహేతుక పరిష్కారాలు

కొంతమంది అంటున్నట్టు ఇదేదో రెండు రాష్ట్రాల మధ్య వైరుధ్యంగానో నాయకుల గొప్పతనం లేదా లోపంగానో చూడటం పాక్షికమవుతుంది. స్వాభావికంగానే విభజన ప్రభావం రెండుచోట్ల రెండు రకాలుగా ఉంది. ఒకరినొకరు పోటీ పెట్టి చూసుకోవడం చులకన చేసుకోవడం అవాంఛనీయం. ప్రధాన పాలకపార్టీలు ఎక్కడి పాట అక్కడ పాడటం మానాలి. ఎక్కడైనా సరే విధానాలు మారకుండా నాయకుల గొప్పతనమే కీలకమన్న ప్రచారాలు ఆపాలి. విభజన సమస్యలు ఇచ్చిపుచ్చుకునే రీతిలో పరిష్కరించుకోవాలి. కావాలని వాటిని పేరబెట్టిన కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడి తేవాలి. సహేతుకమైన సత్వర పరిష్కారాలు ఉభయులకూ మేలు చేస్తాయి. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు లౌకిక విలువలను, మతసామరస్యాన్ని కోరు కుంటారు. ఏపీలో పాలకపార్టీలన్నీ బీజేపీతో చేరినా ప్రజలు మాత్రం గతంలో వలెనే ఇప్పుడూ మతరాజకీయాలను ఆదరించే ప్రసక్తి ఉండదు. ఆ లౌకిక ప్రజాస్వామ్యాన్ని, సహోదర భావాన్ని కాపాడుకోవడమే తెలుగు రాష్ట్రాలకు నిజమైన రక్ష.

ఆకాశరామన్నలు...

మన తాతల కాలంలో సమాచారం చేరవేయాలంటే ఒక మనిషి వెళ్లి రావాల్సిందే. అది మంచి వార్తయినా.. చెడు వార్తయినా అతడే దిక్కు. ఆ తర్వాత దినపత్రికలు, రేడియోలు వచ్చాయి. ఇక మన కాలానికి టీవీలు వచ్చి చేరాయి. ఆ విధంగా ఆకాశవాణిలో ప్రాంతీయ వార్తలు, దూరదర్శన్‌లో న్యూస్‌ను మనందరం విన్నవాళ్లమే, చూసిన వాళ్లమే. ఆ తర్వాత ప్రయివేటు టీవీ ఛానళ్ల పుణ్యమానీ... బ్రేకింగ్ న్యూస్, ఆ తర్వాత షాకింగ్ న్యూస్‌ల పేరుతో మన బీపీ ఎప్పుడో హైరేంజ్‌కు వెళ్లిపోయింది. ఇక సాంకేతిక పరిజ్ఞానం మరింతగా పెరిగిన తర్వాత, స్మార్ట్ ఫోన్, ఫోర్ జీ, ఫైవ్ జీ అందుబాటులోకి వచ్చిన తర్వాత సమాచారం అనేది విస్ఫోటమైంది. ఆ విస్ఫోటనం ఒక్కోసారి అవసరానికి పనికొస్తూ, మన అవగాహనను పెంచుతూ ఉంటే.. మరికొన్ని సార్లు అనవసరమైన, అవసరానికి మించిన ఇన్ఫర్మేషన్ బుర్రల్ని కరాబు చేస్తూ, జనాల్ని చికాకు పరుస్తూ ఉంది. ఇవి చాలదన్నట్టు నిర్ధారణ లేని అసత్య వార్తలు, ఫేక్ న్యూస్ పిచ్చెక్కిస్తున్నాయి. తాజాగా అగ్రనటుడు చిరంజీవి ఈ తప్పుడు, వక్రీకరణ వార్తల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఏదో సందర్భంలో ఎక్కడో మాట్లాడిన మాటలను వంకరగా వక్రీకరించి... 'చిరంజీవికి గతంలో క్యాన్సర్ వచ్చింది.. చికిత్స తీసుకున్న తర్వాత అది తగ్గింది...' అంటూ సోషల్ మీడియాలో రాసేసరికి, ఆయన చాలా బాధపడ్డారు. ఆరోగ్య సమస్యలు, ముందు జాగ్రత్తల గురించి మాట్లాడే సందర్భంలో తాను క్యాన్సర్ గురించి ప్రస్తావిస్తే.. తనకే క్యాన్సర్ వచ్చిందంటూ ప్రచారం చేయటమేంటంటూ మెగాస్టార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక తెలంగాణ శాసనసభకు ఎన్నికల తేదీని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిందంటూ శనివారం పలువురు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేసరికి...అదో పెద్ద హాట్‌టాపిక్ అయ్యింది. చివరికి ఎన్నికల సంఘం చెప్పిందొకటి.. సామాజిక మాధ్యమాల్లో వచ్చింది మరోటి అనేది తేలింది. ఇలా నిజమా..? కాదా..? అనేది తెలుసుకోకుండా, నిర్ధారణ లేకుండా, ఊరూ పేరూ లేని ఆకాశరామన్నలు రాసే వార్తలు, చేసే పోస్టుల గురించి జనాలు తెగ కంగారు పడిపోతున్నారు. సో...సోషల్ మీడియాతో జర జాగ్రత్త...

-బి.వి.యన్.పద్మరాజు

గీత దాటావో...జీతం కట్

'అరిటాక మీద ముల్లు పడ్డా...ముల్లొచ్చి అరిటాకు మీద పడ్డా...ప్రమాదమైతే అరిటాకుకే' అన్నట్టు ఆర్టీసీ ఉద్యోగులు ఏం చేసినా అది వారికి ఉనికే ప్రమాదకరంగా పరిణమించింది. వాహనదారులను క్రమశిక్షణలో పెట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న చర్యలు బాధాకరంగా మారుతున్నాయి. కర్ణుణి చావుకు వెయ్యి కారణాలన్నట్టు... హెల్మెట్, ట్రిబుల్ రైడింగ్, లైసెన్స్, ఆర్‌సీ, నెంబర్‌ప్లేట్ ఇవేవీ లేకపోయినా ఫైన్ల మీద ఫైన్లు బాదుతున్నారు. రాంగ్ సైడ్ పార్కింగ్, లైన్ క్రాస్, లైన్ జంపింగ్ ఇలా బాదుడే బాదుడు. అందులో వాహన దారులే సమిధలౌతున్నారు.అయితే ఆర్టీసీ డ్రైవర్లు కూడా ఇలాంటి నిబంధనలు అతిక్రమిస్తే వారి జీతం నుంచి కట్ చేస్తున్నారు.చంద్రాయణగుట్ట బ్రిడ్జి కింద ఆర్టీసీ బస్సు సిగ్నల్ లైన్ క్రాస్ చేసినట్టు గుర్తించి ఆయన జీతం నుంచి రూ 8వేల కట్ చేసింది. ఆ డబ్బును ఫైన్ల కింద ఫైన్లు చెల్లిస్తున్నది. ఇలా ఎందుకు చేస్తున్నారంటే, ఆర్టీసీ డ్రైవర్లను క్రమశిక్షణ పెట్టేందుకు, వారిని జాగ్రత్తగా ఉంచేందుకు అని చెబుతున్నారు. కానీ సిగ్నలింగ్ వ్యవస్థ లోపాలను గుర్తించడం లేదు. ఆటోమేటింగ్ సిగ్నలింగ్ వ్యవస్థ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు చలాన్ల మీద పెట్టిన దృష్టి ట్రాఫిక్ నియంత్రణపై పెట్టడం లేదు. దీంతో వాహనదారుల నుంచి ఏ చిన్న పొరపాటు జరిగినా వందలకు వందలు చెల్లించాల్సి వస్తుంది. ఆర్టీసీ డ్రైవర్లు గీత దాటారో వారి జీతం కట్ అవుతున్నది. అరకొర జీతాలతో బతుకీడుస్తున్న ఆర్టీసీ డ్రైవర్లకు ఈ నిర్ణయం గుదిబండగా మారింది. ప్రతి రోజు ఏదో ఒక చోట లైన్ క్రాస్ కావడం, జీతాలు కట్ కావడం...తక్కువ జీతాలు ఇంటికి తీసుకెళ్తే ఇంట్లో రచ్చ రచ్చే.. అని బాధపడుతున్నారు డ్రైవరన్నలు.

- గుడిగ రఘు

రివర్స్‌గేర్!

ఒకరు కొత్త ఉద్యోగాల కోసం బయటి దేశాలకు పోతే.. మరొకరేమో మన దేశంలోనే ఉన్న ఉద్యోగాలను ఊడపీకే పని చేస్తున్నారు. ఇంతకు ఎవరి గురించి అనుకుంటున్నారా?.. గదే ఢిల్లీలోని బీజేపీ సర్కార్ మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ కోట్లాది కొలువులను ఊడబీకింది. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాల మాటేమోగాని ఉన్న ఉద్యోగులను రోడ్డున పడేసింది. మరి రాష్ట్రంలోని బీఆర్ఎస్ సర్కార్ మంత్రి కేటీఆరేమో పెట్టుబడులు తీసుకొచ్చి కొలువులను కల్పించేందుకు బయటికి దేశాలకెళ్లొచ్చారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు సందర్భంగా ఇరుపార్టీల నేతలు హామీల గురించి విమర్శలు చేసుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే బీజేపీ సర్కార్ సంగతి గురిగింజ తీరులా ఉందని జనాలు ముక్కునేలేసుంటున్నారు!

-నిరంజన్ కొప్పు

'మందస్తు' ఎన్నికలు...

సార్ కొంప మునిగిపోయింది, పరిగెత్తుకుంటూ వచ్చాడు సబ్ ఎడిటర్.

ఏమైందయ్యా, అడిగాడు ప్రధాన సంపాదకుడు ఇప్పటినుండి ప్ర.స

పలురాష్ట్రాల్లో మందస్తు ఎన్నికలు అన్న హెడ్డింగుతో మన పేపర్లో న్యూస్ వచ్చింది సార్. అది నేనే చూశాను. ముందస్తు అని కరెక్టుగానే కొట్టాను. మందస్తు అని వచ్చింది.

అంత కంగారు పడకయ్యా

ఎలా సార్, మన పేపరుకే కదా చెడ్డపేరు

అలాంటిదేమీ లేదు కాని మార్పించింది నేనే

మీరా?...!


అవును నేనే, ఎలాగూ మందు లేనిది ఎన్నికలంటూ ఉండవు. ఆ మత్తులోనే జనాలు ఓటేస్తారు. అందుకని మందస్తు అని మార్పించాను. అదీ కాక ఒక్క రాష్ట్రంలో కాదు కదా, అందరినీ అన్నా, మన్నల్ని కాదులే ఇంకో రాష్ట్రం వాళ్ళపై రాశారని అందరూ అనుకుంటారు. నెహ్రూగారి పేరు ఇప్పుడు ఎక్కువ వాడకుండా ఉన్నారు కాని ఆయన ఈ సభలో సగం మంది మూరు?లు అంటే అందరూ కోప్పడ్డారు, వెంటనే ఈ సభలో సగం మంది తెలివైనవాళ్ళు అనగానే అందరూ చల్లబడ్డారు. అలా నేర్పుగా ఉండాలి మనం.



జంధ్యాల రఘుబాబు
9849753298

ప్ర.స మాటలతో మాటలేమీ రాక నిశ్శబ్దంగా ఉన్నాడు సబ్ ఎడిటర్. ప్ర.స వెనుకనున్న కురుక్షేత్రంలోని బొమ్మ, శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశమిస్తున్న ఫోటోలో చేతిలో చక్రంతో ప్ర.స, కింద కూచొని నమస్కారం పెడుతూ తాను ఉన్నట్టు కనిపించాయి సబ్ ఎడిటరుకు.


తరువాత ఆలోచిస్తుంటే సబ్ ఎడిటరుకు ఇంకా కొత్త కొత్త పదాలు తట్టాయి. మందస్తును మహా మందస్తు, మహామహా మందస్తు, అభినవ మందస్తు, పూర్వ పురాతన మందస్తు, పురాణ మందస్తు ఇలా ఎన్నో రకాలుగా వాడుకోవచ్చు అనుకున్నాడు. ఇంతలో అటుగా పోతున్న ప్ర.స మందస్తును తరువాత డెవెలప్ చేయొచ్చుగాని ఉదయం చెప్పిన వ్యాసం కథ చూడు అనేసి పోయాడు. వామ్మో ఎలా కనిపెట్టాడీయన అనుకొని, ఆ తను కూడా ఇలా నాలాగ పనిచేసినవాడే ప్ర.స కాకముందు అనుకొని తప్పి పడ్డాడు. ఈ మందస్తు మందు, మందు రూపంలోనే ఉండాలన్న నియమం లేనేలేదు. మత్తు కలిగించే, మత్తులో ముంచే మాటలేవైనా కావచ్చు, ఎన్నికల మానిఫెస్టోలో ప్రలోభపెట్టే పథకాలు కావచ్చు, ఉచిత స్కీములు కావచ్చు, ఉద్యోగాలిస్తామనే తీయటి నీటి మూటలు కావచ్చు ఏదైనా మత్తెక్కిస్తే చాలు. కులాలు, మతాలు కూడా మత్తుమందులేనని చెప్పిన మహానుభావులూ ఉన్నారు. వారికి ప్రజలమీద ప్రేమ ఉండబట్టి మత్తు ఏది, నిజమైనదేమి అన్న విషయాలు చెప్పి మరీ వెళ్ళారు. అవి చదవడంలో, చదివినా అర్థం



చేసుకోవడంలో కలిగిన లోపాల వల్ల జనాలకు వాటిపై సరైన అవగాహన లేదు. అవగాహన లేకపోవడం, తప్పుడు అవగాహన తెచ్చుకోవడం కూడా మత్తేనని మా మిత్రుడు చెబుతాడు. అన్న రామారావు పాట ఉండనే ఉంది. "మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా, ఆ మత్తులోన పడితే గమ్మత్తుగ చిత్తైదువురా". అలా జీవితంలో సగభాగం నిద్రలో ఉండే జనాలు ఇతర మత్తుల్లో పడి ఇంకొంత భాగం జీవితాన్ని ఏదో ఒక రకమైన మత్తులో గడిపి మెలకువకంటే నిద్రలోనే ఎక్కువ ఉండిపోతారు.

ఏరా ఫుల్లుగా పోయించావా అనడుగుతాడు నాయకుడు తన కారును చూపిస్తూ. ఆ పోయించాను సార్ అంటాడు అనుచరుడు. చూసేవాళ్ళు కారులో పెట్రోలు గురించి అడుతుతున్నాడేమో అనుకుంటారు. ఆ "పోయించడం" వేరన్న సంగతి చాలామందికి తెలియదు. ఇందాకే అనుకున్నట్టు మనుషులను రకరకాల గ్రూపులుగా విడగొట్టి వారికి కావలసిన తాయిలాలను ఫుల్లుగా ఇచ్చేసి తాను కూడా ఫుల్లుగా సీట్లు కొట్టేసినట్టు కలలు కంటాడు నాయకుడు. తానొక్కడే ఫుల్లుగా పనులు చేస్తున్నానని భ్రమలో ఉన్నోడికి ఇతరులు చేసేది తెలుసుకోవడం పెద్ద విషయం కాదు.

మామూలుగా మత్తు తరువాత గమ్మత్తుగా ఉంటుంది. కొద్దిసేపు ఏమవుతుందో తెలియదు. తమకు తెలుసుకునే అవకాశాన్ని ఆ మత్తు ఈయదని కూడా తెలుసుకోలేని స్థితిలో ఉంటారు జనాలు. అలాంటిది మత్తంటే. ఇక మత్తు దిగాక తెలుస్తుంది అసలు కథ. ఏరు దాటేవరకు మాత్రమే ఓడ మల్లయ్య అని పిలిచేది, ఆ తరువాత బోడి మల్లయ్య మాత్రమే మిగులుతాడు. మళ్ళీ ఓడ మల్లయ్య కావాలంటే మరో ఐదేళ్ళు పడుతుంది. అందుకే ఎలాంటి మత్తుకు లొంగకుండా ఏకంగా మన జీవితాలు మత్తులోకి కూరుకుపోకుండా చూసుకునే బాధ్యత మనదే. మెజారిటీ మత్తులో మునిగినా



మత్తులో లేని మిగతావారితో కలుపుకుని అందరూ మునిగినట్టేనన్న సంగతి గుర్తుపెట్టుకుంటే మన మత్తు కొద్దిగానైనా దిగుతుంది.

అసలు నెలలు నిండకుండా పుట్టే బిడ్డలో లోపాలుంటాయి చాలాసార్లు. ముఖ్యంగా తల్లికి బిడ్డకు ప్రమాదమని తెలిసినప్పుడే ముందుగానే డెలివరీ చేస్తారు. కాబట్టి ఆ రిస్కు తీసుకునే అడుగు ముందుకేస్తారు. ఒకవేళ అలా పుట్టిన శిశువులో లోపాలు లేకున్నా బిడ్డ బరువు తక్కువగా ఉంటుందడం లాంటి ఇబ్బందులుంటాయి. అలాంటి శిశువును జాగ్రత్తగా చూసుకోవాలి. ఇంక్యుబేటరులో పెట్టాలి. ఒక్కరోజుకు ఇంత అని ప్రత్యేకంగా ఛార్జీలు వేస్తారు. ఈ ముందస్తు కూడా అలాంటి శిశువే అని గమనించాలి. ఏదో ప్రమాదంలో ఉన్నప్పుడు మాత్రమే ముందస్తు నిర్ణయం తీసుకుంటారు. తన బలం తగ్గుతూ ఉండడం ఒకటైతే, ఎదుటివాడి బలం పెరుగుతూ ఉండటం రెండోది. దమ్ముంటే ధైర్యముంటే వెంటనే ఎన్నికలు పెట్టమనండి ఎవరు గెలుస్తారో అని ప్రతిపక్షంలో ఉన్నోళ్ళు అంటారు. ఎందుకంటే వాళ్ళకు పోయేదేమీ ఉండదు వచ్చేదే తప్ప. కుర్చీలో కూచున్నోడు కూడ అంతే ఘాటుగా ఈ క్షణంలో ఎన్నికలు పెట్టినా, అర్ధరాత్రి ఎన్నికలు పెట్టినా మేమే తిరిగి అధికారంలోకి వచ్చేది అని చెప్పేస్తారు. ఇంకా వీలైతే తాము నిర్వహించిన సర్వేలో కూడా తామే గెలుస్తామని వచ్చిందనీ చెప్పొచ్చు.

పూర్వకాలంలో ఎన్నికలు లేవుకాబట్టి మనుష లను కూడగట్టడాలు, యుద్ధాలులాంటి అవసరాలు వచ్చినప్పుడు డైరెక్టుగా కొన్నిసార్లు, తెలియకుండా కొన్నిసార్లు మత్తుమందులిచ్చి వశపరచుకొని తమ పని చేయించుకొన్నవరిని చూశాము. ఇప్పుడదంతా లేదు ఏకంగా మందు పోసెయ్యడమే. ఇది ప్రజాస్వామ్యంలో అత్యున్నత దశగా గెలవాలను కున్నోళ్ళు అనుకోవచ్చు. లేదు అది ఎప్పుడో చని పోయిందని కొందరు అమాయకులు అను కోవచ్చు. ఏమైనా ఎన్నికలతో కొన్ని ఇతర కలలు, కళలు కలిసి పోయి మత్తులో ముంచుతున్నాయన్నది మాత్రం నిజం. అన్ని రకాల మత్తులను వదిలినప్పుడే ప్రజలు నిజంగా తమను తాము పాలించుకుంటారు.



అన్నింటా తామైన మహిళాలోకం

ఎన్నో ఏండ్ల కల... దశాబ్దాల నాటి పోరాటం... యాస, భాష, సంస్కృతి పునరుజ్జీవానికై పోరు... ఫలితంగా తెలంగాణ రాష్ట్రం అవతరించింది. ఇప్పుడు దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటోంది. అన్నింటా తామై మాట, పాట, ఆటలతో ఉద్యమానికే ఊపిరి పోసింది మహిళా లోకం. ఉత్పత్తిలోనే కాదు పోరాటాల్లోనూ సగభాగమయ్యారు. ఆత్మగౌరవ పతాకాన్ని రెపరెపలాడించారు. అలాంటి మహిళల జీవితాలు తొమ్మిదేండ్ల స్వరాష్ట్రంలో ఎలా ఉన్నాయో, తెలంగాణ ఉద్యమంలో మమేకమై పోరాడిన కొందరు మహిళా ప్రముఖులు ఏమంటున్నారో తెలుసుకుందాం...

దశాబ్ది ఉత్సవాలలో తెలంగాణ

1951- 1952లో నాన్ ముల్కీ గో బాక్‌తో మొదలైన తెలంగాణా ఉద్యమం ఢక్కామొక్కీలు తింటూ గుణపాఠాలు నేర్చుకుంది. ప్రజల ఉద్యమం భూమికగా 2014లో ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది. తెలంగాణా ఆత్మగౌరవ పతాక రెపరెపలాడింది. ఇక్కడి రచయితల సాహితీ సృజనపై కమ్ముకున్న చీకట్లు పటాపంచలైనై. మిషన్ భగీరథతో ఆడబిడ్డల కష్టాలు గట్టెక్కినై. కోత లేని కరెంటు కంటివెలుగై నిరంతరంగా విద్యార్థులతో పాటు ప్రజలను కార్యోన్ముఖులను చేస్తున్నది. దళితబంధు, రైతుబంధు, డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకం, కంటి వెలుగు, ఆసరా ఫించన్లు, బాలింతలకు కె.సి.ఆర్. కిట్టు, కల్యాణలక్ష్మి, వంటి పథకాలతో పాటు షీ టీంల ఏర్పాటు అన్నీ ప్రజోపయోగాలే. చెరువు పూడికల కార్యక్రమం గ్రామాలకు పూర్వ వైభవం తీసుకొచ్చింది. ఈ సంక్షేమ పథకాలన్నీ అంచెలంచెల వ్యవస్థలుగా ప్రజలకు అందుబాటులోకి వచ్చేవే. ఈ దొంతరల వారి వ్యవస్థలో ఈ పథకాలు ప్రజలకు సంపూర్ణంగా లబ్ధి చేకూరడం లేదనే అపవాదు ఉంది. దీనిలో మధ్య దళారీల అనైతికత కొంత వరకు కారణమవుతోంది. మధ్య దళారీల పెత్తనం, అనైతికత లేకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవలసి ఉంది. రైతుబంధు విషయానికి వస్తే సన్నకారు రైతులకు పరిమితం చేస్తే సార్థకత ఉండేది. ఇక్కడి సంస్కృతిని సాహిత్యాన్ని మరింత వికసింప చేయడానికి ఈ మట్టి మూలాలను దృష్టిలో పెట్టుకుంటే తెలంగాణా ప్రజల లక్ష్యం నెరవేరుతుంది. ఏది ఏమైనా తెలంగాణా రాష్ట్ర అవతరణ ఈ ప్రాంత యాసను, భాషను, సంస్కృతిని, సాహిత్యాన్ని పునరుజ్జీవింప చేస్తూ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిందనేది నూటికి నూరు పాళ్ళ సత్యం. దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఈ సమయంలో లోటుపాట్లను సరిదిద్దుకుంటూ రాష్ట్రం మరింత ఆదర్శవంతంగా వెలుగొందాలని ఆశిస్తూ...




- డా॥ తిరునగరి దేవకీ దేవి, తొలి మలిదశ ఉద్యమకారిణి

మహిళా ప్రాధాన్యం మరింత పెరగాలి

అనేక కష్టనష్టాలకు ఓర్చి దశాబ్దాలుగా ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసుకున్నాం. ఆనాడు ఆంధ్రుల పెత్తనంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి కాలేదనేది జగద్విదితం. అందులో భాగమే మహిళల అభివృద్ధి. ఆనాడు మహిళలకు తగిన ప్రాధాన్యం లేదు. ముఖ్యంగా ఇప్పటి ప్రభుత్వంలో కూడా మహిళలకు తగినంత నిష్పత్తిలో ప్రాధాన్యం లేదు. కాబట్టి మహిళలకు 50శాతం మేరకు ఇరు శాసన సభల్లో తప్పక ప్రధాన్యం కల్పించాలి. అన్ని రకాల ఉద్యోగాల్లో ముఖ్యంగా వైద్య, విద్యా రంగాల్లో మహిళల ప్రాధాన్యం పెరగాలి. అలాగే మంత్రి వర్గంలో మహిళల సంఖ్య పెరగాలి. మహిళల రక్షణ విషయంలో మరింత శ్రద్ధ వహిస్తూ తక్షణ న్యాయం జరిగేట్టు చూడాలి. అన్ని చోట్ల మహిళా గొంతుకు అవకాశమివ్వాలి. ప్రభుత్వం చిన్నా, చితక పరిశ్రమలను ఏర్పాటు చేసి మహిళా ఎంటర్ ప్రెన్యూనర్లను పెంచాలి. సుదీర్ఘ ఉద్యమంలో పాల్గొన్న మాలాంటి సీనియర్ల అనుభవాలు, అభిప్రాయాలను అవసరమైన చోట పరిగణలోకి తీసుకోవాలి. అప్పుడే తెలంగాణ ప్రగతిరథం అభివృద్ధి బాటలో సాఫీగా పరుగులు పెడ్తుంది.



- తుర్లపాటి లక్ష్మి రచయిత్రి



ప్రధాన భూమిక పోషించారు

ప్రపంచం గుర్తించిన పోరాటం తెలంగాణ ఉద్యమం. మహిళలు ఇందులో ప్రధాన భూమిక పోషించారు. ప్రతి మహిళ వారి వారి స్థాయిలో ఏం చేయగలరో అది రాష్ట్రం కోసం చేశారు. నిరక్షరాస్యులు కూడా దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ఉద్యమంలో పాల్గొన్నారు. గొంతెత్తి నినదించారు. పురుషునికన్నా ఎక్కువగానే పోరాటంలో పాల్గొన్నారు. మగవారు ఏదో ఓ మేరకు పేరు, పదవుల కోసం పోరాటంలో పాల్గొని ఉండొచ్చు. కానీ మహిళలు మాత్రం ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా ఉద్యమంలో పాల్గొన్నారు. మహిళల భాగస్వామ్యం లేకుండా ఏ పోరాటమైన సంపూర్ణం కాలేదు. అలాగే తెలంగాణ ఉద్యమం కూడా. అలా అందరూ కోరుకున్నట్టు సాధించుకున్న తెలంగాణలో మహిళలకు సముచిత స్థానమే లభించింది. ముఖ్యంగా విద్య అవకాశాలు కొంత మేరకు పెరిగాయి. హాస్టల్ సౌకర్యాలు, ఫ్రీ బస్‌పాస్‌లు, శానిటరీ కిట్స్ లాంటివి ఇస్తున్నారు. దీని వల్ల పిల్లలు ధైర్యంగా బటయకు వచ్చి అలాగే కళ్యాణలక్ష్మి వచ్చిన తర్వాత కొంత వరకు బాల్య వివాహాలు తగ్గాయలని చెప్పవచ్చు. ఎందుకంటే 18 ఏండ్లకు పెండ్లి చేస్తేనే అమ్మాయిలకు కళ్యాణలక్ష్మి పథకం వర్తిస్తుంది. దాంతో పేదలు చాలా మంది అప్పటి వరకు పెండ్లి చేయకుండా ఆడపిల్లను చదివిస్తున్నారు. ఫలితంగా కనీసం ఇంటర్ అయినా పూర్తి చేయగలుగుతున్నారు. దాంతో ఆలోచన శక్తి పెరిగి ఎక్కువమంది అమ్మాయిలు పెండ్లి తర్వాత కూడా చదువుకుంటూ ఉన్నత విద్య వరకు వెళుతున్నారు. ఇది నేను కింద స్థాయిలో గమనించి చెబుతున్న నిజం. అలాగే ఒంటరి, వృద్ధ మహిళలకు పెన్షన్లు ఇవ్వడం, గర్భిణీ మహిళలు సుఖంగా బిడ్డకు జన్మనిచ్చే వైద్య సదుపాయాలు కల్పించారు. మొత్తానికి గతం కంటే మార్పు ఉంది. అయితే జనాభా నిష్పత్తిలో, ఉత్పత్తిలో సగభాగంగా ఉన్న మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి. అప్పుడు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. దీనికి కుటుంబ సభ్యులు, ప్రభుత్వం కూడా ముందుకు రావాలి.



- సుమిత్రా ఆనంద్, టీఎస్‌పీఎస్సీ బోర్డు సభ్యులు.

తాజా పరిమళం కోసం...

ఇంటిలోని ప్రతి గదిని తాజాగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. లేదంటే ఇన్‌ఫెక్షన్‌లు పెరిగి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం చాలా ఎక్కువ. సువాసన కోసం మార్కెట్‌లో అనేక రకాల ఫ్రెషనర్స్ అందుబాటులో ఉంటాయి. కానీ మనం ఇంట్లోని వస్తువులతోనే తాజా పరిమళం వెదజల్లేలా చేసుకోవచ్చు. అవేంటో చూద్దాం...

- నేలను తుడుస్తున్నప్పుడు నీటిలో రెండు చుక్కలు నిమ్మగడ్డి నూనె వేయండి. ఈగలూ, దోమలూ వంటివి ముసరవు. చక్కని సువాసనా వస్తుంది. లేదంటే పావువంతు నీళ్లల్లో రెండు చెంచాల నిమ్మగడ్డి నూనె కలిపి మరిగించండి. చక్కని ఫలితం ఉంటుంది. దాల్చిన చెక్కను పొడిగా చేసి సాంబ్రాణి పొగగా వేస్తే సరి. గదంతా పరిమళాలు వ్యాపిస్తాయి.
- అద్దాలూ, కిటికీలూ, ఇతర గాజు వస్తువులపై మురికి పేరుకుని, మరకలు పడ్డాయా.. వాడేసిన టీపొడినే మళ్లీ నీళ్లల్లో వేసి.. తీసుకోవాలి. దీన్ని వాటిపై చల్లి.. మెత్తని వస్త్రంతో తుడిస్తే.. మురికీ, మరకలు పోయి.. కొత్తవాటిలా మారతాయి. చామంతి రేకల్ని దానిలో వేసి గది మధ్యలో ఉంచండి. చక్కని సువాసనలతో పాటు కంటికింపుగానూ కనిపిస్తాయి.



- కమలాఫలం తొక్కల్ని సేకరించండి. వాటితోపాటూ దాల్చిన చెక్క ముక్కలూ, బిర్యానీ ఆకులూ కొన్ని తీసుకుని పూలదండలా తయారుచేసి గదిలో ఎక్కడయినా వేలాడదీసి చూడండి. ఎంతో ఆహ్లాదకరంగా అనిపిస్తుంది.
- ఒక సీసాలో నీళ్లు, చక్రాల్లా తరిగిన నాలుగైదు నిమ్మకాయ ముక్కలూ, చిన్న దాల్చినచెక్కా, రెండుమూడు లవంగాలు వేసి.. గదిలో ఓ చోట ఉంచండి. గదంతా పరిమళం పరుచుకుంటుంది.
- ఒక గాజు పాత్రలో నిమ్మ నూనెలో ముంచిన దూదిని ఉంచి దాన్ని స్నానాల గదిలో పెట్టండి. దుర్వాసన పోయి అక్కడ సువాసన వస్తుంది.
- పుల్లటి వాసనలకి ఎంతటి దుర్వాసనైనా తొలగించే శక్తి ఉంటుంది. అందుకే రెండు నిమ్మచెక్కల్ని నీళ్లల్లో పిండి గదిలో స్ప్రే చేయండి. అలానే నారింజ తొక్కలను నీటిలో వేసి ఉడికించినా సరే! సువాసనలు గదంతా వ్యాపిస్తాయి.
- ఇక తాజా పూల పరిమళాల సంగతి సరేసరి! చామంతి, మల్లెలను గదిలో వేలాడదీయండి. ఇవి చక్కటి సువాసనను మనసుకి ఆహ్లాదాన్ని పంచుతాయి. ఓ రాగి పాత్రలో నీళ్లు పోసి అందులో తాజా గులాబీలు ఉంచండి, చక్కటి సువాసనను ఆస్వాదించండి
- వెడల్పాటి గిన్నెలో సగం వరకూ నీళ్లు తీసుకుని నాలుగైదు యాపిల్ ముక్కలూ, రెండు దాల్చిన చెక్క ముక్కలూ, నాలుగు లవంగాలు వేసి పొయ్యి మీద పెట్టండి. నీళ్లు కాస్త వేడయితే చాలు.. ఆ పరిమళం ఇల్లంతా వ్యాపిస్తుంది.

రెండేండ్ల కిందటే ప్రధానికి చెప్పాం : ఎఫ్ఐఆర్‌లో రెజ్లర్లు

న్యూఢిల్లీ : డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడిన విషయాన్ని ఒక మహిళా రెజ్లర్ రెండు సంవత్సరాల క్రితమే అంటే 2021లోనే ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసికెళ్లారు. తగిన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ కూడా ఇచ్చారు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌లో మహిళా రెజ్లర్లు ఈ విషయాన్ని పేర్కొన్నారు.

ఎఫ్ఐఆర్ ప్రకారం...క్రీడాకారులను గౌరవించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీని మహిళా రెజ్లర్ కలిసి లైంగిక వేధింపుల ఉదంతాన్ని వివరించారు. లైంగికంగా, భావోద్వేగపరంగా, మానసికంగా, శారీరకంగా తన పైన, తోటి రెజ్లర్ల పైన నిందితుడు జరిపిన అకృత్యాలను ఆమె ప్రధానికి తెలియజేశారు. నిందితుడి సన్నిహిత సహచరులు కూడా ఈ చర్యలకు మద్దతు తెలిపారని చెప్పారు. దీనిపై ప్రధాని స్పందిస్తూ ఈ విషయాన్ని క్రీడా మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని, త్వరలోనే సమాచారం ఇస్తుందని హామీ ఇచ్చారు. అయితే నేటి వరకూ ప్రధాని నుండి కానీ, ప్రభుత్వంలోని ఇతర పెద్దల నుండి కానీ రెజ్లర్లకు ఎలాంటి న్యాయం లభించలేదు.

కేసీఆర్ దోపిడీని ఎంత కాలం భరిద్దాం?

(మొదటిపేజీ తరువాయి)

పాలన చేయడం లేదని విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను కూడా తెలంగాణ ప్రజలు ఆదరించాలని కోరారు.

కోరమండల్ రైలు ప్రమాదం పట్ల రేవంత్ దిగ్భ్రాంతి

అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒడిసాలో శుక్రవారం జరిగిన ఘోర రైలు ప్రమాదంలో పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించడం తనను కలిచి వేసిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మృతులకు కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి యుద్ధ ప్రాతిపదికన నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. ప్రమాదానికి కారణాలు అన్వేషించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఏఐసీసీ కార్యదర్శి జి చిన్నారెడ్డి హైదరాబాద్‌లో మాట్లాడుతూ మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎంపీ వి హనుమంతరావు మాట్లాడుతూ 20 ఏండ్ల తర్వాత ఘోర రైలు ప్రమాదం జరిగిందన్నారు. రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు.

నెర్రెలుబారిన నేల దేశానికే ధాన్యాగారం

(మొదటిపేజీ తరువాయి)

ఉండేందుకు 10,769 గ్రామాల్లో రైతుబంధు సమితులను ఏర్పాటు చేశామని తెలిపారు. భూయాజమాన్య హక్కులపై స్పష్టత ఇచ్చేందుకుగానూ భూ రికార్డుల సమగ్ర ప్రక్షాళన చేపట్టి ధరణి ద్వారా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని వివరించారు.

రైతులను సంఘటితం చేసేందుకు ప్రతి 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున 2,601 రైతువేదికల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల లభ్యతతో పరిస్థితులు మెరుగుపడ్డాయని వివరించారు. పండిన పంట నిల్వకు నూతన మార్కెట్ షెడ్లు, గోదాముల నిర్మాణం, పండిన ధాన్యం మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయడం తదితర చర్యల మూలంగా రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుండి 2.09 కోట్ల ఎకరాలకు పెరిగిందని పేర్కొన్నారు. 2014లో 68 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి నేడు 2.60 కోట్ల టన్నుల మెట్రిక్ టన్నులకు ధాన్యం ఉత్పత్తి పెరిగిందని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

బ్రిజ్ భూషణ్ వేధింపులు నిజమే

(మొదటిపేజీ తరువాయి)

కనీసం ముగ్గురు మహిళా రెజ్లర్ల ఆరోపణలను ఒక ఒలింపియన్, ఒక కామన్వెల్త్ బంగారు పతక విజేత, అంతర్జాతీయ రిఫరీ, రాష్ట్ర స్థాయి కోచ్ ధ్రువీకరించారు. నాలుగు రాష్ట్రాల్లోని 125 మంది సాక్షుల వాంగ్మూలాలను ఢిల్లీ పోలీసులు నమోదు చేశారు. వారిలో ఈ నలుగురు ఉన్నారు.

ఏప్రిల్ 28న ఢిల్లీ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసిన తరువాత సాక్షులను విచారించారు. వృత్తిపరమైన సహాయానికి బదులుగా "లైంగిక ప్రయోజనాలను" కోరిన కనీసం రెండు సందర్భాలు ఉన్నాయని తెలిపారు. దాదాపు 15 లైంగిక వేధింపుల సంఘటనలు, ఇందులో 10 ఎపిసోడ్‌లు అనుచితంగా తాకడం, వేధింపులు రొమ్ములపై చేతులు వేయడం, నాభిని తాకడం, వెంబడించడంతో సహా బెదిరింపులకు సంబంధించిన అనేక సందర్భాలు ఉన్నాయని తెలిపారు.ఈ నలుగురు సాక్షుల గురించి అడిగినప్పుడు, ఢిల్లీ పోలీసు ప్రతినిధి సుమన్ నల్వా "ఈ కేసులో దర్యాప్తు, సాక్ష్యం ఏమిటనే దానిపై మేము వ్యాఖ్యానించలేము. విచారణ ఇంకా కొనసాగుతోంది. దీనిపై సిట్ విచారణ చేపట్టి నివేదికను కోర్టుకు అందజేస్తుంది" అని అన్నారు.

బ్రిజ్ భూషణ్ వేధింపుల ఘటన జరిగిన ఆరు గంటలకు దాని గురించి రెజ్లర్ తనకు ఫోన్‌లో తెలియజేసినట్లు ఫిర్యాదుదారుల్లో ఒకరి కోచ్ చెప్పినట్లు తెలిసింది. ఇద్దరు మహిళా రెజ్లర్లను ఢిల్లీ పోలీసులు ప్రశ్నించినప్పుడు వారి వాదనను ధ్రువీకరించారు. వారి వాంగ్మూలాలలో లైంగిక వేధింపుల సంఘటనలు జరిగిన ఒక నెల తరువాత ఫిర్యాదుదారు తమకు తెలియజేసినట్లు వారు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సర్క్యూట్‌లో పేరున్న రిఫరీ, తాను స్వదేశంలో, విదేశాలలో టోర్నమెంట్‌లకు వెళ్లినప్పుడు మహిళా రెజ్లర్ల కష్టాల గురించి తాను విన్నానని ఢిల్లీ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.ఢిల్లీ పోలీసులు మహిళా పోలీసు సిబ్బందితో సహా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. లైంగిక వేధింపుల సంఘటనలు జరిగినట్లు ఆరోపించబడిన టోర్నమెంట్‌కు హాజరైన వారి గురించి డబ్ల్యుఎఫ్ఐ నుండి వివరాలను కోరింది. సింగ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు బాక్సర్ మేరీకోమ్ అధ్యక్షతన ప్రభుత్వం నియమించిన పర్యవేక్షణ కమిటీ నివేదికను కూడా పోలీసులు సేకరించారు.

"సిట్ 158 మంది వ్యక్తుల జాబితాను సిద్ధం చేసింది. వారు హర్యానా, ఉత్తరప్రదేశ్, జార?ండ్, కర్ణాటకలను సందర్శించి సాక్ష్యాలను సేకరించి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఇప్పటివరకు. వారు 125 మంది వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేశారు. వారిలో నలుగురు తమ వాంగ్మూలాలలో ముగ్గురు మహిళా రెజ్లర్ల ఆరోపణలను ధ్రువీకరించారు"అని ఒక అధికారి తెలిపారు.

ఎఫ్ఐఆర్‌ల నమోదు తరువాత బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను సిట్ రెండుసార్లు ప్రశ్నించింది. ఈ రెండు సందర్భాల్లో, అతను తన ప్రమేయాన్ని తిరస్కరించాడని, తనను తప్పుగా ఇరికించారని పేర్కొన్నారు. రెజ్లర్లు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేరున్న డబ్ల్యుఎఫ్ఐ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా సిట్ మూడు నుంచి నాలుగు గంటల పాటు ప్రశ్నించింది. "ఇప్పటి వరకు మొత్తం ఆరుగురు మహిళా రెజ్లర్లు, ఒక మైనర్ తమ ఫిర్యాదులలో చేసిన ఆరోపణలను ధ్రువీకరించిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్పిసి) సెక్షన్ 164 కింద మేజిస్ట్రేట్ ముందు వారి వాంగ్మూలాలను నమోదు చేశారు" అని ఒక అధికారి తెలిపారు.

రెజ్లర్ల అంశాన్ని జాతీయాధ్యక్షుడు జెపి నడ్డాకు రెండుసార్లు తెలిపా: చౌదరి బీరేంద్ర సింగ్

బీజేపీ ఎంపీ,, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చైర్మెన్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలంటూ దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు నిరసనకు నాయకత్వం వహిస్తున్న విషయంపై తాను పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాను రెండుసార్లు కలిశానని హర్యానా బిజెపి సీనియర్ నాయకుడు చౌదరి బీరేంద్ర సింగ్ తెలిపారు.మొదటి నరేంద్ర మోడీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన చౌదరి బీరేంద్ర సింగ్, నడ్డాతో ఫోన్‌లో మాట్లాడుతూ "ప్రజల మనోభావాలు మల్లయోధుల వద్ద ఉన్నాయని, బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్య తీసుకోకపోవడం వెనుక బీజేపీకి ఏదైనా రాజకీయ లెక్కలు ఉంటే, అది నష్టం జరుగుతుంది" అని అన్నారు. వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా, సాక్షి మాలిక్ .నేతృత్వంలోని రెజ్లర్లకు అనుకూలంగా మాట్లాడిన హర్యానాకు చెందిన అతికొద్ది మంది బీజేపీ నాయకులలో ఆయన ఒకరు. మిగిలిన ఇద్దరు హర్యానా బీజేపీ చీఫ్ ఓ.పి. ధంకర్, రాష్ట్ర హోం, ఆరోగ్య మంత్రి అనిల్ విజ్ కూడా ఉన్నారు.

"కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు నేను నడ్డాను కలిశాను. మే 7 లేదా 8, నాకు సరిగ్గా గుర్తు లేదు. ఈ సమస్య తీవ్రమైనదని, దీని వల్ల బీజేపీ రాజకీయంగా దెబ్బతింటుందని నేను ఆయనకు చెప్పాను. యువజన వ్యవహారాలు, క్రీడలు, హోం మంత్రిత్వ శాఖల దృష్టికి తీసుకెళ్తానని బిజెపి అధ్యక్షుడు సమాధానం ఇచ్చారు" అని అన్నారు. దాదాపు వారం తరువాత తాను చర్చించిన అంశాన్ని మళ్ళీ నడ్డాకు గుర్తు చేసినట్లు బీరేంద్ర సింగ్ చెప్పారు. "బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్య తీసుకోవడాన్ని విస్మరించినందుకు పార్టీ మనస్సులో కొన్ని రాజకీయ లెక్కలు ఉంటే, వారు తప్పుగా భావిస్తారు. దీనికి తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని నేను నిస్సందేహంగా నడ్డాతో చెప్పాను" అని ఆయన అన్నారు. "ఎఫ్ఐఆర్‌లోని విషయాలలో మరింత తీవ్రమైన విషయం ఏమిటంటే, తాము లైంగిక వేధింపుల విషయాన్ని రెండేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోడీ దష్టికి తీసుకెళ్లామని మహిళా రెజ్లర్లు పేర్కొనడం. ఇది చిన్న విషయం కాదు" అని అన్నారు.

బ్రిజ్ భూషణ్ ను వెంటనే అరెస్టు చేయాలి : ఎస్కేఎం

పోక్సో చట్టాన్ని సవరించాలంటూ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ చేసిన ప్రకటనలను సంయుక్త కిసాన్ మోర్చా తీవ్రంగా ఖండించింది. ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్కేఎం, కార్మిక సంఘాలు, మహిళలు, యువకులు, విద్యార్థులు, సాంస్కృతిక కార్యకర్తలు, వ్యాపారులు, సాధారణ పౌరుల ఉమ్మడి వేదిక జూన్ 5న దేశవ్యాప్తంగా నిరసనలను నిర్వహించనున్నట్లు తెలిపింది. దేశంలోని గ్రామ, పట్టణ కేంద్రాలలో ప్రదర్శనలు, కొవ్వొత్తుల మార్చ్ లు నిర్వహించనున్నట్లు తెలిపారు. లైంగిక వేధింపుల నిందితులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్న ప్రధానమంత్రి మోడీ .నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ, మన కుమార్తెలకు సంఘీభావంగా ముందుకు రావాలని పౌరులందరికీ విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపింది. మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతాయని హెచ్చరించింది.

రైతుల జీవితాల్లో వెలుగు

(మొదటిపేజీ తరువాయి)

రైతు సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రం తీసుకొని సంస్కరణలను సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రైతు దినోత్సవాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో కోలహాలంగా ఉత్సవాలు నిర్వహించారు. రైతులు ఎడ్లబండ్ల ర్యాలీలు, ట్రాక్టర్లలతో ఊరేగింపుగా రైతు వేదికలకు చేరుకున్నారు. కులమతాలకతీతంగా సహఫంక్తి భోజనాలు చేశారు. కందుకూర్ మండలంతోపాటు మరికొన్ని మండలాల్లో నిర్వహించిన రైతు దినోత్సవం వేడుకలకు మంత్రి సబితాఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపూడి క్లస్టర్ రాంక్య తండాలో జరిగిన కార్యక్రమానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు హాజరయ్యారు. రైతుల మోముపై చిరునవ్వే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. రైతు బంధు కింద రాష్ట్రంలో 65 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబాంధవుడని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట మండలపరిధిలోని యండ్లపల్లి గ్రామంలో మూసి ఆయకట్టు రైతాంగం భారీ ఎత్తున రైతు దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. కలెక్టర్ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎడ్లబండ్ల ప్రదర్శన,ట్రాక్టర్ల ప్రదర్శనతో పాటు కోలాటం, భజన, బృందాలతో ర్యాలీ నిర్వహించారు. నల్లగొండ జిల్లా చిట్యాలలోని ఉరుమడ్ల గ్రామంలో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరయ్యారు. నల్లగొండ, యాదాద్రి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ప్రదర్శనలు జరిపారు. ఎమ్మెల్యేలు, ఛైర్మెన్‌లు, అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి, ఆదిలాబాద్, హైదరాబాద్(బోయిన్‌పల్లి) వరంగల్, ములుగు తదితర జిల్లాల్లో జరిగిన వేడుకలలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాల కలెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.



ప్రశ్నించే తత్వంపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

డాకిన్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్సీఈఆర్టీ చేసిన సిలబస్ మార్పుల ప్రకారం సైన్స్, జీవశాస్త్రాన్ని ఎంచు కున్న 11వ, 12వ తరగతి విద్యార్థులకు మాత్రమే డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని గురించి తెలుసుకునే అవకాశం ఉంటుంది. విద్యార్థులను ప్రశ్నించే తత్వం నుండి దూరం చేయడమే దీని ఉద్దేశమని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. పరిణామ సిద్ధాంతాన్ని నేర్చుకోకుండా విద్యార్థులను నిరోధించడమంటే వారిని అజ్ఞానులుగా మార్చడమే అవుతుందని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ జన్యు శాస్త్రవేత్త పార్థా ప్రతిమ్ మజుందార్ తెలిపారు. పదో తరగతి సిలబస్ నుండి పరిణామ సిద్ధాంతాన్ని తొలగించాలన్న నిర్ణయంపై పలువురు శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఏప్రిల్‌లోనే గళం విప్పారు. ప్రపంచాన్ని హేతుబద్ధమైన కోణం నుండి పరిశీలించడంలో డార్విన్ సిద్ధాంతం చాలా కీలకమని, జీవ శాస్త్రంలోని అంశాలను మించి తెలుసుకోవడానికి అది దోహదపడుతుందని వారు చెప్పారు. పరిణామ సిద్ధాంతం, ఆవర్తన పట్టిక, సుస్థిర యాజమాన్యం వంటి అంశాలను తొలగించడం వెనుక ఏదైనా నిర్దిష్ట అజెండా ఉన్నదేమోనని కొందరు శాస్త్రవేత్తలు అనుమానం వ్యక్తం చేశారు. ఎన్సీఈఆర్టీ నిర్ణయాలను అవగతం చేసుకోవడం కష్టంగా ఉందని బెంగళూరుకు చెందిన భౌతిక శాస్త్రవేత్త ఒకరు వ్యాఖ్యానించారు. పుస్తకాల నుండి తొలగించిన మూల్యాంకనం, సుస్థిరత్వం వంటి అంశాలు విద్యార్థుల్లో ఆలోచనలు రేకెత్తిస్తాయని, వారిలో ప్రశ్నించే తత్వాన్ని పెంచుతాయని కొల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసర్చ్‌కి చెందిన జీవ శాస్త్రవేత్త అనిందితా భద్ర తెలిపారు. మూల్యాంకనానికి సంబంధించిన పరిజ్ఞానం విద్యార్థులను ఆలోచింపజేస్తుందని, స్థిరత్వం అనేది ఎంపిక, విలువలపై ప్రశ్నించే సామర్థ్యాన్ని కల్పిస్తుందని ఆయన వివరించారు. పిల్లలు ఆలోచనలను, ప్రశ్నించే తత్వాన్ని పెంచుకొని మంచి పౌరులుగా ఎదగడం ఇష్టం లేకనే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. భారతీయ వైజ్ఞానిక వ్యవస్థను బలోపేతం చేసే పేరుతో ఇటీవలి కాలంలో ప్రభుత్వ విభాగాలు తీసుకున్న చర్యలు చారిత్రక వాస్తవాలను వక్రీకరించాయని కొందరు పరిశోధకులు విమర్శించారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమని కొల్‌కతాలోని ఐఐఎస్ఈఆర్‌లో భౌతిక శాస్త్ర అధ్యాపకుడు సౌమిత్రో బెనర్జీ అన్నారు.

ప్రభుత్వ శాఖలు సైతం...

ఎన్సీఈఆర్టీ మాత్రమే కాదు...కొన్ని ప్రభుత్వ శాఖలు కూడా పరిశోధనలపై నీళ్లు చల్లుతున్నాయి. సామాజికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులు విదేశీ యూనివర్సిటీలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు జాతీయ ఉపకార వేతనాలు పొందినట్లయితే వారు భారతీయ సంస్కృతి, చరిత్ర, సమాజం వంటి అంశాలను ఎంచుకోరాదంటూ గత సంవత్సరం ఫిబ్రవరిలో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ హుకుం జారీ చేసింది. విదేశీ యూనివర్సిటీలలో పరిశోధనలు చేసే విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకుంటే కులం, మతం, లింగ సమానత్వం, సంస్కృతి-సంప్రదాయాలు పేరిట ఆంక్షలు విధిస్తున్నారు. ప్రభుత్వం గ్రాంట్లు, ఉపకార వేతనాల రూపంలో పరిశోధనలను ప్రోత్సహించాలని, అంతేకానీ ఏయే అంశాలపై పరిశోధనలు చేయాలో యూనివర్సిటీలను నిర్దేశించరాదని ఢిల్లీ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు అబా దేవ్ హబీబ్ సూచించారు. పాఠ్యాంశాలను అన్ని స్థాయిలలోనూ బీజేపీ-ఆర్ఎస్ఎస్ ప్రచారానికి అనుగుణంగా రూపొందిస్తున్నారని, కొన్ని అంశాలలో పరిశోధనలను నియంత్రించాలని ప్రభుత్వం భావిస్తోందని ఆయన విమర్శించారు.

ఘనంగా మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- చైతన్యపురి

తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు జన్మదిన వేడుకలను రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నాయకులు, హరీశ్ రావు సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె మహమ్మద్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలకుంట చెక్ పోస్ట్‌లోని దర్గాలో 101 కొబ్బరికాయలు కొట్టి, చదర్‌ను సమర్పించారు. తర్వాత కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం మహమ్మద్ మాట్లాడుతూ మంత్రి హరీశ్ రావు ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ఉన్నత పదవులను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వర రావు, ఎండీ రఫీ బాబా, ఫయాజుద్దీన్, కరీముద్దీన్, ఇస్మాయిల్, రఫీ, మధు పాల్గొన్నారు.

'కేసుల విషయంలో రాజీపడి కలిసి మెలసి ఉండొచ్చు'



నవతెలంగాణ - హయత్ నగర్

క్షణిక ఆవేశానికి లోనై పెట్టిన కేసులను రాజీ చేసుకొని ఇరువురు కలిసి మెలసి ఉండవచ్చని 14వ అడిషనల్ మేజిస్ట్రేట్ సల్మా, 7వ అడిషనల్ మేజిస్ట్రేట్ సంకేత్ మంత్రలు అన్నారు. శనివారం హయత్ నగర్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రీ లోక్ అదాలత్ లో హయత్ నగర్, అబ్దుల్లాపూర్ మెట్, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు పెట్టుకున్న మొత్తం 251 మంది రాజీ పడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీపీలు అరుణోదయ కుమార్, నూతన్ లు, బెంచ్ మెంబర్లు కోటేశ్వర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాం మోహన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేసే ప్రభుత్వం మనది

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ- చైతన్యపురి

రైతును రాజు చేసే ప్రభుత్వం మనదే అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆర్కేపురం డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ లో రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తాలు హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు 24 గంటలూ ఉచిత కరెంటు, రైతుబంధు, రైతు బీమా లాంటి కార్యక్రమాలు కేసీఆర్ నేతృత్వంలో వారికి అందుతున్నాయని తెలిపారు. సకాలంలో ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పంటలకు గిట్టుబాటు ధరలు ఒక తెలంగాణలోనే సక్రమంగా అమలవుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ చిలుక నర్సింహారెడ్డి, ఏవో స్రవంతి, రాజేశ్వరి, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రైతులు బాగుపడిన చరిత్ర ఎక్కడా లేదు'



నవతెలంగాణ - ఘట్కేసర్

రైతులు బాగుపడిన చరిత్ర ఎక్కడా లేదని రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షులు, రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఘట్కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతు దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైతు సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ రామ్ రెడ్డితో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. ఏ పార్టీల వారికి వారి ఎజెండా వాళ్లకు ఉంటుందని, రైతన్నవాడు నిజంగా చెప్పాలంటే నిరంతరం మోసపోయేవాడని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రైతుబంధు ఇచ్చిన 24 గంటలూ ఉచిత కరెంటు, రైతు బీమా, కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.6000, సబ్సిడీ ఎరువులు ఇచ్చినా.. రైతులకు ఏ మాత్రం లాభాలు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం రాకముందుకు ఒక ఎకర పంటకు ఐదు నుంచి పదివేల రూపాయలు ఖర్చు అయ్యేదని, కానీ ఇప్పుడు రూ.30 నుంచి 40 వేలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను అర్థం చేసుకునే పరిస్థితి ఎవరికీ లేదని అధికారులు తన వంతు పాత్రగా మీటింగ్ పెడతారు తప్ప.. ఎలాంటి ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 28 రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణలో అమలు చేస్తే రైతులకు పంట నష్టం అనేది ఉండదని అన్నారు. చైర్మన్ చెప్పినట్టు పంట నష్టం ఇప్పిస్తే పాలాభిషేకం చేస్తానని రాజకీయాలకు అతీతంగా ముందు నేనే ఉంటానని అన్నారు. అధికారులు 1700 వందల ఎకరాలు మండలంలో పంట నష్టం రిపోర్ట్ ఇచ్చారని, పంట నష్టం వచ్చిన నాడు పాలాభిషేకం చేస్తానని తెలిపారు.

ఆర్ఆర్ఆర్‌ను ప్రారంభించిన వైస్ చైర్మెన్ మాధవరెడ్డి

నవతెలంగాణ - ఘట్కేసర్



ఘట్కేసర్ మున్సిపాలిటీ 9వ వార్డులోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో తెలుగు మీడియం స్కూల్ కమిటీ హాల్ లో ఆర్ఆర్ఆర్ సెంటర్ ను శనివారం ఘట్కేసర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "రిడ్యూస్, రీసైకిల్, రీయూజ్"(ఆర్ఆర్ఆర్) అనే వన్-స్టాప్ సెంటర్ ను ఇక్కడి పౌరులు ఉపయోగించుకోవాలని కోరారు. పాత బట్టలు, బూట్లు, పుస్తకాలు, బొమ్మలు, ప్లాస్టిక్‌ను తిరిగి ఉపయోగించుకోవచ్చు లేదా రీసైకిల్ చేయవచ్చు అన్నారు. అన్ని బస్తీల్లో పెద్ద ఎత్తున క్లీన్‌నెస్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు కొమ్ము గోని రమాదేవి మహిపాల్ గౌడ్, కొమ్మిడి అనురాధ రాఘవ రెడ్డి, బండారి ఆంజనేయులు గౌడ్, బేతాళ నర్సింగ్ రావు, ఎండి సిరాజ్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ కె షౌకత్ మియా, ఘట్కేసర్ మున్సిపాలిటీ బీసీ సెల్ అధ్యక్షుడు బర్ల హరిశంకర్ ముదిరాజ్, మాజీ వార్డ్ సభ్యురాలు దేవరకొండ పద్మ రాజచారి, అంకం సురేష్ యాదవ్, బర్ల లక్ష్మయ్య ముదిరాజ్, ఎండి నజీర్, వీరేష్ గుప్తా, మడిపడిగె లక్ష్మయ్య, పోచయ్య ముదిరాజ్, భానుక నవీన్, కుంభం ప్రసాద్ ముదిరాజ్, పలుగుల ప్రణయ్ రెడ్డి, ఆర్ఆర్ఆర్ స్పెషల్ ఆఫీసర్ యోగేష్, మేనేజర్ అంజి రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులు ఎండి సిరాజ్, మున్సిపాలిటీ సిబ్బంది, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం




నవతెలంగాణ - సంతోష్ నగర్

రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని హోం మంత్రి మహమ్మద్ అలీ అన్నారు. శనివారం మలక్ పేట్ నియోజకవర్గం పరిధిలోని తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మలక్ పేట్ హైదరాబాద్ మార్కెట్ లో దశాబ్ది ఉత్సవాల కమిటీ చైర్ పర్సన్ అంగోత్ అనిత నాయక్, వైస్ చైర్మన్ భూమేష్, సెక్రెటరీ ఉపేందర్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో రైతులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హోం మంత్రి మహమ్మద్ అలీ, ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, డివిజన్ కార్పొరేటర్ ఎండీ సైఫుద్దీన్ షఫీ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ లను హోం మంత్రి సన్మానించి మెమెంటో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతన్నను రాజును చేయడమే లక్ష్యంతో సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తారని అన్నారు. అనంతరం చైర్ పర్సన్ అనిత నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలిపారు. 2014-15లో వరి ఉత్పత్తిలో దేశంలో 15వ స్థానంలో ఉన్న రాష్ట్రం ఇప్పుడు అగ్రస్థానానికి చేరుకున్నట్టు తెలిపారు. ఉత్పాదకతలో రెండో స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ పాలనకు ఇదే నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, సీనియర్ నాయకులు, పలు విభాగాల కమిటీ సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణా తరగతులు

నవతెలంగాణ - ఘట్కేసర్

నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్టు జీవనోపాధి డాట్ కామ్ నిర్వాహకులు కె.రమేష్ చంద్ర గుప్తా, స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కుంటోళ్ళ యాదగిరి లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతి స్కిల్ సెంటర్ సహకారంతో జీవనోపాధి డాట్ కామ్ ఆధ్వర్యంలోని 18 ఏండ్లు నిండి 25 ఏండ్ల లోపు నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాల్లో 35 రోజుల పాటు ఉచిత శిక్షణా తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. దీంతో పాటు రూ.10,000 నుండి రూ.15,000 వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం తో కూడిన ఉద్యోగ అవకాశం కల్పిస్తారని తెలిపారు. శిక్షణ, ఉద్యోగ అవకాశాలకు ఇప్పుడే రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. ఇది ఉప్పల్ డిపో సమీపంలోని పీర్జాది గూడ పిల్లర్ నంబర్ 85, మాంగళ్య షాపింగ్ మాల్ ప్రక్కన కార్యాలయంలో గాని 94400 59868, 9533497259 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ నెల 10 నుండి శిక్షణా తరగతులు ప్రారంభం కాబోతున్నాయని, పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. కావున నిరుద్యోగ యువతీ యువకులు ఆధార్ కార్డు, మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్ తో మమ్మల్ని సంప్రదించి, ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రభుత్వ భూమిలో ఉన్న ఇండ్లు నేలమట్టం



నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని సర్కారు భూమిలో నిర్మించిన ఇండ్లను కూల్చివేసినట్లు హయత్ నగర్ తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. శనివారం రెవెన్యూ పరిధిలో ఉన్న 207 కొలస్ శివా రెడ్డి కాలనీ లో ప్రస్తుతం మిగిలి ఉన్న 4.16ఎకరాల భూమిలో నిర్మించిన ఇండ్లను జేసీబీ సహాయంతో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అట్టి స్థలాన్ని త్వరలో స్వాధీనం చేసుకుంటామని వెల్లడించారు. అదేవిధంగా ప్రభుత్వ స్థలంలో వేసిన విద్యుత్ స్తంభాలను సైతం కూల్చి వేసినట్లు చెప్పారు. హయత్ నగర్ లో ఉన్న 59జీవో కింద దరఖాస్తు చేసుకున్న 85 మంది కి ఎడిట్ ఆప్షన్ లో కట్టుకునే వారికి కలెక్టర్ అవకాశం ఇచ్చిన దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలి

- ఎంసీపీఐ (యూ) మేడిపల్లి మండల కార్యదర్శి ముడి మార్టిన్

నవతెలంగాణ - బోడుప్పల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్య వంతం చేసి, ప్రజా పోరాటాలు నిర్వహించాలని ఎంసీపీఐ (యూ) మేడిపల్లి మండల కార్యదర్శి ముడి మార్టిన్ అన్నారు. ఈ మేరకు శనివారం మేడిపల్లి ఎంసీపీఐ (యూ) మండల కార్యాలయంలో నేడు నర్సంపేటలో జరిగే బహిరంగ సభ, రాష్ట్ర ప్లీనరీల గోడ పత్రికను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ముడి మార్టిన్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించినట్లు తెలిపారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన అనంతరం అనేక ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం ప్రయత్నం జరుగుతుందన్నారు. పేద ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి కేవలం ఆదాని, అంబానీల ప్రయోజనాల కోసమే మోడీ సర్కారు పనిచేస్తుందని ఆరోపించారు. భారీ బహిరంగ సభకు మండలం నుండి పెద్ద ఎత్తున పాల్గొన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మా, కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్'

సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా



నవతెలంగాణ - నాగోల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను అర్హులు వినియోగించుకోవాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్త కోరారు. నాగోలు డివిజన్లోని జైపూర్ కాలనీకి చెందిన సుభాషిణి, లావణ్య ల వివాహాలకు సహాయం చేయాలని వారి కుటుంబ సభ్యులు కోరుతూ శనివారం నాగోల్‌లోని ఆయన నివాసంలో ఉప్పల శ్రీనివాస గుప్తను కలిశారు. స్పందించిన శ్రీనివాస గుప్త ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళసూత్రం, మెట్టెలు, గాజులు, చీరలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ ఫౌండేషన్ ఎప్పుడూ పేదలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెళ్లి కూతుళ్లు, వారి తల్లిదండ్రులు బంధువులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, జైపూర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్యామల యాదగిరి, యాదిలాల్ తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి హరీశ్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు'



నవతెలంగాణ- నాగోల్

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావుకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఉప్పల్ ఫౌండేషన్ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త శనివారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని కోకా పేట, నానక్ రామ్ గూడలోని హరీశ్ రావు నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావుకు శ్రీనివాస గుప్త రాధాకృష్ణల ఫొటో ప్రేమ్ జ్ఞాపికను అందజేశారు.

'అనాథలకు సాయం చేయడం నా అదృష్టం'



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమం లోని అనాథలకు సాయం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని టీపీసీసీ కార్యదర్శి అల్మేటి అమరేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం అనాథ ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. సుమారు 110 మంది అనాథలకు బట్టలు, పండ్లు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అనాథాశ్రమం నిర్వాహకుడు గిరి, జల్ పల్లి మున్సిపాలిటీ మైనారిటీ చైర్మన్ అహ్మద్ బామ్, నాయకులు వంగేటి మధుసూదన్ రెడ్డి, ఆంజనేయులు రామస్వామి, నున్య నాయక్, సాయి గౌడ్ పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన శివ సుధీర్ శర్మకు సత్కారం

నవతెలంగాణ- చైతన్యపురి



జ్యోతిష్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గుండెపుడి శివ సుధీర్ శర్మకు డాక్టరేట్ దక్కింది. ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో అలంకార బ్రహ్మ, జ్యోతిష్య పండితుడైన శివ సుధీర్ శర్మకు డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. కొత్తపేట మారుతీనగర్ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయంలో ప్రధాన అర్చకునిగా విధులు నిర్వహిస్తున్న సుధీర్ శర్మ ప్రతిభను గుర్తించి ఐఏఓ వారు డాక్టరేట్ ప్రధానం చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం డాక్టర్ పొందిన సుధీర్ శర్మను శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయ కమిటీ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, మారుతి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కే.మల్లేశం, ప్రతినిధులు పీఎస్.రాయుడు, రాజనాల, సుబ్బారెడ్డి, నల్లంకి రవి, రామారావు వెంకటనారాయణ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - హయత్ నగర్

తెలంగాణ ప్రభుత్వం మొదటగా పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, ఎం ఆర్ డీ సీ చైర్మన్ దేవి రెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. శనివారం హయత్ నగర్ డివిజన్ పరిధిలో బస్తీ దవాఖాన,వెల్ నెస్ సెంటర్‌ను రంగా రెడ్డి జిల్లా వైద్య అధికారి వెంకటేశ్వర రావు, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు కాలనీల్లో అభివృద్ధి పనులకు సుమారుగా 1 కోటీ 38 లక్షల రూపాయల వ్యయం మంజూరైనట్లు తెలిపారు. దానిలో భాగంగా హయత్ నగర్ లో వీరభద్ర నగర్ ఫేజ్- వద్ద తిరుమల దాబా నుండి విజయ్ దుర్గా వైన్స్ వరకు సీసీ రోడ్డు శంకుస్థాపనకు సుమారు రూ.24.00లక్షలు, హనుమాన్ దేవాలయం నుండి సిద్ధార్థ కాలనీ మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్డు, వార్డులోని అన్మగల్ వద్ద సబ్ లైన్స్ శంకుస్థాపన సుమారు రూ.12.50 లక్షలు, ఆనంద్ నగర్ నందు ప్లాట్ నెం 30 నుండి ప్లాట్ నెం.19 వరకు, హెచ్.నెం.4-7-646/25 నుండి హెచ్.నెం.4-3-187/47 వరకు సీసీ రోడ్డుకు రూ.18.00 లక్షలు, షిరిడీనగర్ ఓం సత్యసాయి స్టీల్ షాప్ నుంచి దుర్గా భవాని బార్ వరకు, అవినాష్ స్టీల్ ట్రేడర్స్ నుండి రోడ్డు నెం.6 వరకు సీసీ రోడ్డు పనులకు రూ. 39.60 లక్షలు, హుడా సాయినగర్ నందు యూజీడీ పనులకు అంచనా వ్యయం 21లక్షల రూపాయలు, ఆటో సాయినగర్ నందు యూజీడీ పనులకు రూ.8.50 లక్షలు మంజూరైనట్లు వివరించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి,డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్, సీనియర్ నాయకులు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, బోడ భిక్షపతి, భాస్కర్ సాగర్, లక్ష్మారెడ్డి, రాజశేఖర్, గుజ్జ జగన్, శ్రావణ్, రాకేశ్, అంజలి గౌడ్, శ్రీకాంత్, రాధిక, యాదమ్మ, సరళ, డివిజన్ పరిధిలోని నాయకులు, ఉద్యమకారులు, మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను సన్మానించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతులకు సన్మాన కార్యక్రమాన్ని శనివారం ఎన్టీఆర్ నగర్ రైతు బజార్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ దశాబ్దకాలంలో వ్యవసాయ రంగంలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. 2014-15లో వరి ఉత్పత్తిలో దేశంలో 15వ స్థానంలో ఉన్న రాష్ట్రం ఇప్పుడు అగ్రస్థానానికి చేరుకున్నట్టు చెప్పారు. ఉత్పాదకతలో రెండో స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ పాలనకు ఇది నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయనంద్ గుప్తా, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్, సాగర్ రెడ్డి, మాజీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం చైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్, పలు డివిజన్ల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, సీనియర్ నాయకులు, పలు విభాగాల కమిటీ సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజాం సర్కార్ లా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ - హయత్ నగర్



నిజాం సర్కార్ లాగా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తూ రెవెన్యూ అధికారులతో పేద ప్రజల వద్ద కప్పం వసూలు చేయిస్తుందని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, అర్బన్ రంగా రెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డిలు మండిపడ్డారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హయత్ నగర్ వీరన్న గుట్ట (షిరిడి సాయి నగర్)కాలనీలో నివసిస్తున్న నిరుపేదల ఇండ్లు కూల్చివేసేందుకు అధికారులు రావడంతో ఈ విషయం తెలుసుకున్న వారు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏండ్ల క్రితం వచ్చిన పట్టాలను కాదనీ కొత్తగా 59 జీవోను తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చారని తెలిపారు. దాని ప్రకారంగా వాళ్ళు దరఖాస్తులు నమోదు చేసుకోవడంతో రెవెన్యూ అధికారులు వచ్చి తక్షణమే రుసుము చెల్లించాలంటూ లేని యెడల మీ ఇళ్లను కూల్చివేస్తామని బెదిరించారని అన్నారు. వారం రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే బస్తీ బాతకాని అని నిద్ర చేసి ఈ పేద ప్రజల సమస్యలను నెరవేరుస్తానని చెప్పి నిరుపేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు నిద్ర లేకుండా చేస్తూ సమస్యలను ఒక్కొక్కటిగా తెచ్చి పెడుతున్నారని మండ్డిపడ్డారు. ఎమ్మెల్యే ఇందుకేనా మీరు బస్తీ నిద్రలు చేస్తున్నదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలోని పాలకులు ఇచ్చిన పట్టాలతో సంతోషంగా ఉన్న ఈ కుటుంబాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు చూసినా ఇబ్బందులకు గురిచేస్తూనే ఉందని ఆరోపించారు. ఈరోజు 59జీవో ప్రకారం వచ్చిన రుసుమును తక్షణమే చెల్లించకపోతే ఇళ్లను కూల్చివేస్తామంటూ పోలీస్ బలగాలతో, రెవెన్యూ అధికారులు జేసీబీలతో వచ్చి పేదలను భయభ్రాంతులకు గురి చేస్తూ రాత్రులు నిద్రలేకుండా చేస్తారా అని మండిపడ్డారు. పేదల పక్షాన మా బీజేపీ నేతలు ముందుండి ఎమ్మార్వో కలెక్టర్ నూతనంగా నిర్మించిన సెక్రటేరియట్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. 60 గజాలకు లక్ష రూపాయలు, 120 గజాలకు రెండు లక్షల రూపాయలు చెల్లించే విధంగా ఒప్పించి ఈ పేదల పక్షాన ఎల్లప్పుడూ మేము ఉంటామని హామీ ఇచ్చారు. పేదల జోలికి వచ్చే ముందు మమ్మల్ని ఎదుర్కొన్న తర్వాతనే వాళ్ల వద్దకు వెళ్ళనిస్తామంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సభ్యులు కోటయ్య, సోమయ్య, చిన్న యాదవ్, రమేష్ చారి, దశరథ, రవి కుమార్, నిరంజన్, అనురాధ, మహాలక్ష్మి, బలరాం, నాగమణి, కిస్తమ్మ, లక్ష్మి పద్మ, రాధ, బీజేపీ నాయకులు రామేశ్వర్, కడారి యాదగిరి, కొండల్ రెడ్డి, చింటూ, సోమనాథ్, పారంద సాయి తదితరులు పాల్గొన్నారు.

'రైతును రాజు చేసే దిశగా

రాష్ట్ర ప్రభుత్వం కృషి'



నవతెలంగాణ - ఘట్కేసర్

రైతును రాజు చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. ఘట్కేసర్ మండలం ప్రతాప్ సింగారం గ్రామంలో రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం రైతు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మలిపెద్ది సుధీర్ రెడ్డితో కలసి గ్రామంలో ట్రాక్టర్లు, రైతులతో ర్యాలీ నిర్వహించారు. తర్వాత రైతు వేదిక ఆవరణలో జరిగిన సమావేశంలో జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. రైతు ఆత్మహత్య నివారణ, రైతు బీమా, రైతు బంధు, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా ఇలా ఎన్నో రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీటవేస్తుందని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని మూసీ పరివాహక ప్రాంతం రైతుల సమస్యల పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పట్టణాల నుండి డ్రైనేజీని నారాయణ రావు కాల్వలో కల్పడానికి అడ్డుకోవడానికి రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కదలాలని సూచించారు. అనంతరం ఉత్తమ రైతులకు మెమోంట్ అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో నందకిషోర్, స్థానిక సర్పంచ్ వంగూరి శివశంకర్, వివిధ గ్రామాల సర్పంచులు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, కొంతం వెంకట్రెడ్డి, నీరుడి గీత, ఖైరు రమాదేవి, ఎంపీటీసీలు నీరుడి రామారావు, సహకార సంఘం వైస్ చైర్మన్ బద్దం అనంత్ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు వంగూరి లక్ష్మి గోపు బాలరాజ్ జడిగె రమేష్, ఏఈఓ జగదీష్, సహకార సంఘం మాజీ చైర్మన్ గొంగళ్ళ స్వామి, రైతు బంధు సమితి సభ్యులు ఉదారి వేణుగోపాల్, ఉపసర్పంచులు కట్ట సత్యనారాయణ గౌడ్, కందుల రాజు, అబేధ బేగం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగులపల్లి రమేష్, అధికారులు, నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి సహకరిస్తున్న విద్యాశాఖ మంత్రి ఇంద్రారెడ్డిని శనివారం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత వారు మంత్రికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక నిధులను మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంజూరు చేయించినట్లు తెలిపారు. అంతేకాదు ఆ పనులను వేగవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసేందుకు ఎంతో కృషిచేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీ నారాయణ, మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్దన్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ ధూమ్ ధామ్



నవతెలంగాణ- కంటోన్మెంట్

జింఖానా గ్రౌండ్‌లో నెల రోజులుగా నిర్వహిస్తున్న దుబాయ్ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వాహకులు నూర్ అధ్యక్షతన శనివారం తెలంగాణ ధూమ్ ధామ్ కార్యక్రమం నిర్వహించారు. తర్వాత ఉద్యమకారులను సన్మానించారు. పోతరాజు ఆటలు, బతుకమ్మ, కోలాటాలు, జానపద విభావరిలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి రాజశేఖర్ రెడ్డి, పలువురు జానపద కళాకారులు, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

- మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ - మేడ్చల్ కలెక్టరేట్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గోధుమకుంట గ్రామానికి చెందిన పుట్ట శ్రీరాములు తండ్రి నర్సయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.60,000 చెక్కు విడుదలైంది. ఈ మేరకు శనివారం ఆ చెక్కును మంత్రి లబ్దిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకిటి మహేందర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు చీర సురేష్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి
అన్నం పెట్టే రైతన్న సంతోషంగా ఉండాలి

● మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ - కంటోన్మెంట్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో శనివారం రైతులతో రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న సంతోషంగా ఉండాలన్నారు. రైతులను గౌరవించుకోవాలనే ఆలోచనతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. 2014 నాటికి ముందు రైతులు అనేక సమస్యలతో సతమతం అయ్యేవారని, పంటలు సరిగా పండక, గిట్టుబాటు ధరలు లభించేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా చేశారని కొనియాడారు. ప్రధానంగా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా, నూతన ప్రాజెక్టులను నిర్మించి సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పంట పెట్టుబడి కోసం ఎకరానికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని సీఎం అందిస్తున్నారని గుర్తుచేశారు. ప్రతి ఎకరాకు సాగునీరందించాలనే లక్ష్యంలో దేశంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా, గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నా గత పాలకులు పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ ఆ నీటిని సద్వినియోగం చేసుకోవాలనే ఆలోచనతో నూతన ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని వివరించారు. ఉచిత విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం సంవత్సరానికి రూ.12 వేల కోట్లను భరిస్తుందని, పంట పెట్టుబడి సాయం కోసం రూ.15 వేల కోట్లు వెచ్చిస్తుందని తెలిపారు. అంతేకాదు నకిలీ విత్తనాలను అరికట్టడానికి పీడీ యాక్ట్‌ను తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే ఆ కుటుంబానికి రైతు బీమా కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం పలువురు రైతులు, హమాలీలను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హారిక ఆనంద్ గౌడ్, బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ ఇఫ్తెకార్, సభ్యులు సోమ దేవేందర్ రెడ్డి, మార్కెట్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, నాయకులు నివేదిత తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి

● రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సీఎం కేసీఆర్ దత్తత గ్రామమైన మూడుచింతలపల్లితో పాటు కీసర, శామీర్‌పేట అలియాబాద్, మేడ్చల్‌లో రైతువేదికల వద్ద ఏర్పాటు చేసిన ఉత్సవాలకు జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుల కోసం సంక్షేమం, అభివృద్ధి పథకాలను ఎన్నో ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. అంతేకాదు 24 గంటలూ ఉచిత విద్యుత్‌ను అందించినట్లు తెలిపారు. రైతులను సంఘటితం చేసేందుకు ఎకరానికి రూ. 5 వేలు, ఒక క్లస్టర్ చొప్పున 2,601 రైతువేదికలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందిస్తున్నామని తెలిపారు. పంటలను నిల్వచేసేందుకు నూతన మార్కెట్ షెడ్లు, గోదాముల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అలాగే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా క్లస్టర్లుగా విభజించి అందుటులో వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించారని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతువేడులను నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రైతుల కళ్ళల్లో ఆనందం కనిపిస్తోందని ఇది ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. 75 సంవత్సరాలుగా జరగని అభివృద్ధి కేవలం ఈ పదేళ్ళలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరిగిందన్నారు. లక్ష్మాపూర్, మూడు చింతపల్లి, కేశవరం, లింగాపూర్ తండా, మాడిశెట్టిపల్లిలో.. రాష్ట్రంలో ఎక్కడా జరగని అభివృద్ధి ఈ ఐదు గ్రామాల్లో జరిగిందని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. స్థానిక రైతు వేదికల్లో పంటలపై వచ్చే అనుమానాలు నివృత్తి చేసే విధంగా ఏఈఓ లను, శాస్త్రవేత్తలను అందుబాటులో ఉండే విధంగా చూస్తామన్నారు. జిల్లాలో ఉద్యానవన పంటలు సాగు చేసుకునేందుకు మంచి వాతావరణం ఉందని, ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించబోతుందని, ఉద్యాన పంటల సాగుకు రైతులు ముందుకు వచ్చి ఆర్థికంగా బలపడాలని కలెక్టర్ కోరారు. అంతకుముందు తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగా సాగు చేద్దాం.. వానాకాలం వరిని యాసంగి పంటలను ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడుకుందాం అనే కరపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, ఆర్డీవో రవి, జిల్లా వ్యవసాయాధికారిణి రేఖామేరీ, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మేడ్చల్ జిల్లా రైతుబంధు అధ్యక్షులు నందారెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బి.వెంకటేష్ , కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీ నారాయణ, కీసర సర్పంచ్ మాధురి, రైతులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వరల్డ్ క్లబ్‌ఫుట్ డే సందర్భంగా అవగాహన వాక్



నవతెలంగాణ - బేగంపేట్

వరల్డ్ క్లబ్‌ఫుట్ డే సందర్భంగా సన్ షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన వాక్‌ను డాక్టర్ గురవారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తర్వాత పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ చందన్కోర్ మాట్లాడుతూ క్లబ్‌ఫుట్ సమస్య గురించి తల్లీదండ్రులకు తెలియక భయందోళనకు గురవుతున్నారని, ఈ సమస్యపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 3న కిమ్స్ సన్ షైన్, సికింద్రాబాద్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన వాక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యకు గ్రహణంకాలు కారణమని అనుకుంటారు కానీ..గ్రహణానికి దీనికి సంబంధం లేదన్నారు. పుట్టినప్పుడు శిశువు పాదం తీవ్రంగా వైకల్యంతో ఉందని నిర్ధారణ అయినప్పుడు తల్లీదండ్రులు ఆందోళనకు గురవుతారని తెలిపారు. ఇది ఎక్కువగా మొదటి మగ శిశువులోనే గమనిస్తామని వివరించారు. ఈ పరిస్థితిని సకాలంలో గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం చాలా అవసరమని సూచించారు. 10-15 శాతం కేసుల్లో ఇది నరాలు లేదా కండరాల రుగ్మతలతో సంబంధం కలిగి ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి 1.5 నుండి 2 లక్షల మంది పిల్లలు క్లబ్‌ఫుట్ జన్మిస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని మొదటి దశలోనే గుర్తించి, చికిత్స అందిస్తే ఫలితాలు ఉంటాయని పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ చందన్కోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ సీఓఓ సౌరబ్ గుప్తా, మెడికల్ డైరెక్టర్ పవన్, డాక్టర్ దినకర్, డాక్టర్ నివేదిత, క్లబ్ ఫుట్ పిల్లల తల్లీదండ్రులు పాల్గొన్నారు.

బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ భరత్ నగర్ కాలనీకి చెందిన దినేష్..ఓ ప్రయివేట్ కంపెనీలో వర్క్ చేస్తూ ఉండగా గ్యాస్ సిలిండర్ కాలు మీద పడి కాలు విరిగింది. ఈ మేరకు శనివారం బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చల్లపల్లి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్‌లు దినేష్ ఇంటికి వెళ్లి అతన్ని పరామర్శించారు. హాస్పటల్ ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి మా ట్రస్టు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నయీం, జనార్దన్, కర్ణాకర్, నరేశ్, అంతలయ్య, సోహైల్ పాల్గొన్నారు.

చిన్నారుల బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలదే



● కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్

నవతెలంగాణ-నాచారం

చిన్నపిల్లల ఆలనా, పాలన, బరువు, బాధ్యత అంగన్ వాడీ కేంద్రాలపై ఆధారపడి ఉందని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. శనివారం నాచారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ అంగన్ వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం, అంగన్ వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు విద్యాబుద్ధులతో పాటు పౌష్టికాహారం అందిస్తూ అమ్మ పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెల పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలు, వికాస విన్యాసాల టైం టేబుల్ విధిగా పాటిస్తూ పసిపిల్లల వికాసానికి తోడ్పాటునందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్ స్వాతి మాధవి, ఆయాలు బాలమని, రేణుక, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, ఆదిలక్ష్మి, చంద్రశేఖర్, షేక్ రఫీక్, కట్టబుచ్చి గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి హరీశ్ రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత హరీశ్ రావుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-కాప్రా



నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో
తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు



నవతెలంగాణ-నాచారం

నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పల్లవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ సీఓఓ మల్కా యశస్వి హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా యశస్వి మాట్లాడుతూ పదేండ్ల తెలంగాణ ప్రయాణం సకల జనులు, సర్వ మతాల సమ్మేళనంతో సర్వతోముఖ అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణలో విద్యారంగ వ్యవస్థ విస్తరణకు ప్రోత్సాహాన్ని అందిస్తూ, ఉత్తమమైన ఫలితాలను సాధించే దిశగా అడుగులు వేస్తుందని అభివర్ణించారు. తర్వాత ఉద్యమ ఆకాంక్ష, విద్యార్థుల త్యాగాలను నెమర వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీతా రావు, వైస్ ప్రిన్సిపాల్ నందిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం సమావేశం



నవతెలంగాణ- కంటోన్మెంట్

ముస్లింల సమస్యలను తెలుసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ శనివారం కడకపుర పెన్షన్ లైన్ లో మొహల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఫైజాన్ పాఠశాల ఉందని, పాఠశాలకు వెళ్లే దారి లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు రోడ్డు కోసం 2003లో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ రోడ్డు నిర్మాణానికి ఆర్మీ అధికారులు అనుమతించలేదన్నారు. ఇప్పటికైనా విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని దారి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఆరీఫ్, మోయిన్, సయ్యద్ సిరాజ్, అమీర్, సులేమాన్, విజయ్, కుమార్, ముక్తార్, చోటు, మోని, రఘు తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం



నవతెలంగాణ- కంటోన్మెంట్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బోయిన్‌పల్లి నూతన పోలీస్ స్టేషన్‌ను శనివారం ప్రారంభించారు. స్వాతంత్రం రాక ముందు నుంచి ఉన్న బోయిన్‌పల్లి పాత పోలీస్ స్టేషన్ సిబ్బందికి చాలక వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం ఈ స్టేషన్‌కు నూతన భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ముందు సిబ్బంది సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో గ్రూప్ ఫోటో దిగి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

జనరిక్ మందుల షాపు ప్రారంభం



నవతెలంగాణ -కంటోన్మెంట్

సామాజిక సేవకుడు దిలీప్ సింగ్ డైమండ్ పాయింట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును శనివారం తెలంగాణ బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తక్కువ వ్యయంతో మందులు అందించేందుకు షాపుకు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం దిలీప్ మాట్లాడుతూ రూ.200 విలువ గల మందులను వినియోగదారులకు కేవలం రూ. 25, 30 లకే అందిస్తున్నట్లు తెలిపారు . చుట్టుపక్కల ఉన్న వారందరీ కోసం ఈ మెడికల్ షాప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

కృష్ణ ప్రసాద్‌కు అంబేద్కర్ నేషనల్ అవార్డు



నవతెలంగాణ-నాచారం

కళా సాహిత్య సాంస్కృతిక సంస్థ నాచారం ప్రాంతానికి కృష్ణ ప్రసాద్ కు అంబేద్కర్ నేషనల్ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా కళా సూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షులు అనుముల ప్రభాకరాచారి శనివారం సాంస్కృతిక కళాకారుడు కృష్ణ ప్రసాద్‌ను తన నివాసంలో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రానికి చెందిన ప్రముఖ సాంస్కృతిక సంస్థ.. రావులపల్లి కృష్ణ ప్రసాద్ ప్రతిభకు గుర్తించి అంబేద్కర్ నేషనల్ అవార్డును అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్య కళ కల్చరల్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పలు వివాహా వేడుకలను హాజరైన ఎమ్మెల్యే



నవతెలంగాణ- కాప్రా

ఉప్పల్ నియోజకవర్గంలో శనివారం జరిగిన పలు వివాహా వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జేరి పోతుల ప్రభుదాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతి రెడ్డి, మస్క సుధాకర్, నంది కంటి శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - మేడ్చల్ కలెక్టరేట్

ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు 51వ పుట్టిన రోజు వేడుకలను మేడ్చల్ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తర్వాత కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి వేణు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ తిరుమల నగర్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని అతని నివాసంలో కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మల్లేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, అమరేందర్ బాబు, రాజు, దాసు, శశికళ, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ
జిల్లా ఓబీసీ సెల్ కన్వీనర్‌గా శ్రీశైలం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఓబీసీ సెల్ కన్వీనర్‌గా నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి గ్రామానికి చెందిన పొట్ట శ్రీశైలం నియామకం అయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ జి.రవి శనివారం శ్రీశైలంకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం పొట్ట శ్రీశైలం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం నిరంతరం కృషి చేస్తునందుకు గాను ఈ పదవి లభించిందన్నారు. తర్వాత ఈ పదవిని అప్పగించిన జిల్లా అధిష్టానికి, మేడ్చల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, తోటకూర జంగయ్య యాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పంబల్ల రమేష్, పరిగే మహిపాల్ రెడ్డి, గండిపల్లి అశోక్, పొట్ట విగ్నేష్, గండి శ్రీధర్, శ్రీశైలం, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిని చాటేలా దశాబ్ది ఉత్సవాలు : డిప్యూటీ స్పీకర్

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ పరిధిలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ఆయన అధికారులతో శనివారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. నోడల్ అధికారి టి.నర్సింట్, డిప్యూటీ కమిషనర్ దశరథ్, విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ శ్రీధర్, డిప్యూటీ ఇంజినీర్ మహేష్‌తో పాటు వివిధ హెూదాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ మాట్లాడుతూ సోమవారం సీతాఫల్‌మండిలో విద్యుత్ విజయోత్సవ దినాన్ని నిర్వహించనున్నట్టు డిప్యూటీ స్పీకర్ తెలిపారు. మూడు వారాల పాటు సాగే ఈ ఉత్సవాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. విజయాలు చాటేలా సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో కనీవినీ ఎరగని రీతిలో చేపట్టిన అభివృద్ధిని చాటేలా అన్ని విభాగాలు ఈ వేడుకల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పరిధిలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలనీ, ఆయా కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు.

మల్కాజిగిరి నియోజకవర్గం కో-ఆర్డినేటర్‌గా లక్ష్మీ పాండే నియామకం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ప్రజా ఏక్తా పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం కో-ఆర్డినేటర్‌గా లక్ష్మీ పాండే నియమితులయ్యారు. శనివారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ లక్ష్మీ పాండేకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ పాండే మాట్లాడుతూ పార్టీని మల్కాజిగిరి నియోజకవర్గంలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రజల వద్దకు పార్టీని తీసుకెళ్లి బలోపేతం చేస్తానన్నారు. తనకు అవకాశం కల్పించిన బోనాల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్మేందర్ తివారి, నరేష్. అర్జున్ ఓజా, పోలారం మాలి, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ డిమాండ్
- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి వినతి

నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలి అని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. శనివారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రిని వారి వారి కార్యాలయాల్లో కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా జాతీయ యూనివర్సిటీల కన్వీనర్ ఎస్.నాగేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దింటి రామకృష్ణ, ఎస్.ఆజాద్ మాట్లా



డుతూ రాష్ట్ర యూనివర్సిటీల్లో కొన్ని నెలల నుంచి జరుగుతున్న వివాదాల కారణంగా పరిపాలన పూర్తి స్థాయిలో స్తంభించిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, వివాదాలకు ముగింపు పలికేలా సమగ్ర చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత గల నిష్పక్షపాతంగా నిజాయితీగా పనిచేసే వారినే తెవీవీ రిజిస్ట్రార్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. 2017 నుంచి 2023 మే 31 వరకు తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన అన్ని రకాల టీచింగ్, నాన్ టీచింగ్ నియామకాలు, పదోన్నతులు, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమ నియామకాలు, పదోన్నతులను ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపించి నిధులను రికవరీ చేయాలన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో అకాడమిక్ వాతావరణాన్ని పెంపొందించేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ అతి త్వరలో సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామనీ, అక్రమ నియామకాలపై కఠిన చర్యలు తీసుకుంటామనీ, యూనివర్సిటీలో అకాడమిక్ వాతావరణాన్ని పెంపొందిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, రాష్ట్ర నాయకులు కర్క గణేష్, ఎస్కే అషఉర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తులకు ఆర్థిక సాయం అందించాలి

- తెలంగాణ మేరు సంఘం రాష్ట్ర చైర్మెన్ మునిగాల రాము, రాష్ట్ర నాయకులు, హైకోర్టు న్యాయవాది రాజు
- ఇందిరా పార్కు దర్నా చౌక్ వద్ద ధర్నా

నవతెలంగాణ-అడిక్‌మెట్



బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కులాలను ఆదుకుంటున్నట్టు చెబుతున్నదనీ, కానీ మేరు కులస్తులను మాత్రం పట్టించుకోవడం లేదని సంఘం రాష్ట్ర నాయకు లు, హైకోర్టు న్యాయవాది రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మేరు కులస్తులు ఆర్థికంగా బాగా వెనుకబాటు పడ్డారనీ, అన్ని కులాలకు ప్రకటించినట్టుగానే మేరు కులస్తులకు కూడా ఆర్థిక సాయం అందించాలని కోరారు. తెలంగాణ మేరు సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త భాగంగా శనివారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించా రు. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర చైర్మెన్ ముని గాల రాము, ట్విన్ సిటీస్ చైర్మెన్ సింగు విష్ణు, జేఏసీ వ్యవసాపకులు సంఘ వెంకట్రాజం, మునిగాల రమేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అన్నికుల వృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ మేరు కులస్తులను ఎందుకు పట్టించుకోలేదనీ, వారు ఏం అన్యాయం చేశారని ప్రశ్నించారు. కుట్టుమిషన్ మీద ఆధారపడి బతుకుతున్న మేరు కులస్తులకు రెడిమేడ్ దుస్తుల వల్ల ఆ పని కూడా సరిగా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకట్రాజం మాట్లాడుతూ 50 ఏండ్ల వయసు దాటిన మేరు కుల



కుటుంబాలకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని కుల వృత్తులకే పరిమితమైన రూ.5 లక్షల ఇన్సురెన్స్ వీరికి కూడా వర్తింపజేయాలని కోరారు. సిరిసిల్ల నేత కుటుంబాలను ఆదుకోవడానికి బతుకమ్మ చీరెల ఉత్పత్తి టెండర్ ఇచ్చినట్టుగా మేరు కులస్తులకు కూడా బట్టలు స్టిచ్చింగ్‌కు గిట్టుబాటు ధరలతో ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మేరు ఫెడరేషన్ లేదా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి దానికి వనరులు కేటాయించాలన్నారు. మేరు కులస్తులు రాజకీయంగా చాలా వెనుకబాటుకు గురవుతున్నారని తెలిపారు. అన్ని కులాలకు గుర్తించినట్టుగానే మేరు కులస్తులకు కూడా నామినేటెడ్ పోస్టుల్ని ఇవ్వాలన్నారు. మునిగాల రాము మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం మేరు కులస్తుల మహిళలకు 'నిఫ్ట్' ద్వారా బోటిక్ ట్రెనింగ్ ఇచ్చి సబ్సిడీ లోన్ల ద్వారా బోటింగ్ షాప్ పెట్టుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు. అందరిలాగే మేరు కులస్తులకు కూడా కుట్టు మిషన్‌కు ఉచిత విద్యుత్‌ను అందించాలన్నారు. సింగు విష్ణు మాట్లాడుతూ మేరు కులస్తుల్లో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు జిల్లా కేంద్రాల్లో స్మాల్ స్కెల్ ఇండస్ట్రీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ బట్టల స్టిచ్చింగ్ టెండర్లు మేరు కులస్తులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించి అంతరించిపోతున్న మేరు కులవృత్తికి పునర్జీవం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మేరు కులస్తులను పట్టించుకోకపోతే ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఈ ధర్నాలో మేరు కులాల సంఘాల ఐక్యవేదిక జేఏసీ నాయకులు నోముల శాంతికుమార్, సంతోష్ కుమార్, కీర్తి జయంత్, అరుణ్ కుమార్ కొత్తపెల్లి, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లోని సునర్ బౌలిలో సుమారు రూ.30 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న నూతన పార్కు సుందరీకరణ పనులను ఎమ్మెల్యే అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్‌నగర్‌లోని రాజయ్య గల్లీలో స్థానిక ప్రజలతో కలిసి పర్యటించి స్థానికంగా ఉన్న డ్రయినేజీ సమస్యను పరిశీలించి, సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన డ్రయినేజీ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబర్‌పేట డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చద నంతో కూడిన ఉద్యానవనంను ఏర్పాటు చేస్తున్నామనీ, త్వరలోనే పార్క్ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రేమ్ నగర్‌లోని సునర్బౌలిలో నూతనంగా రూ.30 లక్షలతో నూతనంగా ఉద్యానవనం ఏర్పాటు చేస్తున్నామని తద్వారా స్థానిక బస్తీ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం విశ్వేశ్వరరావు, మేనేజర్ యాదగిరి రెడ్డి, ఏఈ మజీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరసింహ, రమేష్ దుర్గ, బీఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి జాఫర్, పార్టీ సీనియర్ నాయకులు ఆమునూరి సతీష్, కాంతు, రాజగోపాల్ నాయుడు, సంతోష్‌చారి, తదితరులు పాల్గొన్నారు.



రాంగ్‌రూట్ వద్దు : ఏసీపీ శంకర్‌రాజు

నవతెలంగాణ-సిటీబ్యూరో

వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళ్లడంతో రోడ్డుప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, ప్రతి వాహనదారుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏసీపీ జీ.శంకర్ రాజు తెలిపారు. బంజారాహిల్స్‌లోని 'టీఎక్స్ ఆస్పత్రి'లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. ముఖ్యంగా యువకులు వాహనాలపై అతివేగంగా దూసుకెళ్తున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగితే వాహన దారునితోపాటు ఎదురుగా వచ్చేవారికి సైతం నష్టంకల్గుతుందన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేయవద్దన్నారు. ప్రతి ఒక్కరు జీబ్రా క్రాసింగ్ వద్ద వాహనాలు నిలుపాలని కోరారు. 18సంవత్సరాలు నిండిన యువకులు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని వాహనాలు నడిపించాలన్నారు. మైనర్లకు వాహనాలిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. వాహనాలకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఆస్పత్రి హెచ్ఆర్ పద్మా సీఓఓ కిషోర్, ఇన్‌చార్జ్ సమీర్, నర్సింగ్ సూపరెంటెండెంట్ సరోజాతోపాటు రిజ్వాన్, రాజేష్‌తోపాటు తదితర విభాగాలకు చెందిన సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పాత పింఛన్ స్కీం అమలు చేయాలి

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్యోగులకు పాత పింఛన్ స్కీమ్ అమలు చేయాలని ఓయూ ఎన్‌జీవోఎస్ అధ్యక్షుడు బియ్యాని జ్ఞానేశ్వర్ కోరారు. 2001 నుంచి 2004 వరకు నియమితులైన ఉద్యోగులకు ఓల్డ్ స్కీమ్ అమలు చేయాలని పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఓయూ పరిపాలన భవన్‌లో ఓయూ మూడు బోధనేతర ఉద్యోగ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఓయూ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అన్నారు. 2004 నుంచి 2024 వరకు నియమితులైన ఉద్యోగులకు కంట్రిబ్యూటరీ పింఛన్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2001లో ఎల్ఐసీ లింక్డ్ పింఛన్ స్కీమ్‌ను ప్రవేశ పెట్టి ఉద్యోగుల భద్రతను ఓయూ పాలక మండలి తుంగలో తొక్కిన్నట్టు ఆరోపించారు. నాడు ప్రభుత్వ అనుమతి లేకుండానే ఎల్ఐసీ లింక్డ్ పింఛన్ స్కీమ్‌ను అమలు చేసి నేడు ఓపీఎస్, సీపీఎస్



అమలు చేయడానికి మాత్రం రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కావాలని అనడం శోచనీయం అన్నారు. ఇక పాలక మండలి తీరు, ఓయూ అధికారుల తీరుపై తమ డిమాండ్ సాధన కోసం పోరాటం చేస్తామనీ, అందుకు ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధనేతర ఉద్యోగుల ప్రతినిధులు రవి, నాగరాజ రావు, విజయ్ కుమార్, శంకర్, భీమయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి రావాల్సిన వాటా ఇవ్వడంలో కేంద్రం విఫలం : ఎడ్ల సుధాకర్‌రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట



రాష్ట్ర అప్పుల గురించి మాట్లాడే అర్హత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వానికి లేదని బీఆర్ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి అన్నారు. గోల్కొండ కోటలో జెండా కార్యక్రమంలో పాల్గొన్న కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు, కుటుంబ పాలన అని రాష్ట్ర ప్రభుత్వంపై మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. కిషన్‌రెడ్డి రాష్ట్రానికి రూపాయి నిధులు తెచ్చిన దాఖలు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమం ఏమైనా నిర్వహించిందా అని ప్రశ్నించారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన వాటా, స్పెషల్ గ్రాంట్‌లు ఇవ్వకుండా, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో జాతీయ హెూదా కల్పించకుండా, ఇక్కడి సంపదను ఉత్తరాది బీజేపీ పాలిత రాష్ట్రాలకు దోచిపెడుతూ తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. ఇక్కడికి రావాల్సిన మొత్తం 60 శాతం వాటా ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేయాల్సిన అవసరం ఉండదనీ, ఈ విషయం కిషన్ రెడ్డి గుర్తుంచుకుంటే బాగుంటదన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయన్నారు. షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, దళితబంధు, రైతుబంధు, ఇంటింటికీ మిషన్ కాకతీయ వాటర్ లాంటి సంక్షేమ పథకాలు తెలంగాణలో తప్పితే దేశంలో మరెక్కడా అమలు కావడం లేదన్నారు. బీజేపీ నాయకులు కేవలం సీఎం కేసీఆర్ వారి కుటుంబ సభ్యులను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. నలుగురు బీజేపీ ఎంపీలను ఇక్కడ గెలిపిస్తే ఒక్కరు రూపాయి నిధులు తెచ్చిన దాఖలు లేవన్నారు. రాష్ట్రానికి రావాల్సిన వాటా నిధులు తేలేని వారు రాష్ట్ర ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. గవర్నర్ రాజ్యాంగ పదవిలో ఉండి రాజకీయాలు మాట్లాడటం సరికాదన్నారు. బీజేపీ నాయకులు నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. లేదంటే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

నేడు మాడ్రన్ కమ్యూనిటీ హాల్ ప్రారంభం



నవతెలంగాణ-అంబర్‌పేట

ఆధునిక హంగులతో నూతనంగా నిర్మించిన శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను నేడు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రారంభిస్తున్నన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో నూతన హంగులు, రూ.80 లక్షలతో నియోజకవర్గంలోనే అతిపెద్ద కమ్యూనిటీ హాల్ ఇది అన్నారు. ఈ కమ్యూనిటీ హాల్‌లో శుభ కార్యాలయాలు, మీటింగులు నిర్వహించుకునే విధంగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో పదుల సంఖ్యలో నూతన కమ్యూనిటీ హాళ్లు, పాత కమ్యూనిటీ హాల్స్‌ను పునర్‌నిర్మిస్తున్నామనీ, ఇవి పేదలకు ప్రజలకు ఎంతో ఉప యోగకరంగా ఉంటాయని చెప్పారు. మధ్య తరగతి, మధ్య తరగతి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నూతన కమ్యూనిటీ హాల్‌ను పూర్తి వసతులతో నిర్మిస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్, నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మదర్సాలోని పిల్లల మధ్యలో కేక్ కటింగ్ చేసి పిల్లలకు నూతన బట్టలు అందించారు. మొదటగా ఉదయం జీహెచ్ఎంసీ సర్కిల్ 19 ఆఫీసులో డిప్యూటీ కమిషనర్ రమేష్, సిబ్బందితో కలిసి జెండాను ఎగరవేసి రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. అనంతరం స్టేట్ హెూమ్‌లోని అనాథ పిల్లలతో, రెండు తలలు అంటుకుని జన్మించిన వీణ, వాణిలతో కలిసి జన్మదిన వేడుకలను బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రతి డివిజన్ నుంచి గజమాలలను తెచ్చి మాగంటి గోపీనాత్‌కు వేసి కేకు కటింగ్ చేయించి జన్మదిన వేడుకల శుభాకాంక్షలు తెలుపుతూ, మంగళ వాయిద్యాలతో వేడుకలను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే





మాట్లాడుతూ తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ తనను ప్రత్యేకంగా గుర్తించి బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్, మధురానగర్, బోరబండ, ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ అధికారులు పాల్గొని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్‌ర, డివిజన్ నాయకులు, వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్, నాయకులు, శ్రీనగర్ కాలనీ డివిజన్ నాయకులు అప్పు ఖాన్, తన్ను ఖాన్, సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత శ్రీనివాస్ యాదవ్, బోరబండ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్యరావు.

కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి

నవతెలంగాణ-ముషీరాబాద్



ఐక్యంగా ఉండి కార్మికుల హక్కులు సాధించుకోవాలని ప్రజా గాయకురాలు విమలక్క పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత జాతీయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక భారత్ మొదటి మాస పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను పాలరాస్తున్నాయన్నారు. పబ్లిక్ రంగ పరిశ్రమలు, సేవా రవాణా రంగాలన్నింటినీ ప్రయివేటుపరం చేస్తూ కారి ్మకులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రజా సంప దను దోపిడీ చేస్తున్న కార్పొరేట్ పెట్టుబడిదారులు తమ రక్షణ కోసం 27 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి సమ్మె హక్కును ప్రశ్నార్థకం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత జాతీయ కార్మిక సంఘం అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్త అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎండీ ఖలీల్, కార్మిక భారత్ మాసపత్రిక ఎడిటర్ అసోసియేట్ ఎడిటర్ సంతోష్ కుమార్ చారి, సపరేటర్, కొండపల్లి శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

'కె.మదన్మోహన్‌కు డాక్టరేట్ ప్రధానం'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



జేఎన్టీయూహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.మదన్మోహన్‌కు డాక్టరేట్ దక్కింది.'ఆన్ ఎఫిసియంట్ అట్రిబ్యూట్ బేస్డ్ ఎన్క్రిప్షన్ స్కీమ్ ఫర్ సెక్యూర్ ఆక్సెస్ ఇన్ క్లౌడ్' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనలకుగాను జేఎన్టీయూ విశ్వవిద్యాల యం డాక్టరేటు శనివారం ప్రధానం చేసింది.ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ తన పరిశోధనలకు అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేస్తానని తెలిపారు.ఇందుకు సహకరించిన శ్రేయస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ పలు విభాగాల అధిపతులు, సహచర ఉద్యోగులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గిరిజనేతరులకు పోడుభూముల పట్టాలు ఇవ్వొద్దు

నవతెలంగాణ-ఓయూ



గిరిజనేతరులు పోడుభూములను అక్రమ మార్గంలో కాజేస్తున్నారని ఓయూ జేఏసీ అధ్యక్షులు గడ్డం శ్రీరాం పేర్కొన్నారు. శనివారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. కొందరు గిరిజనేతర సంతానం ఎస్టీలుగా ఏజెన్సీలో చలామణి అవుతూ గిరిజన చట్టాలకు తూట్లుపొడుస్తున్నారనీ, ఈ విషయంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గడ్డం శ్రీరాం డిమాండ్ చేశారు. పోడు భూములను కాజేసేందుకు 2005 నుంచి నేటి వరకు 40 శాతం పోడును నరికింది గిరిజనేత సంతానాలకు చెందిన వారే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు పుట్టిన సంతానాల కుల ధృవీకరణ పత్రాలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే కలెక్టర్ ద్వారా విచారణ చేపట్టి గిరిజనేతర స్త్రీ, పురుషుల సంతాన సర్టిఫికెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతలో గిరిజనేతరులు అక్రమ పద్ధతుల్లో సర్టిఫికెట్లను పొందడం ద్వారా ఏజెన్సీలో భూమిపై అక్రమంగా హక్కును పొందుతున్నారనీ, వారిని గుర్తించి చర్యలు తీసుకుని పోడుభూముల సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని గడ్డం శ్రీరాం కోరారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ కో-ఆర్డినేట ర్ అరవింద్, ప్రేమ్‌నాయక్, శుభాష్, తిరుపతి, పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ కోసం ఓయూలో మానవహారం



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయల్లో సేవలు అందిస్తున్న ఒప్పంద అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట మానవహారం నిర్వహించారు. నేడు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మానవహారం నిర్వహిస్తున్నట్టు చైర్మన్ డా.ఎ.పరశురాం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పోరాటం కోసం కృషి చేశామనీ, ఇక రెగ్యులర్ అధ్యాపకులతో పాటు బోధన పరిశోధన రంగాల్లో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డా.డి.ధర్మతేజ, కో-కన్వీనర్ డా.వేల్పుల కుమార్, డా.ప్రేమయ్య, డా.ఉపేందర్, డా.రవికుమార్, డా.ప్రియ కుమారి, కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-ముషీరాబాద్

రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. శనివారం ముషీరాబాలోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా అనిల్ కుమార్ యాదవ్ ఎన్నిక కావడంతో ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్‌ను గజమాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని తెలిపారు. కాంగ్రెస్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాధరణ గణణీయంగా పెరిగిందనీ, రాబోయే



ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుందని దీమా వ్యక్తం చేశారు. అందువల్లే బీఆర్ఎస్ నాయకులు భయంతో కాంగ్రెస్ సీఎం అభ్యర్థిని ప్రకటించాలని అంటున్నారని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సైనికుల్లా పని చేయాలని సూచించారు. ముషీరాబాద్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకువచ్చి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కల్పనాయాదవ్, వాజిద్ హుస్సేన్, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగపాక వెంకట్, టీపీసీసీ కార్యదర్శి గజ్జెలరుషికేశ్వర్, నగర ఉపాధ్యక్షులు పాశం అనిల్‌కుమార్ యాదవ్, లింగం గుప్తా, నాయకులు పెండం శ్రీనివాసయాదవ్, అబిషేక్ కెనడి, ఏడీ కృష్ణ, అంజియాదవ్, గుర్రం శంకర్, పి.లక్ష్మణ్, పి.ప్రభాకర్, దర్శేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కాంగ్రెస్ తోనే సాధ్యమైందని పీసీసీ మాజీ కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్ అన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని గౌలిగూడ రామ్ మందిర్ వద్ద కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, ఆర్.నరేందర్, నిర్మల్ కుమార్ యాదవ్, అశోక్ కుమార్, సిద్ధాంత్ యాదవ్, సూరి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

కుత్బుల్లాపూర్

ఆదివారం 04 జూన్ 2023

ఐడీపీఎల్ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తక్షణ కర్తవ్యం

- మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

కూకట్‌పల్లి-బాలానగర్



బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోని ఇండియన్ డ్రగ్స్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ పరిశ్రమలో పనిచేసిన ఐడీపీఎల్ కాలనీలోని విశ్రాంత ఉద్యోగుల నివాసాల క్వాటర్స్. కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి శనివారం సందర్శించి, వారి నివాసాలను ఖాళీ చేయాలన్న విశ్రాంత ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. వారికి సంబంధించిన ఇతర అన్ని విషయాలపై ఆయన వారితో చర్చించారు. తను ఎట్టి పరిస్థితి లోను విశ్రాంత ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాదరి శ్రీనివాస్, ఆకుల నరేందర్, అరుణ్ భాయ్, విశ్రాంత ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు

గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య

నవతెలంగాణ-బాలానగర్



గుర్తు తెలియని ఓవ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోని రంగారెడ్డినగర్‌లో గల సుప్రీం క్రేన్ కాంటా సమీపంలోని చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి (35) చీరతో ఉరేసుకుని వేలాడుతుండడాన్ని గురువారం క్రేన్ ఆపరేటర్ రవికుమార్ గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం వద్ద పరిశీలించగా ఎటువంటి వివరాలు లభ్యం కాలేదు. మృతుడి ఎడమ చేతిపై అన్నయ్య అనే పచ్చబొట్టు ఉంది. బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నార్త్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎక్స్‌పో-2023 ప్రారంభం

- చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ-దుండిగల్



హైదరాబాదు నలువైపులా అభివృద్ధి చెందుతూ విశ్వనగరంగా రూపాంతరం చెందేందుకు డెవలపర్స్‌కు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు తోడ్పాటు అందించడం వలననే సాధ్య మవు తున్నదని కార్మిక ఉపాధి శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కోంపల్లి, నార్త్ హైదరాబాద్‌లో గల అత్యుత్తమ రియల్ ఎస్టేట్ అవకాశాలపై - టైమ్స్ ప్రాపర్టీ నార్త్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎక్స్‌పో హైదరాబాద్, మే 2023 : ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండు రోజుల టైమ్స్ ప్రాపర్టీ - నార్త్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎక్స్‌పో 2023 ను జూన్ 3 , 4వ తేదీలలో ఉదయం 10:00 నుండి సాయంత్రం 7:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లుగా టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. హైదరాబాద్ ఆసియస్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న టైమ్స్ ప్రాపర్టీ - నార్త్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎక్స్‌పో 2023ను శనివారం తెలంగాణ కార్మిక ఉపాధి, ఫ్యాక్టరీల శాఖ మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మునుపెన్నడూ లేని విధంగా హైదరాబాద్‌లో గత కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో అనేక ప్రాజెక్టులు అనేక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు జరుగుతున్నాయి. బిల్డర్లకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం వల్లనే సాధ్యపడుతుందని , హైదరాబాద్ ఉత్తరం వైపు కూడా శరవేగంగా అభివృద్ధి చెందడానికి వీలుపడిందని అని తెలిపారు.

ఈ ప్రత్యేకమైన నార్త్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ : అపర్ణ కన్‌స్ట్రక్షన్, ఓం శ్రీ బిల్డర్స్, హైవిజన్ డెవలపర్లు, ప్రణవ గ్రూప్, మకుటా డెవలపర్స్ ఎల్ఎల్‌పి, జీ కె హెచ్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్., ప్రణీత్ గ్రూప్, ప్రీమార్క్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్., రూబ్రిక్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్., సీతా షెల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కాలమ్స్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్., శిల్పా ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్, అక్షిత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, భువన గ్రూప్, వజ్ర బిల్డర్స్ అండ్ డెవలపర్స్, ప్రైమ్ ఎస్టేట్స్, టీవీఎమ్ ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రయివేట్ లిమిటెడ్, సాయి నీరజ్ కన్‌స్ట్రక్షన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్., సన్‌యుగ ఇన్‌ఫ్రా ప్రయివేట్ లిమిటెడ్., మోడీ ప్రాపర్టీస్, టీఎమ్ఆర్ ఇన్‌ఫ్రా, రిద్ధి హాబిటాట్స్ ఎల్ఎల్‌పి వంటి సుప్రసిద్ధ అగ్రశ్రేణి డెవలపర్‌ల ద్వారా మీకు అందించనున్నారని తెలియజేశారు. ఒక వ్యూహాత్మకమైన ప్రదేశంగా అందుబాటు ధరల కారణంగా ఉత్తర హైదరాబాద్ ఒక అనుకూలమైన నివాస గమ్యస్థానంగా ఆవిర్భవించింది. ఎంతో ప్రశాంతంగా ఉండే ఈ నివాస ప్రాంతం అన్ని రకాల సామాజిక మౌలిక సదుపాయాలను కలిగివున్నది. గత సంవత్సరం మెగా ఎక్స్‌పో ఈస్ట్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎక్స్‌పో అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో, ఈ సంవత్సరం టైమ్స్ ప్రాపర్టీ-నార్త్ హైదరాబాద్ ప్రాపర్టీ ఎక్స్‌పో ఎడిషన్ హైదరాబాద్ ఉత్తర భాగాన్ని హైలెట్ చేస్తూ కొంపల్లిలో ప్రాపర్టీ ఎగ్జిబిషన్ అద్భుత అనుభవాన్ని అందజేస్తుందని హామీ ఇస్తున్నది. ఇల్లు కొనాలనుకునే వారికి, పెట్టుబడిదారులకు రియల్ ఎస్టేట్ ఔత్సాహికులకు అనేక ఆప్షన్లు అన్వేషించడానికి రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీ నిపుణుల నుండి విలువైన సలహాలను పొందేందుకు ఈ ఎక్స్‌పో అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది. ఎక్స్‌పోలో పరిశ్రమ నిపుణులు నార్త్ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధిపై వారి అమూల్యమైన సలహాలను అందజేస్తారు. ఎక్స్‌పోలో వాక్-ఇన్ సందర్శకుల కోసం ఉత్తే జకరమైన "స్పిన్ ఓ వీల్"తో సహా పలు కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నది, ఇందులో పాల్గొనేవారు. అద్భుతమైన బహుమతులను గెలుచుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌కోసం సందర్శించి సద్వినియోగపరచుకోవాలని తెలిపారు.

విద్యార్థుల భవితకు బంగారుబాట 'బడి బాట'



- ప్రభుత్వ పాఠశాలలోని పథకాలు వివరిస్తూ డోర్ టు డోర్ క్యాంపెయిన్
- బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పథకాల పై తల్లిదండ్రులకు అవగాహన

నవతెలంగాణ-కూకట్ పల్లి

కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. శనివారం ఉదయం 7 గంటలకు ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాకమిటి కలిసి బడిబాట కార్యక్రమాన్ని వివిధ కాలనీల్లో క్యాంపస్‌లో నిర్వహించారు. విద్యార్థుల ఇంటింటికి వెళ్లి పాఠశాలలో పిల్లలని చేర్పించాలని అన్నారు. పాఠశాలలో ప్రభుత్వ పథకాలైన ఉచిత పుస్తకాలు, ఉచిత యూనిఫామ్, డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ విద్య, మధ్యాహ్న భోజన పథకం, స్మార్ట్ తరగతి గదులు, ఉత్తమ అనుభవం గల బోధనా సిబ్బంది, సీసీ నిఘా, ఆటల పోటీలు, ఉన్నత విద్య అందే అవకాశాలు సంపూర్ణంగా ఉంటాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోరకు తల్లిదండ్రులు వినియోగించుకునే విధంగా ప్రభుత్వ పాఠశాలలు ఉంటాయన్నారు. క్యాంపెయిన్ అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులను పాఠశాలలో చేర్చుకోవటం జరిగింది. శుక్రవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా, పతాకావిష్కరణ అనంతరం ప్రధానోపాధ్యాయులు సిబ్బంది తో సమా వేశమై, బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

- జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.చంద్రకాంత్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ ఒక పత్రిక ప్రకటన విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలలో మంచినీటి సౌకర్యాలు లేకపోవడం, మరుగుదొడు లేకపోవడం, ఉపాధ్యాయుల కొలత ఉండడం, ప్రభుత్వ స్కూల్లో ఉన్న విద్యార్థులు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్న పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్నది. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దాలని, కార్పొరేట్ వ్యవస్థకు దీటుగా ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ తరాల్లో ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఈనాడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహిస్తూ ,ప్రభుత్వ విద్యను కాలరాస్తూ పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది. కార్పొరేట్ వ్యవస్థకు తొత్తుగా వ్యవహరిస్తూ పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా ప్రభుత్వం తీరు ఉండడం చాలా బాధాకరం ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకొని ప్రభుత్వం విద్యను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులలో అవగాహన కలిగించి ప్రభుత్వ పాఠశాలలో వారి పిల్లలను చేసే విధంగా చూడాలని ప్రతి నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికై కృషి చేయాలని డిమాండ్ చేశారు.

డివిజన్ అభివృద్ధిలో అగ్రగామిగా బాలానగర్



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో బంగారు తెలంగాణ పునర్నిర్మాణంలో కూకట్ పల్లి నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఈ క్రమంలో బాలానగర్ డివిజన్ అభివృద్ధి, సంక్షేమంలో ముందంజలో ఉందని అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సోవాల్లో భాగంగా శనివారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేశారు. డివిజన్‌లో జరిగిన అభివృద్ధి పనులకు ముగ్ధులైన స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బంజారా డప్పులతో ఎమ్మెల్యే ఘనంగా స్వాగతం పలికారు. ఇందులో భాగంగా వినాయక్‌నగర్‌లో రూ. 88 లక్షల నిధులతో వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులకు వారు భూమి పూజ చేశారు. ఈ సంధ్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం దశల వారీగా అభివృద్ధి చెందుతూ వచ్చిందని అన్నారు. గడిచిన 9 ఏళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం అనేక రంగాలలో చాలా అభివృద్ధి జరిగింది.గత ప్రభుత్వాల హయాంలో కరెంటు కోతలతో ఇబ్బంది పడిన రాష్ట్రం ఇప్పుడు మిగులు విద్యుత్ సాధిస్తుందన్నారు. ఆనాడు నీటి కొరత సమస్యను ఎదుర్కొన్న రాష్ట్రం ఇప్పుడు మిషన్ కాకతీయతో రైతులకు సాగునీరు, ఉచిత విద్యుత్ ఇస్తూ పంటల దిగుబడిని భారీగా పెంచిందని గర్వంగా చెప్పుకొచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గం అన్ని విధాలా చెప్పుకోతగ్గ అభివృద్ధిని సాధించి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, మహ్మద్ ఖాజ, మహంకాళి సూర్యమ నారాయణ, ఎన్వీ రత్నం, పంజా రాంచందర్, సులోచనా రెడి, సుజాతా గౌడ్, కవిత , డి. కృష్ణ మూర్తి, మహిళలు, కాలనీ బస్తీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి అరబిందో ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాద బాధితులను శనివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ఎస్ఎల్‌జీ ఆసుపత్రిలో పరామర్శించారు. 7 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతుడగా మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్లకు సూచించారు. అదే విధంగా 17వ డివిజన్ కౌసల్య కాలనీలో నివాసం ఉంటున్న రాజేష్ అనే వ్యక్తి కుమారుడు లోహిత్ (11) ప్రమాదవశాత్తు బిల్డింగ్ పై నుండి కింద పడగా గాయాలయ్యాయి. చికిత్స పొందుతున్న లోహిత్ ను ఎమ్మెల్యే పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ దన్ రాజ్ యాదవ్, సీఐ సుమన్, స్థానిక కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్, ఎస్ఎంసీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు బూరుగుబావి హనుమంత రావు, కొలన్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి మన్నె రాజు రూ.50 వేలు విరాళం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ లోని సూరారం కాలనీ 2వ ఓం జెండా దగ్గర నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి స్థానిక బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మన్నె రాజు తన వంతు సహాయంగా రూ 50 వేలు విరాళాన్ని దేవాలయ కమిటీ నిర్వాహకులకు శనివారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ ప్రజలు భగవంతుని నిత్యం పూజలు చేయాలన్నారు. ఆలయ నిర్మాణంలో తను కూడా భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

పూడూరులో ఘనంగా రైతు దినోత్సవ సంబురాలు

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు రైతు వేదిక వద్ద రైతు దినోత్సవ సంబరాలు శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లా డుతూ సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు.రైతుల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఎన్.సుధాకర్ రెడ్డి,జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నంద రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్,వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, సర్పంచ్‌లు బాబు యాదవ్, మహేందర్, మంగ్య నాయక్, గణేష్, ఎంపీటీసీలు అధికారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకీ న్యాయం చేస్తాం

- పీసీసీ సభ్యులు డా.సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్



కూకట్‌పల్లి నియోజక వర్గంలోని బాలానగర్ డివిజన్ చెరబండ కాలనీకి చెందిన, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ప్రాథమిక సభ్యత్వం కలిగిన ప్రవీణ్ కుమార్ ఆకస్మికంగా మృతి చెందిన కారణంగా వారి కుటుంబానికి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ తరపున శనివారం రూ.2 లక్షల చెక్కుని వారి సోదరుడు క్రాంతికి టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళ్ రావు, డా. సత్యం శ్రీరంగం అందజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలియచేశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో సుమారుగా 30 వేల మంది సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగిందని, సభ్యులందరికి కూడా ఉచిత భీమా వర్తిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్నా లేకున్నా కార్యకర్తల, పేదల సంక్షేమం కోసమే పాటుపడుతుందని తెలియచేశారు. అదేవిధంగా ప్రతీ కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అండగా ఉంటూ ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పా రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్న కుమార్, ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాది రెడ్డి యుగంధర్ రెడ్డి, బంధిగ బాల నర్సింహా, సయ్యద్ మిస్బా ఉద్దీన్, ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్, నర్సింగ్ రావు, నవీన్ గౌడ్, తదితలు పాల్గొన్నారు.

75వ రోజు ఎమ్మెల్యే కేవీ వివేకానంద్ పర్యటన

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ 9, 10వ డివిజన్ లలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా 75వ రోజు ఎమ్మెల్యే కేపి వివేకానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా 10వ డివిజన్ లో రూ.30 లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక డిప్యూటీ మేయర్ దన్ రాజ్ యాదవ్ , కార్పొరేటర్ మేకల వెంకటేష్ తో కలిసి శంఖుస్థాపన చేశారు. 9వ డివిజన్ లో రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ రజిత రవికాంత్ తో కలిసి ప్రారంభించారు. 11వ డివిజన్ కేటీఆర్ కాలనీలో రూ.1.80 కోట్లతో 80% శాతం పూర్తైన పార్క్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే స్థానిక మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి , డిప్యూటీ మేయర్ దన్ రాజ్ యాదవ్ కమిషనర్ రామకృష్ణ రావు , కార్పొరేటర్ వాకలపూడి రవికిరణ్ తో కలిసి పరిశీలించారు. మిగిలి ఉన్న పనులు త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా కోట్ల రూపాయల విలువ చేసే 2 ఎకరాల స్థలాన్ని కాపాడి 15 ఏళ్ల కలను నిజం చేస్తున్నందుకు కాలనీ వాసులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగిన తెలంగాణ



- రాయిలాపూర్ రైతు దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

తెలంగాణ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని,సీఎం కేసీఆర్ సారథ్యంలో రైతులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చమకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామ రైతు వేదిక వద్ద నిర్వహించిన రైతు దినోత్సవంలో మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భీమా,రైతు బంధు,రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, రైతులకు సొసైటీల ద్వారా సబ్సిడీలు, తక్కువ ధరలకే ఎరువులు పంపిణీ చేస్తున్నామనిఅన్నారు. రైతులకు మేలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం దేశానికే అన్నంపెట్టే అన్నపూర్ణ రాష్ట్రంగా ఎదిగిందని ఆ ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని చెప్పారు. ఈ సందర్భంగా బండ్లు, బోనాల ఊరేగింపుతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, సర్పంచ్ నర్మదా, గోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయా నందారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


నవతెలంగాణ, కేపీహెచ్బీ



ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సమత నగర్ కాలనీ కి చెందిన అభిషేక్ వసంత్ కుమార్ కు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకొనగా మంజూరైన ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదన్నారు. అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఘుపతి రెడ్డి, బీఆర్ ఎస్ పార్టీ నాయకులు చంద్రమోహన్ సాగర్, ప్రమీల పాల్గొన్నారు.

తెలంగాణలో ఇప్పుడు రైతే రాజు ఉత్సవాలు

నవతెలంగాణ-దుండిగల్



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో శనివారం భౌరంపేట్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం వద్ద పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు , కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మొదటగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పంటల ప్రణాళిక రైతు దినోత్సవ పోస్టర్‌లు ఆవిష్కరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 50 మంది కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున బీమా డబ్బులు అందిన నేపథ్యంలో తమకు ప్రభుత్వం ద్వారా మేలు చేకూరిందని ఆయా కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ , ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందు దండగన్న వ్యవసాయాన్ని తెలంగాణ ఆవిర్భవించాక పండుగ చేసి చూపించిన ఘనత సీఎం కేసీఆర్ గారిదేనని అన్నారు. రైతు సంక్షేమం కోసమే సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారని, ఇందుకోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తున్నట్లు వివరించారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమేనని వారు స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 50 మందికి రైతు భీమా, 3741 మంది రైతులకు ఎకరాకు 5 వేల చొప్పున ప్రతీ వానాకాలం, యాసంగి గడిచిన 9 ఏళ్లలో రూ.14 కోట్ల 95 వేలు అందాయన్నారు. తెలంగాణలో ఇప్పుడు రైతే రాజని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ సీఎం కేసీఆర్ సుపరిపాలనను కోరుకుంటున్నారన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు కోరుకుంటున్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తప్పకుండా రైతు వేదిక ఏర్పాటుకు కృషి చేస్తామని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని అన్నారు. చివరగా 5 మంది ఉత్తమ రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి పాక్స్ చైర్మన్ నరేందర్ రాజు, వైస్ చైర్మన్లు నల్తూరి కృష్ణ, రవీందర్ రెడ్డి, వ్యవసాయ అధికారి మాధవరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను కట్టిపడేస్తున్న తెలుగు ఇండియన్ ఐడల్

హైదరాబాద్: ఇండియన్ ఐడల్ - పరిచయం అవసరం లేని సుదీర్ఘ విజయవంతమైన రియాలిటీ షోలలో ఒకటి. భారతదేశం అంతటా అనేక " విజయవంతమైన అధ్యాయాలను సృష్టిస్తోంది. 2004లో సోనీ ఎంటర్టైన్మెంట్ టెలివిజన్లో ప్రారంభమైనప్పటి నుండి, ఇది అప్పటి ప్రాథమికంగా టెలివిజన్ వీక్షించే ప్రేక్షకులలో తక్షణ కోపంగా మారింది. భారతదేశం అంతటా వేలాది మంది ప్రతిభావంతులైన గాయకుల భవిత్యాన్ని తిరగరాసి, అసాధారణ స్వర ప్రతిభతో సామాన్యుల ఆకాంక్షలకు రెక్కలు కట్టిన ఈ ధారావాహిక దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన, ఎక్కువ కాలం నడిచేరియాల్టీ షోలలో ఒకటిగా నిలిచింది. దాని ఆకర్షణలో ఒక అంశం. పదమూడు సీజన్లు, రెండు ప్రాంతీయ వెర్షన్లు-ఇండియన్ ఐడల్ మరాఠీ 2021లో, తెలుగు ఇండి యన్ ఐడల్ 2022లో ప్రారంభించబడింది. ఆ తర్వాత ఇది ఇప్పటికీ ప్రతి ఎపిసోడ్కి పాన్-ఇండి యన్ ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. తెలుగు ఇండియ న్ ఐడల్ కొత్త కెరటం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజాన్ని పట్టుకుంది. తెలుగు ఇండియ న్ ఐడల్ మొదటి ఎడిషన్ విజయవం తమైన తర్వాత, కొనసాగుతున్న రెండవ సీజన్ ఇప్పటికే 350కు పైగా మిలియన్ల వీక్షణ నిమిషాల ను దాటింది. ప్లాట్‌ఫారమ్ ఆహా ఇప్పటికే దాని సభ్యత్వా లను రెట్టింపు చేసింది. డిసెంబర్ 2022 నుండి ప్రొడక్షన్ ను ప్రారంభించిన 250కు పైగా సభ్యుల బృందంతో కలిసి ఇండియన్ ఐడల్ నిర్మాతలుగా ఉన్న ఫ్రీమాంటిల్ అధిక నిర్మాణ విలువలను అంది ంచారు. తెలుగు ఇండియన్ ఐడల్ ఆహ్లాద కరంగా ప్రసారం చేయబడుతోంది. దాని ఆశాజనక ప్రతిభ, ప్రభావవంతమైన కారణంగా ప్రేక్షకులను కటిపడేసింది.

IN THE COURT OF HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM XI ADDITIONAL CHIEF JDGE CITI CIVIL COURT AT:HYDERABAD. O.P.NO.2841 OF 2017

BETWEEN:
Kondra Vijaya Lakshmi and Another. .....Petitioner

AND

Goudicherlla Ajay Kumar and Others. ......Respondents.

To,
2. T.Anjaneyulu Goud, S/o.Balaram Goud, Occ; Owner of the Bus, R/o.H.No.8-3-238/979/5/B, Rahamath Nagar, Ameerpet, Hyderabad. R3

Please take Notice that the above OP is filed against you and others for grant of Compensassion the Hon'ble court posted above case on **05-07-2023 at 10.30 am** for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s.P.Chandra Mouli,
Advocate
H.No.8-1-58/5, Bangaru Enclave,
Karmanghat, Hyderabad

IN THE COURT OF CHIEF JUDGE - CUM - MACT, CITY CIVIL COURTS, AT: CHATTA BAZAR, HYDERABAD M.V.O.P.No: 936 OF 2020

Between:
Swathi Panugothu ...Petitioner/s

AND

Telangana State Road Transport Corp., & Anothers ...Respondent/s

To,
Lakshmi Prasad.K., S/o. Padmanabham @ Padma Nabha Rao, Age: 53 years, Occ: Driver, R/o. 9-130, P&T Colony, Dilsukhnagar, Hyderabad-500059.

Take this Notice that the Petitioner herein has filed the above M.V.O.P. against you and another respodent by claiming compensation before the above mentioned Court. Hence the above M.V.O.P. is posted for your appearance and counter. If you fail to appear before the above mentioned Court on **08-06-2023 by 10.30 a.m.,** the matter will be decided in your absence.

(By Order of the Court)
PUTTA THIRUPATHI REDDY
(AP/52/1996) MA (Eco), LLM (Con),
Advocate,
Flat No.1, Ravi Residency Apartment, H.No. 13-4-48/F/1, Opp: Central Bank of India, Left side to Rajadhani Theater, Vikas Nagar, Dilsukhnagar, Hyderabad (Town & Dist), Telangana (State), PIN-500060. Phone: 9440687160
Mail id: putta.thirupathireddy@gmail.com

IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT : AT: HYDERABAD O.S.No. 2498 of 2023

Between:-
Kambampati Sudharshan
S/o.late Kambampati Ramaiah
Aged about 85 years Occ: Retd. Employee R/o.H.No.17-1-391/S/363 SSS Park Building, Singareni Colony, Saidabad, Hyderabad. .....Plaintiff

And

1. All concerned
2. The Tahsildar, Saidabad Mandal, Hyderabad. .....Defendants

To,
All concerned

Take notice that the plaintiff filed the above suit for declaration as legal heir of the deceased Ravva Chandikamba who died on 14-05-2006. The above suit is posted to **08-06-2023**. If any person or persons are having any objection in respect of the claim made by the plaintiff may appear before the said Hon'ble Court at 10.30 a.m. by person or through an Advocate, failing which the matter will be decided on merits.

// BY ORDER OF THE COURT //
G.USHA RANI
N.ANAND KUMAR,
Advocates,
O/o.Flat No.G-8, CSR Estates, Plot No.42, HUDA Complex, Saroornagar, R.R.District - 35
Counsel for the Plaintiff

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE MEDCHAL- MALKAJIGIRI DISTRICT AT: MEDCHAL O.S. No. 323 of 2023

Between:
Smt. Bharathi Madhira ... plaintiff

And

1. THE DISTRICT COLLECTOR, AND OTHERS
3. To whomsoever concerned (All Concerned) ... Defendants

To
Whosoever concerned please take notice that the above Plaintiff filed the above said case to declare her as a legal heir/ successor/ surviving legal representative of Late
Madhira Visweswar, the above said case is posted on 03/07/2023 for calling objections if any, if those who are having any objection/s may appear before the Hon'ble PRL. JUNIOR CIVIL JUDGE Medchal - Malkajgiri District at Medchal on **03/07/2023 at 10-30 A.M.** personally or through counsel, otherwise the matter will be decided as treating no objections.

(By order OF THE COURT)
T. SHIVA KUMAR
B.VINOD KUMAR
Advocates
Flat No.105, 2nd Floor, Shiva Ganesh Nilayam, Near Medchal Court Complex, Medchal Municipality, Medchal-Malkajgiri District - 501 401.
9346444426 & 9849915584

సూపర్ స్వైటెక్



మట్టికోర్టులో పోలాండ్ భామ దూసుకెళ్తుంది. వరుసగా మూడో విజయం నమోదు చేసిన ఇగా స్వైటెక్ (పోలాండ్) ఫ్రెంచ్ ఓపెన్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. డిఫెండింగ్ చాంపియన్ స్వైటెక్‌కు మూడో రౌండ్లో అసలు పోటీ ఎదురుకాలేదు!. యువ సంచలనం కొకొ గాఫ్, కాస్పర్ రూడ్ సైతం ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి చేరుకున్నారు.

- ప్రీ క్వార్టర్స్‌లో పోలాండ్ భామ
- రూడ్, కొకొ గాఫ్ ముందంజ
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

పారిస్ (ఫ్రాన్స్)

డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వైటెక్‌కు ఎదురులేదు. రొలాండ్ గారోస్‌లో వరుసగా మూడో విజయం సాధించిన ఇగా స్వాటెక్ (పోలాండ్) మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపింది. శనివారం జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో చైనా క్రీడాకారిణి వాంగ్ జిన్యుపై 6-0, 6-0తో స్వైటెక్ చెమట పట్టకుండా గెలుపొందింది. అమెరికా యువ క్రీడాకారిణి కొకొ గాఫ్ సైతం ముందంజ వేసింది. మూడో రౌండ్లో మిరా ఆడ్రీవాపై 6-7(5-7), 6-1, 6-1తో మూడు సెట్ల మ్యాచ్‌లో విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో కాస్పర్ రూడ్ ముందంజ వేశాడు. నాల్గో సీడ్ నార్వే ఆటగాడు 4-6, 6-1, 6-4తో నాలుగు సెట్ల మ్యాచ్‌లో చైనా ఆటగాడు జాంగ్ జిజెన్‌పై గెలుపొందాడు.

ఎదురులేని స్వైటెక్ :

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వైటెక్‌కు పోటీ లేదు. వరుసగా మూడో రౌండ్లో పోలాండ్ స్టార్ అలవోక విజయం నమోదు చేసింది. మూడో రౌండ్లో చైనా క్రీడాకారిణి వాంగ్ రెండు సెట్లలో ఒక్క గేమ్ పాయింట్‌ను సాధించలేకపోయింది. 6-0, 6-0తో 51 నిమిషాల్లోనే ఇగా స్వైటెక్ లాంఛనం ముగించింది. స్వైటెక్ 12 గేములు, 50 పాయింట్లు నెగ్గగా.. వాంగ్ 17 పాయింట్లతో సరిపెట్టుకుంది. ఒక్క గేమ్‌ను నెగ్గలేదు. సొంత సర్వ్‌ను నిలుపుకోలేక, స్వైటెక్ సర్వ్ బ్రేక్ చేయలేక వాంగ్ తంటాలు పడింది. ఏకపక్షంగా సాగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో ఇగా స్వైటెక్ అలవోక విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో అమెరికా అమ్మాయి కొకొ గాఫ్ మెరిసింది. మిరా ఆడ్రీవాతో మ్యాచ్‌లో తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో కోల్పోయిన గాఫ్.. తర్వాత రెండు సెట్లలో గొప్పగా పుంజుకుంది. 123 నిమిషాల మూడో రౌండ్ మ్యాచ్‌లో గాఫ్ 100-73 పాయింట్లతో పైచేయి సాధించింది. గాఫ్ 18 గేములు గెలుపొందగా.. మిరా 9 గేములు నెగ్గింది. ఎనిమిది బ్రేక్ పాయింట్లు సాధించిన గాఫ్ ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టగా.. ప్రత్యర్థి సర్వ్‌ను మూడుసార్లే బ్రేక్ చేసిన మిరా మూడో రౌండ్ నుంచి నిష్క్రమించింది. కజకిస్థాన్ క్రీడాకారిణి ఎలినా రిబకెనా ఫిట్‌నెస్ సమస్యలతో వాకోవర్ ఇవ్వగా.. స్పెయిన్ అమ్మాయి సారా సోరిబస్ టార్మో నేరుగా ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.



రూడ్ జోరు :

పురుషుల సింగిల్స్‌లో నాల్గో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) జోరు కొనసాగుతుంది. చైనా ఆటగాడిని మూడో రౌండ్లో మట్టికరిపించిన కాస్పర్ రూడ్ ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. నాలుగు సెట్ల పోరులో రెండున్నర గంటల పాటు పోరాడిన కాస్పర్ రూడ్.. చైనా ఆటగాడిపై విజయం సాధించాడు. కాస్పర్ ఆరు ఏస్‌లు కొట్టగా.. జాంగ్ సైతం ఆరు ఏస్‌లు సంధించాడు. కాస్పర్ ఆరు బ్రేక్ పాయింట్లు సాధించగా.. జాంగ్ మూడు బ్రేక్ పాయింట్లతో సరిపెట్టుకున్నాడు. పాయింట్ల పరంగా 116-100తో కాస్పర్ రూడ్ పైచేయి సాధించాడు. గేముల పరంగా రూడ్ 22 నెగ్గగా.. జాంగ్ 15 గేములు సాధించాడు. చిలీ ఆటగాడు నికోలస్ జారీ 6-2, 6-3, 6-7(7-9), 6-3తో మార్కస్ గైరోన్ (అమెరికా)పై ఉత్కంఠ మ్యాచ్‌లో గెలుపొందాడు. నాలుగు సెట్ల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో చిలీ ఆటగాడు తొలి రెండు సెట్లను సులువుగా నెగ్గాడు. టైబ్రేకర్‌కు దారితీసిన మూడో సెట్‌లో మార్కస్ గెలుపొందాడు. నాల్గో సెట్‌లో జోరందుకున్న నికోలస్ 6-3తో ప్రీ క్వార్టర్స్ బెర్త్‌ను సొంతం చేసుకున్నాడు. బ్రెజిల్ ఆటగాడు థియాగో వైల్డ్‌పై 3-5, 7-6(10-8), 2-6, 6-4, 6-0తో జపాన్ ఆటగాడు యోషిహిట నిషియోక గెలుపొందాడు. ఐదు సెట్ల హోరాహోరీ పోరులో బ్రెజిల్ ఆటగాడిపై పైచేయి సాధించిన జపాన్ ప్లేయర్ ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. సెర్బియా ఆటగాడు బొర్నా కోరిక్ 3-6, 6-7(5-7), 2-6తో థామస్ మార్టిన్ (అర్జెంటీనా) చేతిలో మూడో రౌండ్లో పరాజయం పాలయ్యాడు.

బ్రిటన్‌పై భారత్ గెలుపు



- 4-2తో పెనాల్టీ షూటౌట్‌లో పైచేయి
- ఎఫ్‌ఐహెచ్ హాకీ ప్రో లీగ్

లండన్ : ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్ 2023 లండన్ లీగ్ దశను టీమ్ ఇండియా ఘనంగా ముగించింది. పెనాల్టీ షూటౌట్‌కు దారితీసిన మ్యాచ్‌లో 4-2తో బ్రిటన్‌పై ఘన విజయం సాధించిన హాకీ ఇండియా.. పాయింట్ల పట్టికలో రెండో స్థానం నిలబెట్టుకుంది. నాలుగు క్వార్టర్ల అనంతరం మ్యాచ్ 4-4తో సమమైంది. దీంతో ఫలితాన్ని పెనాల్టీ షూటౌట్‌తో తేల్చారు. ఆట మొదలైన ఆరో నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ దక్కించుకున్న భారత్ 1-0తో ముందంజ వేసింది. హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీని అలవోకగా గోల్‌గా మలిచాడు. ఏడో నిమిషంలో పెనాల్టీ కార్నర్ సాధించిన బ్రిటన్.. 1-1తో స్కోరు సమం చేసింది. రెండో క్వార్టర్‌లో రెండు గోల్స్ కొట్టిన భారత్ 3-1తో ఆధిక్యం సాధించింది. మన్‌దీప్ సింగ్ (18వ నిమిషం), సుఖజీత్ సింగ్ (27వ నిమిషం) ఫీల్డ్ గోల్స్‌తో అదరగొట్టారు. చివరి రెండు క్వార్టర్లలో రెచ్చిపోయిన బ్రిటన్ 39, 46వ నిమిషాల్లో గోల్స్ కొట్టి స్కోరు సమం చేసింది. 49వ నిమిషంలో అభిషేక్ మరో ఫీల్డ్ గోల్‌తో భారత్‌ను 4-3తో ముందంజలో నిలిపాడు. అయినా, 52 నిమిషంలో గోల్‌తో బ్రిటన్ స్కోరు సమం చేసింది. పెనాల్టీ షూటౌట్‌లో భారత్ తరఫున అభిషేక్, లలిత్ కుమార్, హర్మన్‌ప్రీత్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్ విజయవంతంగా గోల్స్ నమోదు చేశారు. బ్రిటన్ తరఫున ఇద్దరు గోల్స్ కొట్టగా.. ఇద్దరు విఫలమయ్యారు. ఐదో పెనాల్టీ షూట్ అవసరం లేకుండానే భారత్ మెరుపు విజయం నమోదు చేసింది.

టెస్టులకు 2024 జనవరి ఆఖరు!

ఆసీస్ క్రికెటర్ డెవిడ్ వార్నర్



లండన్ : ఆస్ట్రేలియా డ్యాషింగ్ ఓపెనర్ డెవిడ్ వార్నర్ కెరీర్‌లో కీలక ప్రకటన చేశాడు. రానున్న స్వదేశీ సమ్మర్ సీజన్ టెస్టు కెరీర్‌కు ఆఖరని తెలిపాడు. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ కోసం ప్రస్తుతం డెవిడ్ వార్నర్ లండన్‌లో జట్టుతో పాటు సాధన చేస్తున్నాడు. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్, యాషెస్ సవాళ్లను ఎదుర్కొంటున్న వార్నర్.. 2024 జనవరిలో పాకిస్థాన్‌తో చివరి టెస్టుకు సన్నద్ధమవుతున్నట్టు పేర్కొన్నాడు. ' 2024 టీ20 ప్రపంచకప్ నా కెరీర్ చివరి మ్యాచ్‌కు వేదిక అవుతుందని నేను అనుకుంటున్నాను. అందుకోసం.. జట్టులో నిలిచేందుకు నిలకడగా పరుగులు చేయాలి. ఇంగ్లాండ్‌తో యాషెస్‌లో అవకాశం లభిస్తే పరుగులు చేయటం కీలకం. అప్పుడే స్వదేశంలో పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్ ఆడగలను. 2024 జనవరిలో పాకిస్థాన్‌తో సిడ్నీ టెస్టు ఐదు రోజుల ఫార్మాట్‌లో నా ఆఖరు మ్యాచ్. కుటుంబం, స్నేహితులు, సొంత మైదానంలో అభిమానుల నడుమ టెస్టు క్రికెట్‌కు గుడ్ బై చెప్పాలని అనుకుంటున్నాను' అని డెవిడ్ వార్నర్ అన్నాడు.

ఒకటి కాదు మూడు కావాలి! : జూన్ 7-11న ది ఓవల్ మైదానంలో భారత్, ఆస్ట్రేలియా ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో పోటీపడనున్నాయి. 2021 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ తలపడగా.. టీమ్ ఇండియా వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరుకుంది. ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్‌ను నిర్ణయించే ఫైనల్ ఒక్క మ్యాచ్ కాకుండా.. మూడు మ్యాచుల మహా సమరంగా ఉండాలని డెవిడ్ వార్నర్ అభిప్రాయ పడ్డాడు. 'తుది పోరు మూడు మ్యాచుల సిరీస్‌గా ఉండాలని నా అభిప్రాయం. రెండేండ్ల మంచి టెస్టు క్రికెట్ అనంతరం.. తటస్థ వేదికపై చాంపియన్‌ను తేల్చేందుకు ఒక్క మ్యాచ్ సరైనది కాదు. రెండు అత్యుత్తమ జట్లు, ప్రపంచ శ్రేణి బౌలింగ్ ఎటాక్‌తో పోటీపడటం ఆసక్తి రేపుతుంది. భారత్‌తో ఫైనల్ కోసం ఎదురు చూస్తున్నాను' అని డెవిడ్ వార్నర్ తెలిపాడు.

లండన్‌కు భారత క్రికెటర్లు



లండన్ : ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ కోసం భారత క్రికెటర్లు శనివారం లండన్‌కు చేరుకున్నారు. మూడు బృందాలుగా ఇంగ్లాండ్‌కు చేరుకున్న భారత టెస్టు క్రికెట్ జట్టు.. శనివారం వరకు అరుండెల్ క్యాసిల్ క్రికెట్ క్లబ్‌లో సాధన చేసింది. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ లండన్‌లోని ది ఓవల్ మైదానంలో జరుగనుంది. జూన్ 7-11 వరకు టెస్టు క్రికెట్ అంతిమ సమరంలో భారత్, ఆస్ట్రేలియా తలపడనున్నాయి. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు ఇప్పటికే లండన్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా.. భారత క్రికెటర్లు శనివారం లండన్‌కు వచ్చారు. ఇక్కడ భారత జట్టు మరో మూడు రోజులు పూర్తి స్థాయి సాధన చేయనుంది. మ్యాచ్ పరిస్థితులను తలపించే ప్రాక్టీస్ సెషన్, జట్టు అంతర్గత ప్రాక్టీస్ మ్యాచులు ఆడేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రచించినట్టు సమాచారం.

నేటి నుంచి టేబుల్ టెన్నిస్ టోర్నీ



హైదరాబాద్ : అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ లీగ్ నాల్గో సీజన్ ఆరంభానికి ముందు తెలంగాణ వేదికగా కీలక జాతీయ టోర్నీ జరుగనుంది. యుటిటి జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ నేటి నుంచి ఆరంభం కానుంది. మొయినాబాద్‌లోని ఫైర్‌ఫాక్స్ స్పోర్ట్స్ రిసార్ట్ వేదికగా ఈ టోర్నీ జరుగుతుంది. అండర్ 11-19 (బాయ్స్, గర్ల్స్) విభాగాల్లో సుమారు 1900 మంది క్రీడాకారులు పోటీపడనున్నట్టు తెలంగాణ టేబుల్ టెన్నిస్ సంఘం తెలిపింది. శనివారం ఎల్బీ స్టేడియంలో జరిగిన సమావేశంలో వివరాలను నిర్వాహకులు వెల్లడించారు.

లక్ష్యసేన్ పోరాడినా..!

- సెమీస్‌లో పరాజయం
- థాయ్‌లాండ్ ఓపెన్



బ్యాంకాక్ : థాయ్‌లాండ్ ఓపెన్‌లో టీమ్ ఇండియా పతక వేటకు తెరపడింది. మెన్స్ సింగిల్స్‌లో యువ కెరటం లక్ష్యసేన్ జైత్రయాత్రకు సెమీఫైనల్లో బ్రేక్ పడింది. రెండో సీడ్, థాయ్‌లాండ్ షట్లర్ కునాల్‌వట్ విటిడ్‌శరన్‌తో మూడు గేముల మ్యాచ్‌లో లక్ష్యసేన్ పోరాడి ఓడాడు. శనివారం జరిగిన సెమీఫైనల్లో 21-13, 17-21, 13-21తో థాయ్‌లాండ్ షట్లర్‌కు ఫైనల్స్ బెర్త్ కోల్పోయాడు. 75 నిమిషాల పాటు ఉత్కంఠగా సాగిన సెమీఫైనల్లో లక్ష్యసేన్ తొలి గేమ్‌ను అలవోకగా నెగ్గాడు. 11-6తో ముందంజలో నిలిచి అదే జోరులో 21-13తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. కానీ రెండో గేమ్‌లో రెండో సీడ్ థాయ్‌లాండ్ షట్లర్ పుంజుకున్నాడు. 17-15తో ముందంజలో నిలిచిన లక్ష్యసేన్‌ను వెంబడించిన కునాల్‌విట్.. 17-17తో స్కోరు సమం చేశాడు. వరుసగా మూడు పాయింట్లతో 21-17తో రెండో గేమ్‌ను గెల్చుకున్నాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో లక్ష్యసేన్ అంచనాలను అందుకోలేదు. 11-10తో ముందంజ వేసినా.. విరామం అనంతరం లయ కోల్పోయాడు. వరుస పాయింట్లు సాధించిన కునాల్‌విట్ 21-13తో నిర్ణయాత్మక మూడో గేమ్‌తో పాటు ఫైనల్స్ బెర్త్ కైవసం చేసుకున్నాడు.



కె.టి.కుంజుమోన్, ఎం.ఎం.కీరవాణి

భారీ స్థాయిలో జెంటిల్‌మన్ 2

'జెంటిల్‌మన్' నిర్మాత కె.టి. కుంజుమోన్ సౌత్ ఇండియన్ సినిమా ప్రముఖ నిర్మాతలలో ఒకరు. అద్భుతమైన చిత్రాలను నిర్మించారు. ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలను ప్రేక్షకులకు అందించారు. శరత్‌కుమార్, దర్శకుడు శంకర్ వంటి గొప్ప ప్రతిభావంతులను సినీ పరిశ్రమకు పరిచయం చేశారు. గ్రాండ్‌గా సినిమాలను నిర్మించడం, తన సినిమాలను ప్రమోట్ చేయడంలో ప్రత్యేకమైన శైలిని అనుసరించడంలో ఆయనకి ఆయనే సాటి. ఆయన ప్రస్తుతం 'జెంటిల్‌మన్ 2' చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

'ఆర్‌ఆర్‌ఆర్'లోని నాటు నాటు' పాటకు 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్'లో ఆస్కార్ అవార్డును గెలుచుకున్న ఎం.ఎం. కీరవాణిని ఈ చిత్రం ద్వారా తమిళ చిత్ర పరిశ్రమకి ఆయన ఆహ్వానిస్తున్నారు. దీంతో ఈ సినిమా కీరవాణికి తమిళంలో కమ్ బ్యాక్ సినిమా కావడం విశేషం. పూర్తి స్క్రిప్ట్‌ను కీరవాణికి వినిపించడానికి ఫిల్మ్ మేకర్ ఎ.గోకుల్ కృష్ణ హైదరాబాద్ వచ్చారు. కథ గ్రాండియర్‌కి బాగా ఇంప్రెస్ అయిన కీరవాణి వచ్చే నెలలోనే కంపోజ్ చేయడం ప్రారంభిస్తానని నిర్మాత కుంజుమోన్‌కు చెప్పారు.

ఆద్యంతం వినోదభరితం

విజె సన్నీ, సప్తగిరి హీరోలుగా నటిస్తున్న హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'అన్‌స్టాపబుల్'. డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఎ2 బి ఇండియా ప్రొడక్షన్‌లో రజిత్‌రావు నిర్మించారు. ఈనెల 9న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. బ్రహ్మానందం ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



విజె సన్నీ, బ్రహ్మానందం, సప్తగిరి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'దాదాపు యాభై మంది నటీనటులతో ఈ సినిమా చేయడం ఆనందాన్ని ఇచ్చింది. జంధ్యాల, రేలంగి నరసింహారావు, ఈవీవీ, ఎస్వీ కృష్ణారెడ్డి సినిమాల్లో ఇలా తెర నిండుగా నటీనటులు ఉండటం చూశాను. మళ్ళీ ఇంతమందిని ఒక్క దగ్గరికి చేర్చి ఇలాంటి మంచి ఎంటర్‌టైనర్ చేయడం అభినందనీయం. చిత్ర బృందం అంతా కష్టపడి చేసిన ఈ ప్రాజెక్ట్ అద్భుతమైన విజయాన్ని సాధించాలని ఆశిస్తున్నాను. ఇలాంటి వాళ్ళందరిని మీరందరూ ఆశీర్వదిస్తే పెద్దవాళ్ళు అవుతారు. గొప్పవారు అవుతారు. తర్వాత ప్రతి ఒక్కరూ ఒక బ్రహ్మానందం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.



హృదయం ముక్కలైంది

క్షతగాత్రులకు అండగా నిలబడాలని అభిమానులకు తారలు పిలుపు



శుక్రవారం రాత్రి ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం యావత్ దేశాన్ని కలిచివేసింది. క్షేమంగా ఇంటికి తిరిగివస్తారనుకున్న తమ వాళ్ళు ఇక రారని తెలుసుకున్న కుటుంబ సభ్యుల ఆవేదన వర్ణణాతీతం. ఈ విషాదం గురించి తెలిసిన ప్రతి ఒక్కరి మనసు చెదిరి, గుండె బరువెక్కింది.

ఈ పెను ప్రమాదంలో ఇప్పటివరకూ 278 మంది మృతి చెందగా, 900 మందికి పైగా గాయాల పాయ్యారు. ఈ మహా విషాదంతో సినీ ప్రముఖులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశించడమే కాకుండా అవసరమైన సేవలను అందించాలంటూ తమ అభిమానులకు సోషల్ మీడియా వేదికగా పలువురు సినీ తారలు పిలుపునిచ్చారు.





రైలు ప్రమాద ఘటన గురించి తెలుసుకుని దిగ్భ్రాంతికి గురయ్యాను. ప్రస్తుతం క్షతగాత్రుల ప్రాణాలను కాపాడటానికి రక్తం ఎంతో అవసరం. కాబట్టి ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో ఉన్న అభిమానులు అందరూ దయచేసి రక్తదానం చేయండి. సహాయక చర్యలు చేపట్టండి.

- చిరంజీవి

ఒడిశా రైలు ప్రమాదం గురించి తెలియగానే హృదయం ముక్కలైంది. ఎన్నో కుటుంబాలు తమ ప్రియమైనవారిని కోల్పోయారు. గాయాల పాలైనావారు త్వరగా కోలుకోవాలి.

- మహేష్‌బాబు

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటన గురించి విని నా హృదయం ముక్కలైంది. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరితగతిన కోలుకోవాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా

- అల్లు అర్జున్

ఒడిశా రైలు ప్రమాద ఘటన గురించి తెలియగానే ఒక్కసారిగా కుంగిపోయా. బాధిత కుటుంబాల గురించి తలుచుకుంటే తీవ్రమైన బాధ కలుగుతుంది.

- అనుష్క శెట్టి

రైలు ప్రమాద ఘటన నా హృదయాన్ని కలచివేసింది. ఆ బాధను మాటల్లో చెప్పలేకపోతున్నా. రెస్క్యూ ఆపరేషన్‌లో సాయం చేయడానికి ముందుకు వచ్చిన స్థానికులకు కృతజ్ఞతలు.

- రష్మిక

నవచిత్రం

బాత్రూమ్ యాడ్స్‌లోనూ స్టార్ హీరోలే

చిన్న ఆర్టిస్టులను బతికించండి

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా తాజాగా హైదరాబాద్‌లో ఎన్టీఆర్ మెమోరియల్ అవార్డ్స్ వేడుకను ఘనంగా నిర్వహించారు. సీనియర్ నటుడు కోటా శ్రీనివాసరావు, చంద్రమోహన్, ప్రభ, శివకృష్ణ, రోజారమని, కవిత, తనికెళ్లభరణి, బాబుమోహన్, కైకాల నాగేశ్వరరావు, బుర్రా సాయిమాధవ్, కొమ్మినేని వెంకటేశ్వరరావు, గుబ్బాసురేష్ కుమార్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా. గారపాటి లోకేశ్వరి, నందమూరి మోహనకృష్ణ, నందమూరి చైతన్యకృష్ణ, గారపాటి శ్రీనివాస్, నందమూరి యశ్వంత్, రిటైర్డ్ ఐ జి మాగంటి కాంతారావు, అంబికా కృష్ణ, తుమ్మల ప్రసన్నకుమార్, అనంతపురం జగన్, 'మా' ఈసీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి టైటిల్ స్పాన్సర్‌గా ఏ వి ఇన్ఫ్రాకన్, పవర్డ్ బై ఐమార్క్ డెవలపర్, అసోసియేటెడ్ స్పాన్సర్స్ వివికే హౌసింగ్ ఇండియా, వండర్ డైమండ్స్, నావోకి, శ్రీయం ఐ టి సొల్యూషన్స్, కేశినేని డెవలపర్, ఔట్డోర్ పార్టనర్ మీరా హోర్డింగ్స్ స్పాన్సర్స్‌గా వ్యవహరించారు.



సన్మానం అనంతరం కోటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'ఇవాళా రేపు సినిమా అనేది లేదు.. అంతా సర్కస్. విషాదకర పాటకు కూడా డాన్స్‌లు వేస్తున్నారు. రామారావు, నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్ బాబు రెమ్యునరేషన్ ఎంత తీసుకున్నారో తెలుసా? వాళ్ళ ఏనాడూ తమ పారితోషికం గురించి బాహాటంగా మాట్లాడలేదు. కానీ ఇప్పుడు హీరోలు రోజుకి 2కోట్లు, 6కోట్లు తీసుకుంటున్నాం అని పబ్లిక్‌గా చెపుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. అప్పట్లో శ్రీదేవితో ఎన్టీఆర్ డాన్స్ చేస్తుంటే ఆయన వయసు గురించి ఎవరూ మాట్లాడలేదు. అప్పుడు జనాలకు తెరపై ఆ పాత్రలు మాత్రమే కనిపించాయి. 'మా' అసోసియేషన్ గురించి చెబుతూ, ఎంతమంది ఆర్టిస్టులు రెండు పూట్ల కడుపునిండా అన్నం తింటున్నారో ఓసారి దృష్టిసారించండి అని మా అధ్యక్షుడు మంచు విష్ణుని కోరారు. పూర్తిగా తెలుగు ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణులతో 'పది కోట్లతో సినిమా తీస్తే.. డబ్బు ఇవ్వద్దు.. రాయితీలు ఇవ్వద్దు. ఉభయ రాష్ట్రాల్లో ఎక్కడ షూటింగ్ జరిగినా లొకేషన్ ఉచితంగా ఇస్తుంది అని ప్రకటించమని ప్రభుత్వానికి ఓ లెటర్ రాయండి' అని తెలిపారు. ప్రస్తుతం చిన్న ఆర్టిస్టులు బతకలేకపోతున్నారు. ఏదో ప్రకటనలో నటిద్దాం అనుకుంటే.. బాత్రూమ్ క్లీన్ చేసే బ్రష్ నుంచి బంగారం ప్రకటనల వరకు అన్నీ స్టార్ హీరోలే చేస్తున్నారు. ఇక చిన్న ఆర్టిస్టులకు పని ఎక్కడ ఉంది? దయచేసి 'మా' సభ్యులు, ప్రభుత్వాలు ఆలోచన చేసి ఆర్టిస్టులను బతికించండి' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మాట్లాడాలని వుంది

గాయం తాలూకు జ్ఞాపకాలు బలమైనవి, కొన్ని దూది పింజల్లా ఎగిరిపోతూ వుంటాయి, మరీ కొన్ని బలంగా నాటుకు పోతాయి, ఎంతలా అంటే గాయాన్ని కూడా ప్రేమించేంతలా...

నాలో ఉన్న నిన్ను దూరం అయ్యావు అని చెప్పాలంటే మనసుకు బాధగా ఉంది.. ప్రతీ ఉషస్సు నీ జ్ఞాపకాలతో మొదలవుతుంది, ఆ వెనకే కన్నీటి బొట్టు, నేల రాలదు, కానీ నన్ను తడుపుతోంది, కన్నీటి చారికలతో నా నవ్వు కప్పబడుతోంది !! ఏంటో, మనసుకి ఎంత సర్దిచెప్పుకున్నా మాట వినదే!! నీ ధ్యాసతో మొదలయ్యే నా ప్రయాణం, మెట్రో అనౌన్స్మెంట్ వచ్చేంత వరకు దృష్టి మరలదు, దారిలో కనిపించే ప్రతి దృశ్యంలో నీ నవ్వును చూసుకుంటున్న !! ఎదురుగా ఉండే మనుషుల్లో నీ రూపాన్ని వెతుక్కుంటున్న !! నువ్వైతె బావుండని ఎన్ని సార్లు అనుకున్నానో !! నువు కావనే నిజాన్ని అబద్దం అయితే ఎంత బావుండు అనుకున్నానో !! పక్కన్నే ఉన్నట్టు, మాటల ఊట ఉబికివచ్చినట్టు, నవ్వుల సడులు సంగీతం అయినట్టు అనిపిస్తుంది, అప్పుడే నే ఉనికిలో ఉన్నట్టు అనిపిస్తుంది, కానీ ఒక్క క్షణంలో అంతా అబద్దం అనే మాట నా హృదయాన్ని తూట్లుగా పొడుస్తుంటుంది, జారే చుక్క నా చెంపను తడిపినపుడే మళ్ళీ స్పృహలోకి వస్తాను..

రోజు ఒక్కడ్నే ప్రయాణం చేస్తాను భౌతికంగా, నే వెళ్ళే ప్రతీ చోటున ప్రతి క్షణాన నువు ఉన్నావు, నాతో కలిసి ప్రయాణం చేస్తావు.. 222A లో మన ప్రయాణం గుర్తొచ్చినప్పుడల్లా నాకు ఆ ప్రయాణమే చివరది అయితే బావుండు అనిపిస్తూ వుంటుంది, నువు లేని ఇప్పటి నా ప్రయాణం జీవం లేని మనిషిలా మారుస్తోంది, చుక్కలు పొడవని ఆకాశమల్లే తోస్తోంది !! నా భుజం మీద తలవాల్చి, రెండు చేతులు ఒక్కటయ్యిన వేళ జీవితాంతం అలానే సాగుతాం అనుకున్న !! మన మధ్యన చేరని గాలి, వేల లేఖలు నా మోముపై రాసిన నీ కురులు, వేగంలో మార్పు చెందిన హృదయపు సవ్వడులు ఇప్పటికీ అంతే సహజంగా తడిగా నా గుండెను

ప్రేమలేఖలు Voice Of Love



తడుపుతున్నాయి..

మెట్రో దిగి ఆఫీస్‌కి వెళ్ళే దారి పొడవునా నాతో నడుస్తావు. ఆ మెట్రో స్టేషన్ చుట్టూ మనం అల్లుకున్న జ్ఞాపకాలు ఎన్నో !! నీకు గుర్తుందా చెరో కప్ కాఫీ తాగుతుంటే ఆ మెట్రో స్టేషన్ మనల్ని తొంగి తొంగి చూసింది !! మనల్ని చూసే ప్రేమించడం నేర్చుకుంది, మార్చుకున్న కాఫీనీ చూసే ప్రియురాలి పెదవుల తడి రుచిని ఆస్వాదించింది, ఇవ్వాళ ఆ మెట్రో స్టేషన్ నాకంటే విషాదంగా కనిపిస్తుంది !! ఏమైందని అడిగే లోపే నా కన్నీటిని తుడిచివేస్తుంది !! నాతో పాటు అది కూడా నీ ప్రేమకై వేచిచూస్తోంది !! ఏదైనా హోర్డింగ్ లో నీ పేరు కనపడితే తనివితీరా చూస్తాను, నడిచే పాదాన్ని ఆపినట్టు, కాలాన్ని కూడా కొన్ని క్షణాలు హోల్డ్ చేస్తాను.. డెస్క్‌లో కూర్చున్న నాకు నీ పేరును టైప్ చేస్తే గాని డిస్‌ప్లే వెలగదు. ఆ తర్వాతే నా పని మొదలవుతుంది.. ఏంటో రోజంతా నువు గుర్తుకు రాకుండా ముగియదు అనే మాట అబద్దంగా చెప్పలేను..


నా ప్రేమను ఎన్ని కవితల్లో రాసుకున్నానో !! నా బాధను ఎంతగా అదుముకున్నానో !! ఒక్కసారి నీ పలకరింపకై ఎంతగా వేచియున్నానో !!..

"వేకువ జామునే నిశీధి కమ్ముకొస్తుంటుంది
జ్ఞాపకాల కొలిమిలో ఎర్రగా కములుతుంటే
ప్రేమకి రూపంగా భావిస్తున్న, దూరాన్ని ప్రేమిస్తున్న
నీ పెదవులు పంచిన తడితో జీవం పోసుకుంటున్న"

నాపై నీ ప్రేమ అనంతమైనది !! మరీ ఎలా అన్నావో మరిచి పో అని, అది గుర్తొచ్చినప్పుడల్లా గుండెల్లో బరాలు పెట్టీ పేల్చినట్టు అనిపిస్తుంటుంది.. రిక్టర్ స్కేల్ లాంటి ఓ పరికరాన్ని కనిపెడితే బావుండు, మరిచి పో అన్న మాటకి నా గుండె ఎన్ని బీటలు బారిందో !!..

చేతిలో చేయి వేసి జీవితాంతం ఇలానే ఉంటా అన్నావ్ కదా !! మరిచిపోయావా !?! ఒక్కసారైనా గుర్తుకురాన !!? ఇది రాస్తుంటేనే దుఃఖం ఆగట్లేదు !! ఎందుకు నాకు ఇన్ని "బ్లాక్" డేస్ ఇస్తున్నావు.. నీకు గుర్తుందా నేనిచ్చిన గులాబీని తలలో పెట్టుకుంటు ఒక్క నవ్వు విసిరావు, ఆ నవ్వు ఇంకా అలానే నాతో ఉంది. నిను చేరని గులాబి పూవుల రెక్కలు రాలినట్టు ఆ నవ్వును రాల్చకు, నీ మాటలు కావాలి, నీ నవ్వు కావాలి, నీ ప్రేమ కావాలి, నీతో మళ్ళీ ప్రయాణం చేయాలి, జాతరలో నాకోసం తెచ్చిన కీ చైన్ తీసుకోవాలి, నీ నుదటన ఒక ముద్దు పెట్టాలి, నీతో జీవితం కావాలి.. చాలా మిస్ అవుతున్నాను. దూరం ఎప్పటికీ దూరం కాదు అన్నావ్ గా, ఇప్పుడు నిజంగా దూరాన్ని పెంచుతున్నావు. మనం నడచిన దారిని ముగిసింది. మూసివేస్తున్న అనే బోర్డ్ తగిలించకు, చిక్కి తల్లి ఐ లవ్ యూ మా, మిస్సింగ్ యూ ఏ లాట్.. మాట్లాడాలని వుంది..

- మహేష్ వేల్పుల
9951879504



ఐక్యత+ఐనైక్యత=కులం

ఎక్కడైన ఎప్పుడైన
ఆధిపత్య కులాలలో ఒకడు
తప్పుజేస్తే
అతడిని తప్పించడానికి
కింద నుండి పైదాకా
అందరూ ఏకమై
తల్లికోడికింద పిల్లల్ల
కాపాడుకుంటరు
ఇదీ వాళ్ల ఐక్యతకు చిహ్నం.

కింది కులాలలో
ఎవరిమీదనైన నిందమోపబడితే
మన కింది కులాల పెద్దలంత
రాబందులై ఎగబడి
ఆ బక్క జీవిని శిక్షించి
లోలోపల సంతోషపడతారు
ఇది మన ఐనైక్యతకు బండగుర్తు.

ఈ నేలమీద
పిడికెడున్న జనమే
పిడికిలిలా బలంగా ఉంటరనేది
ఓ చారిత్రక సత్యం.

ఇక్కడ జాతుల సంఖ్యాబలం
ఎక్కువుండడం మంచిదే
ఐతే సదరు గుంపంత గంపగుత్తగా
విడిపడి ఉండటం
ఓ సామాజిక నేరం.

- అవనిశ్రీ, 9985419424



ప్రఫుల్ బిల్లోర్ అంటే గుర్తుపట్టకపోవచ్చు కానీ.. 'ఎంబీఏ ఛాయ్ వాలా' అంటే సోషల్ మీడియాలో యాక్టివ్?గా ఉండే చాలా మందికి తెలుసు. సొంత పేరు కంటే.. ఆయన స్థాపించిన 'ఎంబీఏ ఛాయ్ వాలా' అంతలా ఫేమస్ అయింది. ఆ ఛాయ్ వ్యాపారమే ధనవంతుడిని చేసింది. రోజుకు రూ.150 సంపాదన నుంచి కోటీశ్వరుడిని చేసింది. ఈ ఛాయ్‌వాలా ఇప్పుడు అతడు ఎంతో మందికి స్ఫూర్తి. తన కాళ్ల మీద తను నిలబడటమే కాదు, మరికొంతమంది యువతకు ఉపాధి కల్పిస్తున్నాడు. ఆత్మ గౌరవతో బతికే ఒక మార్గం చూపుతున్నాడు. ఛాయ్‌తో కోట్లాధిపతి అయిన ప్రఫుల్ స్టోరీ లోకి వెళ్లితే...

ఎంబీఏ ఛాయ్‌వాలా



ఎగ్జామ్ ఫెయిలవడంతో 'టీ స్టాల్'

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లోని ధార్ జిల్లాలో జనవరి 14, 1996న జన్మించిన ప్రఫుల్, తన సొంత వ్యాపారాన్ని ప్రారంభించే ముందు ఐఐఎం అహ్మదాబాద్ నుంచి మాస్టర్స్ డిగ్రీని పొందాలని అనుకున్నాడు. ఎంబీఏలో చేరేందుకు తప్పనిసరిగా CAT పరీక్షలో మంచి ర్యాంక్ అవసరం. ఇందుకోసం రోజుకు 10 గంటలకు పైగా కష్టపడ్డాడు. కానీ.. కష్టానికి తగిన ఫలితం రాలేదు. మూడు ప్రయత్నాల్లోనూ విజయం సాధించలేకపోయాడు. తల్లిదండ్రుల సహకారం ఉన్నప్పటికీ డిప్రెషన్‌కు గురైన ప్రఫుల్ దేనిపైనా దృష్టి పెట్టలేకపోయాడు. అదే జీవితం కాదని అని తనకు తనే ధైర్యం చెప్పుకొని మరోవైపు అడుగులు వేశాడు. తాను ఏ క్యాంపస్ లో సీటు సాధించలేకపోయాడో, అదే క్యాంపస్ ముందు కేవలం రూ.8,000 పెట్టుబడితో ఐఐఎం అహ్మదాబాద్ క్యాంపస్ వద్ద జూలై 25, 2017న టీ స్టాల్ ఓపెన్ చేశాడు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మెక్‌డొనాల్డ్స్‌లో పనిచేయడం. సాయంత్రం తన టీ స్టాల్ నడపడం.. అది అతని దినచర్యగా మారింది. అతని కస్టమర్ బేస్ పెరగడంతో పక్క టీ స్టాల్ వాళ్లు అతని విజయాన్ని చూసి అసూయపడ్డారు. వారు యూనియన్‌గా ఏర్పడి ప్రఫుల్ షాప్ తీయించి వేశారు. దీంతో మరింత కసి పెరింది. విజయం సాధించాలన్న పట్టుదల మరింత పెరిగింది. మరో రూ.పదివేలు పెట్టుబడి పెట్టి కొత్త టీ స్టాల్‌ని ఏర్పాటు చేసి తన వ్యాపారాన్ని పునఃప్రారంభించాడు.

మొదటి రెస్టారెంట్..


ప్రఫుల్ బిల్లోర్ చాలా కాలం తర్వాత తన సొంత రెస్టారెంట్ ఎంబిఏ చాయ్‌వాలాను ప్రారంభించాడు. MBA అంటే 'Mr. Billore Ahmedabad' అని అర్థం. ఎంబీఏ ఛాయ్ వాలా.. అనే పేరు డిఫరెంట్‌గా ఉండటంతో సోషల్ మీడియాలో ఇది వైరల్ అయింది. ఈ సక్సెస్ స్టోరీ ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించింది. ప్రఫుల్ బిల్లోర్ వ్యక్తిగత వెబ్‌సైట్‌ను కూడా నిర్వహిస్తున్నారు. ఇతను ముఖ్యంగా ఐఐఎం అహ్మదాబాద్ ఎంబీఏ విద్యార్థులకు సుపరిచితుడు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో వైరల్ కావటంతో అంతర్జాతీయ ప్రాముఖ్యతను పొందాడు. కొన్ని నెలల్లోనే అతని కంపెనీ నెలకు మిలియన్ డాలర్లను సంపాదించటం ప్రారంభించింది. కొన్ని నెలల్లోనే అతని కంపెనీ నెలకు మిలియన్ డాలర్లను సంపాదించటం ప్రారంభించింది. రోజుకు రూ.150 సంపాదన నుంచి అతడి వ్యాపారం కూడా క్రమంగా విస్తరించింది. చాలా ఔట్?లెట్లు ఓపెన్ అయ్యాయి. 2019-20 సంవత్సరంలో ఎంబీఏ ఛాయ్?వాలా టర్నోవర్ రూ.3కోట్లకు చేరింది.



> భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో విస్తృత ఉనికి కలిగిన కేఫ్‌గా 'ఎంబీఏ ఛాయ్ వాలా'ను నిలపాలి. ఇది మా ప్రధాన లక్ష్యం. అదే సమయంలో కొన్ని మిలియన్ల మంది ప్రజలను చేరుకోవడం, వారికి ఇలాంటి వ్యాపారాలపై నమ్మకం కల్గించడం. ఇలాంటి ఆలోచనను పెంపొందిం చడం. మా బ్రాండ్‌ను ప్రజలకు అందించడం. ఆసక్తి ఉన్న వారిని మాతో కలుపుకొని క్రమంగా మా వ్యాపారిన్ని విస్తరించడంతో పాటు, మరి కొంతమంది యువకులను యజమానులగా తమ కాళ్లపై తాము నిలబడగలమని నమ్మకం కల్గించడం తద్వారా.. ప్రగతిశీల దేశాన్ని నిర్మించడానికి నావంతు దోహదపడటం. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో వ్యూహాత్మకంగా ఉన్న 200ం అవుట్‌లెట్‌లతో, మేము మా ప్రస్తుత విజయాలను అధిగమించడానికి మరింత ఎక్కువ ప్రభావాన్ని చూపడానికి కట్టుబడి ఉన్నాము.
>
> - ప్రఫుల్ బిల్లోర్

50 సిటీలు.. 200 ఔట్‌లెట్లు

సాధారణంగా ఎంబీఏ అంటే మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్. అయితే ఈ 'ఎంబీఏ ఛాయ్ వాలా'లో ఎంబీఏ అంటే మిస్టర్ బిల్లోర్ అహ్మదాబాద్ (Mr. Billore Ahmedabad). ఎంబీఏ ఛాయ్ వాలా చాలా తక్కువ కాలంలోనే ఫేమస్ అయిపోయింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 50 సిటీల్లో 200పైగా బ్రాంచ్?లు ఉన్నాయి. ప్రస్తుతం ఎంబీఏ ఛాయ్ వాలా అధినేతగానే కాదు.. మోటివేషనల్ స్పీకర్‌గానూ ఎంతో మందికి స్ఫూర్తినిస్తున్నాడు. అంతే కాదు... తన 200 ఔట్‌లెట్లలలో వందల మందికి ఉపాధిని ఇస్తున్నాడు.



కనువిప్పు

ఇది గాలి వాటంగా
వచ్చిన గెలుపు కాదు
అధికార దుర్వినియోగంతో
అర్థబలం అంగబలంతో
సాధించింది కానే కాదు
సమ్మిళిత సంస్కృతిపై
విభజన భావజాలంతో
పాలకవర్గం ప్రత్యర్థులపై చేసిన
దాడులపై దమన కాండపై
కన్నడిగులు ఇచ్చిన
చారిత్రాత్మక తీర్పు
మతాన్ని రాజకీయాల్లోకి లాగి
వివాదాస్పద అంశాలతో
మతోన్మాద ప్రసంగాలతో
భావోద్వేగాల రెచ్చగొట్టి
మెజారిటీ వాదంతో
మైనారిటీలను భయపెట్టి
వస్త్రధారణపై ఆహారంపై
జీవన విధానంపై
స్వేచ్ఛ స్వాతంత్ర్యాలపై
చేసిన దాడులకు నిరసన ఇది
చరిత్రను
అవమానించి తలకిందుల
ఆలోచనలతో
తప్పుదారి పట్టించబూని
మూఢనమ్మకాలను పెంచే



ఆశాస్త్రీయ ఆలోచనలతో
ప్రశ్నించిన మేధావులను
నిర్బంధాలకు గురిచేసి
ప్రభుత్వ రంగ సంస్థలను
నిర్వీర్యం చేస్తూ
దేశ ఆర్థిక స్థితిని దిగజారుస్తూ
రిజర్వేషన్ల రగడ రాజేసి
వైషమ్యాలను రగిలించి
పెరుగుతున్న ధరలను
అదుపు చేయలేక
సామాన్యుని బాధలు పట్టక
నిరుద్యోగాన్ని పేదరికాన్ని
నిర్మూలించే ప్రయత్నం చేయక
ఓట్ల కోసమే రాజకీయాలు చేసే
ప్రజా ప్రయోజనాలను విస్మరించే
పార్టీలకు పాలకులకు
కన్నడిగుల ఆలోచనలు
శాస్త్రీయ దృక్పథం
దేశ పౌరులందరికీ
కలిగించాలి కనువిప్పు

- పి. రామనాథం
9989969331

రక్తదానానికి కదిలొచ్చిన యువకులు...



ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాలో మూడు రైళ్ల ఢీ కొన్న ఘటన వందలాది కుటుంబాల్లో పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ విపత్కర పరిస్థితుల్లో గాయపడిన వారికి రక్తం అవసరం ఉంటుందని ఆలోచించిన వందలాదిమంది యువకులు రాత్రికి రాత్రే బాలేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. వీరంతా ఏ పిలుపూ లేకుండానే స్వచ్ఛందంగా ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. గంటల తరబడి వేచి ఉండి మరీ.. క్షతగాత్రులకు రక్తదానం చేస్తున్నారు. అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కొందరు స్థానికులు మానవత్వాన్ని చాటుకున్నారు. బహానగా బజార్ వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 1000 మందికి పైనే గాయపడ్డారు. క్షతగాత్రులను బాలేశ్వర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన తర్వాత స్థానికులు చాలా వేగంగా స్పందించారు. ఘటనాస్థలానికి వెళ్లి సహాయకచర్యలు చేపట్టారు. బోగీల్లో చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి సహాయచర్యలు చేపట్టారు. ప్రమాదం గురించి తెలియగానే మేం వెంటనే అక్కడకు బయల్దేరాం. దాదాపు 200-300 మందిని కాపాడగలిగారు.

రైలు ప్రమాద బాధితులను కేంద్రం ఆదుకోవాలి

- బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షులు తోట చంద్రశేఖర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఒరిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాద దుర్ఘటన అత్యంత బాధాకరమని భారత రాష్ట్ర సమితి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రైళ్లు ఢీకొన్న ఘటనలో 278 మంది ప్రయాణీకులు మతి చెందటం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో ఇప్పటివరకు గాయపడిన 1100మంది క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రైలు ప్రమాద ఘటనలో చేపడుతున్న సహాయక చర్యలను ముమ్మరం చేసి ప్రాణ నష్టాన్ని నివారించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ప్రమాదంలో మతి చెందిన వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని రూ.25 లక్షలకు పెంచి వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగమివ్వాలని డిమాండ్ చేశారు. రైలు ప్రమాద ఘటనపై కేంద్రం సమగ్ర విచారణ చేపట్టి ఇది మానవ తప్పిదమా? తీవ్రవాద చర్యా? అన్న కోణంలో దర్యాప్తు చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులకు అన్ని విధాలుగా అండగా నిలిచి సహాయక చర్యల్లో పాల్గొనాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. బాలాసోర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన యువత మానవత్వాన్ని చాటి పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పేర్కొన్నారు.

శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి కేటీఆర్

మంత్రి కేటీఆర్ తన ప్రయివేట్ సెక్రటరీ(పీఎస్) కానుగుల శ్రీనివాస్ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. శ్రీనివాస్ తల్లి కానుగుల రాములమ్మ గత నెల 18న మరణించారు. ఆ సమయంలో మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో శ్రీనివాస్ కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు.

దోస్త్‌కు 70,315 మంది రిజిస్ట్రేషన్

- 36,020 వెబ్‌ఆప్షన్ల నమోదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ, బీసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు 70,315 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువున్నదని తెలిపారు. ఇప్పటి వరకు 36,020 వెబ్‌ఆప్షన్లు నమోదయ్యాయని వివరించారు. ఈనెల 11వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశమున్నదని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించండి

- సీఎం కేసీఆర్‌కు కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 12 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. ఆయా విశ్వవిద్యాలయాల్లో 1,335 మంది కాంట్రాక్టు అధ్యాపకులు 25 ఏండ్ల నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. అటు పరిపాలనలో, ఇటు విద్యారంగంతోపాటు పరిశోధనారంగంలో కూడా వారు అనేక విధాలుగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2015లో సర్క్యులర్‌ను జారీచేసి, సర్వీసు రెగ్యులరైజ్ చేసేందుకు ధ్రువపత్రాలను పరిశీలించిందని గుర్తు చేశారు. కానీ, ఈ ప్రక్రియ పూర్తి కాలేదని తెలిపారు. క్రమబద్ధీకరణకు సంబంధించి వారికి అన్ని అర్హతలున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే వారు వేతనాలు పొందుతున్నారని పేర్కొన్నారు. డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకులను ఏ విధంగా రెగ్యులరైజ్ చేశారో, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును కూడా క్రమబద్ధీకరణ చేయాలని కోరారు.

నేడే జేఈఈ అడ్వాన్స్‌డ్ రాతపరీక్ష



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ రాతపరీక్ష ఆదివారం దేశవ్యాప్తంగా జరగనుంది. ఈ పరీక్షను ఐఐటీ గువాహటి నిర్వహిస్తున్నది. ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. జేఈఈ మెయిన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 2.50 లక్షల మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. వారిలో 1.90 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేసినట్టు సమాచారం. వారిలో 1.46 లక్షల మంది అబ్బాయిలు ఉండగా, 44 వేల మంది అమ్మాయిలున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రాథమిక సమాధానాల కీని ఈనెల 11న, ఫలితాలను అదేనెల 18న విడుదల చేస్తారు. తెలంగాణలో ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్‌తో మొత్తం 13 ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏపీలో 22 ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలున్నాయి.

భూమితో విడదీయరాని బంధం

- భూమికోసం సాయుధ పోరాటం చేసిన చరిత్ర తెలంగాణది : రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో మంత్రి నిరంజన్

నవతెలంగాణ-రాజేంద్రనగర్

తెలంగాణ ప్రాంతానికి, భూమికి విడదీయరాని బంధం ఉందని, భూమి కోసం సాయుధ పోరాటం చేసిన చరిత్ర తెలంగాణదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ నేడు తెలంగాణా సుస్థిర వ్యవసాయానికి ఆనవాలుగా నిలిచిందన్నారు. రైతుబంధు, రైతుబీమా, సాగునీరు, నిరంతర విద్యుత్, మిషన్ కాకతీయ, వంటి ఎన్నో చారిత్రాత్మక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. రైతుబంధు వంటి ప్రోత్సాహకాల వలన గ్రామీణ ప్రాంతాల్లో అనేక మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వ్యవసాయ రంగ అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. తనకి చిన్నప్పుడు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో చదవాలన్న కోరిక ఉండేదని కానీ అప్పుడు సీటు రాలేదన్నారు. ఇప్పుడు మంత్రి హెూదాలో విశ్వవిద్యాలయానికి వస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. టీఎస్‌టీ ఎస్సీ



మాజీ చైర్మన్ గంటా చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం అంతా నీళ్ల, వ్యవసాయం చుట్టూ తిరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హార్టికల్చర్ కమిషనర్ హనుమంతరావు, ఆయిల్ పామ్ సలహాదారు శ్రీనివాసరావు, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటరమణ విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నివారణ, ఎదుర్కోవటం, స్పందనపై దృష్టి

- నేటి నుంచి జీ20 హెల్త్ వర్కింగ్ గ్రూప్ సమావేశం : కేంద్ర ఆరోగ్య అదనపు కార్యదర్శి లవ్ అగర్వాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదివారం నుంచి రెండు రోజుల పాటు హైదరాబాద్ లో జీ20 సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో ఆరోగ్య రంగంలో ప్రధానంగా నివారణ, ఎదుర్కోవటం, స్పందన అనే విషయాలపై దృష్టి సారించినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ అదనపు కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలపై చర్చించనున్నట్టు తెలిపారు. వీటితో పాటు ఔషధాలు, వ్యాక్సిన్లు, థెరపీలు రోగ నిర్ధారణ అంశాలు కూడా ప్రధానంగా ఉంటాయని వెల్లడించారు. 2022 డిసెంబర్ ఒకటిన భారతదేశం జీ20 గ్రూప్ ప్రెసిడెన్సీని తీసుకుందని గుర్తుచేశారు. మన దేశం విశ్వసించే వసుధైక కుటుంబం అనే భావనను తలపించేలా జీ20 ఇతివృత్తం ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు ... అనే నమూనాలో ఉందని తెలిపారు.ఔషధరంగ సహకారంతో యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెన్స్ సమస్యను అధిగమించే విషయంపై చర్చిస్తామని తెలిపారు. అందుబాటులో, భద్రమైన, ప్రభావవంతమైన, నాణ్యమైన, చవకైన వైద్యసేవలతో పాటు ఆరోగ్య సేవల విస్తరణకు డిజిటల్ హెల్త్ ఆవిష్కరణలు, పరిష్కారాలను ఉపయోగించడంపై సమావేశం లోతుగా విశ్లేషిస్తుందని చెప్పారు. వాతావరణ మార్పులతో వస్తున్న ఆరోగ్య సమస్యలు-సంప్రదాయ వైద్యవిధానాలపై నిపుణులు దృష్టి సారిస్తారని ఆయన వివరించారు.ప్రపంచ వైద్య అవసరాలను తీర్చడంలో టెలిమెడిసిన్ కీలక భూమిక వహిస్తున్నదని అగర్వాల్ ఈ సందర్భంగా చెప్పారు. కో-విన్ వేదిక సులభంగా రక్తనిధి కేంద్రాలను తెలుసుకునేందుకు ఉపయోగపడిందన్నారు. సంయుక్తంగా చేసే కృషి సామాన్యునికి ఆరోగ్య సేవలందేందుకు దోహద పడుతోందని తెలిపారు. జీ-20 సదస్సులో ప్రపంచ ఆరోగ్యసంరక్షణ కోసం ఆయా దేశాలు ఒప్పందాలు చేసుకుంటాయని వెల్లడించారు. 180 మంది సభ్యులు, 10 ఆహ్వానిత దేశాలు, 22 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హైదరాబాద్‌లో నిర్వహించబోయే సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మెడికల్ డివైసెస్ సమావేశం

సదస్సు సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మెడికల్ డివైసెస్ అంశంపై సమావేశం నిర్వహిస్తుందని అగర్వాల్ తెలిపారు. కోవిడ్-19 సమయంలో ప్రపంచాన్ని ఆదుకోవడంలో భారతదేశం, తెలంగాణ రాష్ట్రం కీలక పాత్ర పోషించాయనీ, వ్యాక్సిన్ల ఉత్పత్తి, సరఫరా చేశాయని గుర్తుచేశారు. ఈ సమావేశాలతో మరోసారి భారతదేశం, తెలంగాణ విశిష్టత ప్రపంచానికి తెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 90 శాతం మందికి వ్యాక్సినేషన్ పూర్తయిందని తెలిపారు. అయితే ఇప్పటికీ తక్కువ ఆదాయం కలిగిన దేశాలు, ఆఫ్రికన్ దేశాల్లో ఈ ప్రక్రియ 20 నుంచి 25 శాతం కూడా పూర్తి కాలేదన్నారు. భవిష్యత్తులో కరోనా కన్నా భయంకరమైన మహమ్మారి వచ్చినా... ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ దేశాలను హెచ్చరించిందని గుర్తుచేశారు.

జాగో తెలంగాణ ఏర్పాటు

- బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలి : చంద్రకుమార్, ఆకునూరి మురళి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, జస్టిస్ (విశ్రాంత) చంద్రకుమార్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సుమారు 46 ప్రజాసంఘాల సంఘటనతో 'జాగో తెలంగాణ' అనే పేరిట ప్రజాసంఘాల వేదిక ఏర్పడింది. రాష్ట్రంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్న బీఆర్ఎస్‌ను, విద్వేష, అవినీతి రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించే లక్ష్యంతో జాగో తెలంగాణ ఏర్పడిందని జస్టిస్ చంద్రకుమార్, ఆకునూరి మురళి తెలిపారు. ఈ సమావేశంలో పలువురు ప్రొఫెసర్లు, అడ్వకేట్లు, క్రియాశీల కార్యకర్తలు, పౌరసంఘాల నేతలు, ముస్లిం సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నాలుగు తీర్మానాలు చేశారు.

- తెలంగాణలో పోరాడే వ్యక్తులు, పౌర సంఘాలు, ఒక జాగో తెలంగాణ నెట్‌వర్క్‌గా ఏర్పడి, వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల పక్షాన, ప్రజల ప్రయోజనమే కేంద్రంగా పనిచేయాలని నిర్ణయించారు.
- రాష్ట్రంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజల పరస్పర విశ్వాసాలను గౌరవిస్తూ, వారి మధ్య సోదర భావం, ఐక్యతను పెంపొందించడం కోసం కృషి చేయాలని నిర్ణయించారు. విద్వేష, మతతత్వ శక్తులను ప్రతిఘటించాలని, ప్రజల్లో విభజన, విద్వేషాలను రెచ్చగొట్టే శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించారు.
- తెలంగాణలో ప్రభుత్వ అవినీతిని, ఆర్థిక దోపిడిని, రాష్ట్ర వనరులు, సంపదను కొల్లగొడుతున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు.
- త్వరలో 'తెలంగాణ ప్రజల ప్రణాళిక' (పీపుల్స్ మేనిఫెస్టో)ను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.

వేసవి ఎండలతో జరపైలం..!

- ఐదేండ్లపాటు జాగ్రత్తలు కొనసాగించాల్సిందే • జాగ్రత్తలు సూచిస్తున్న వైద్యనిపుణులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వశపడని ఎండలు....ఎటూ పాలుపోని పరిస్థితి... రెక్కాడితే గానీ డొక్కాడని బడుగు జీవులపై వాతావరణంలో వచ్చిన మార్పులు చూపిస్తున్న ప్రభావమిది. దక్షిణాసియా దేశాల్లో ఎలినినో ప్రభావం ఉండగా.... అందులోనూ భారతదేశంపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటున్నట్టు చెబుతున్నారు. ఇదే పరిస్థితి ఐదేండ్లు ప్రతి వేసవిలోనూ కొనసాగుతుందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో .....తమ ఆరోగ్యాన్ని, ప్రాణాలను కాపాడుకునేందుకు వీలుగా ప్రజలు తమ జీవనశైలిని, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచిస్తున్నారు. వర్షాలు తక్కువగా పడటం, అకాల వర్షాలు రావడం, ఎండలు పెరగడం, వడగాలులు రావడం లాంటి వాటిని తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదనీ, వీటిని తట్టుకునేలా శరీరాన్ని సిద్ధం చేసుకోవాలని వారు కోరుతున్నారు. ఎలినినో ప్రభావం నేపథ్యంలో ప్రమాదం ఎక్కువగా ఉన్న రాళ్ల పని, వెల్డింగ్ వంటి ఇనుము పనులు, ఇతర కూలీలపై సర్వే చేపట్టింది. కేవలం ఎండ వేడిమికి గురైన వారిలో 33 రకాల లక్షణాలు కనిపిస్తున్నట్టు గుర్తించింది. దాహమెక్కువగా వేయడం, గుండె దడ, చెమట పట్టి బట్టలు పూర్తిగా తడిచిపోవడం, శరీరమంతా వేడిగా ఉండడం ప్రారంభంలో కనిపిస్తుంటాయి. జాగ్రత్తలు



తీసుకోకుండా ఉంటే గొంతు పొడిబారడం, పనిమీద శ్రద్ధ లేకపోవడం, శరీరంపై ఎర్రగా లేదా పింక్ రంగులో బొబ్బలు రావడం, కండరాలు, కాళ్లు, చేతుల నొప్పులు, ఏ విషయంపైనా ఆలోచించలేక గందరగోళంగా మారడం, అలసిపోవడం, తల తిరగడం తదితర లక్షణాలున్నట్టు ఆ సర్వేలో తేలింది. కొద్ది మందిలో బీపీ తగ్గి...కండ్లు తిరుగుతాయి. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవడం మంచిది.

పని వేళలు

ఎండవేడిమి పెరిగిన నేపథ్యంలో పని వేళలు ప్రధాన సమస్యగా మారాయి. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు, పట్టణాల్లో రోడ్డు పనులు చేసే వారితో పాటు చిరువ్యాపారాలు చేసే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్వచ్ఛంద సంస్థలు, కొంత మంది మానవత్వం కలిగిన వ్యక్తులు నిర్వహిస్తున్న చలివేంద్రాలు, ఇతర సేవా కార్యక్రమాలే తప్ప ప్రభుత్వం నుంచి సామూహిక సహాయ చర్యలు దాదాపు లేవనే చెప్పాలి. ఇలాంటి వారి ఉపాధిని కాపాడుతూ వారి ఆరోగ్య సంరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సాధ్యమైనంత వరకు పనులు లేకుండా చూసుకోవడం, ఎండలో పని తప్పనిసరైతే అందుకు అవసరమైన షామియానాలు, త్రాగునీటి సౌకర్యం, ఇతర సదుపాయాలు కల్పించాల్సిన అవసరముంది.

వారు మరింత జాగ్రత్తగా ఉండాలి

మధుమేహం, కిడ్నీ రోగులతో పాటు గర్భిణులు, పిల్లలు ఎండలకు మరింత జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య నిపుణులు డాక్టర్ కిరణ మాదాల తెలిపారు. ప్రజలు తేలికపాటి ఆహారం తీసుకోవాలి. మాంసాహారం తగ్గించాలి. శీతలపానీయాలు, ఐస్ క్రీంలకు దూరంగా ఉండాలి. మద్యపానం నుంచి ముఖ్యంగా బీర్‌కు దూరంగా ఉండాలి. బీర్ వల్ల శరీరంలో డీహైడ్రేషన్ సమస్య ఎక్కువవుతుంది. ఉత్సవాల నేపథ్యంలో ప్రజలు పెద్ద ఎత్తున బయటికి వచ్చే అవకాశమున్నందున చలివేంద్రాలను పెంచడం, ఇతర సౌకర్యాలను కల్పించే విషయాలపై దృష్టి పెట్టాలి..... అని డాక్టర్ కిరణ్ మాదాల సూచించారు.

డాక్టర్ కిరణ్ మాదాల

తల్లిదండ్రులకు కృతజ్ఞతగా ఉండండి

గీతం పట్టభద్రులకు ఐఎస్‌బి వ్యవస్థాపక డీన్ ప్రొఫెసర్ ప్రమత్ రాజ్ సిన్హా

ఘనంగా గీతం 14వ పట్టభద్రుల దినోత్సవం

- గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్

నవ తెలంగాణ-పటాన్‌చెరు

ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పెద్ద చేసిన తల్లిదండ్రులకు, అధ్యాపకులు, విద్యావేత్తలకు విద్యార్థులు ఎల్లప్పుడూ కృతజ్ఞతాపూర్వకంగా ఉండాలని హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) వ్యవస్థాపక డీన్ ప్రొఫెసర్ ప్రమత్ రాజ్ సిన్హా ఉద్బోధించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 14వ పట్టభద్రుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన స్నాతకోపన్యాసం చేశారు. తరగతి గదిలో పాఠాల కంటే వెలుపల పాఠాలు ముఖ్యమైనవని, ఈ పట్టభద్రుల దినోత్సవాన్ని మానసికంగా జ్ఞప్తిపెట్టుకోవాలని సూచించారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ మాట్లాడుతు విద్యార్థులు కెరీర్‌లో ముందుకు సాగేందుకు పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి సభ్యుడు, తెలుగు సాహిత్య ఔన్నత్యానికి విశేష కృషిచేసిన ప్రఖ్యాత రచయిత, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్ అందజేసి సత్కరించారు. ఎంఏ తెలుగు అత్తెసరు



మార్కులతో ఉత్తీర్ణుడైన తనను గీతమ్ గౌరవ డాక్టరేట్‌తో సత్కరిస్తుందని తెలిసిన తన అమ్మ మంచి ఔషధాలు రాయమని సలహా ఇచ్చిందని, అలాంటి గ్రామీణ నేపథ్యం తనదన్నారు. యురేనియం అవసరంలేని శక్తిని సృష్టించాలని గీతం విద్యార్థులకు సూచించారు. శాస్త్ర విజ్ఞానం ఎంత పెరిగినా సాహిత్యం పాత్ర ఎప్పటికీ తరగదని, కవిత్వం సమాజమంతా బాగుండాలని కోరుకుంటుందన్నారు. గీతం- హైదరాబాద్ వార్షిక నివేదికను అదనపు ఉపకులపతి (ప్రో వీసీ) ప్రొఫెసర్ డీ.ఎస్.రావు సమర్పించారు. గీతం, హైదరాబాద్‌లో ప్రస్తుతం 55 మంది అంతర్జాతీయ విద్యార్థులతో సహా 7,500 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉన్నట్టు చెప్పారు. 180కి పైగా కంపెనీలు గీతమ్‌ను సందర్శించి, 700 మందికి పైగా విద్యార్థులను ఎంపిక చేసుకున్నట్టు తెలిపారు. గీతం హైదరాబాద్ ప్రాంగణంలో 1,265 మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్, సైన్స్, ఫార్మసీ, హ్యుమానిటీస్ వంటి వివిధ విభాగాలలో డిగ్రీలు పొందడానికి అర్హత సాధించారు. 1,141 మంది విద్యార్థులు, 10 మంది పరిశోధకులు వ్యక్తిగతంగా హాజరై పట్టాలను స్వీకరించారు.

అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 21 మంది విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు. గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి. గుణశే ఖరన్ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.ఈ 14వ పట్టభద్రుల దినోత్సవంలో గీతం కార్యదర్శి ఎం.భరద్వాజ్, ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, ప్రోవీసీలు డాక్టర్ గీతాంజలి బత్మనాబానే (మెడికల్ సైన్సెస్), డాక్టర్ కె.గౌతమరావు (క్యాంపస్ లెఫ్ట్)టీ డీన్లు ప్రొఫెసర్ కె.శ్రీకష్ణ, (సెర్ఫ్), ప్రొఫెసర్ సి.విజయశేఖర్ (ఇంజనీరింగ్), ప్రొఫెసర్ విభూతి సన్దేవ్ (ఆర్కిటెక్చర్), సయ్యద్ అక్బరుద్దీన్ (కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ)టీ అమిత్ భద్ర (మేనేజ్ మెంట్)టీ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ పాల్గొన్నారు.

పొత్తులపై చర్చలు

- అమిత్ షా, నడ్డాతో చంద్రబాబు భేటీ
- ఏపి, తెలంగాణ రాజకీయ పరిస్థితి చర్చ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ, టిడిపి మధ్య పొత్తుల చర్చలు ప్రారంభం అయ్యాయి. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయాధ్యక్షుడు జెపి నడ్డాతో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. రాత్రి 9 గంటల నుంచి 9:45 గంటల వరకు భేటీ జరిగింది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీ ఏకాంతంగానే జరిగింది. వీరి మధ్య రాజకీయ చర్చలు జరిగాయి. మరికొన్ని నెలల్లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాదిలో రాష్ట్రంలో జరిగే సార్వత్రిక ఎన్నికల పొత్తులపై చర్చలు జరిగినట్లు సమాచారం. ఇటీవలి తెలంగాణ బీజేపీ నేతలు అమిత్ షా, జెపి నడ్డాతో సమావేశం కావడం, అంతకుముందు జనసేన అధినేత పవన్ కళ్యాణ్, జెపి నడ్డాతో సమావేశం అయ్యారు. ఆయా భేటీల్లో పొత్తులపై చర్చకు వచ్చింది. దీంతో చంద్రబాబుకు బిజెపి అధిష్టానం నుంచి పిలుపు వచ్చినట్లు టీడీపీ వర్గాలు పేర్కొన్నాయి.

పవన్ రాయబారం పనికొచ్చిందా?

ఏప్రిల్ 3, 4 తేదీల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బిజెపి జాతీయ నాయకత్వంతో రెండు రోజుల పాటు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. బిజెపి, టిడిపి, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్తే మంచిదని జనసేనాని బిజెపి నేతలకు చెప్పినట్లు సమాచారం. అయితే బిజెపి నేతలు మాత్రం అందుకు సిద్ధంగా లేకపోవడంతో, బిజెపి కలిసి రాకపోయినా, టిడిపి, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్తామని పవన్ కళ్యాణ్ తెగేసి చెప్పినట్లు సమాచారం.

ఇండియన్ నేషనల్ ఆటోక్రాస్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

- ఆపరేషన్ థియేటర్ కోసం

రూ.7.5 కోట్ల నిధుల సేకరణ లక్ష్యం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు చికిత్స చేసేందుకు సిద్దిపేట జిల్లా సత్యసాయి ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రోటరీ ఫౌండేషన్ రెండు లక్షల అమెరికన్ డాలర్ల గ్రాంటును ఆమోదించినట్టు రొటేరియన్ ఉదయ్ పిలానీ తెలిపారు. ఇందుకోసం స్థానికంగా రూ.7.5 కోట్లను సేకరణకు ఉద్దేశించిన ఇండియన్ నేషనల్ ఆటోక్రాస్ ఛాంపియన్ షిప్‌ను గచ్చిబౌలిలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ రొటేరియన్ బుసిరెడ్డి శంకర్ రెడ్డి, ఆర్‌సీ లేక్ జిల్లా మొయినాబాద్ అధ్యక్షులు రొటేరియన్ పతంజలి ఉపద్రష్ట శనివారం ప్రారంభించారు. ఆదివారం జరిగే ఈవెంట్‌లో అగ్రశ్రేణి రేసర్లు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఔత్సాహిక పోటీదార్లు తమ కార్లతో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్టు వివరించారు.

నేటినుంచి నర్సంపేటలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్లీనరీ


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు ఆదివారం నుంచి వరంగల్ జిల్లా నర్సంపేటలో ప్రారంభం కానున్నాయి. ఈనెల ఆరో తేదీ వరకు జరుగుతాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చిస్తామని తెలిపారు. తమ పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు 25 జిల్లాల నుంచి ఎంపిక చేసిన 350 మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. మొదటిరోజు ఆదివారం నర్సంపేట పట్టనంలో ప్రజా ప్రదర్శన, భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని వివరించారు. తమ పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, ఆర్ఎంపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, కేరళ ఎమ్మెల్యే కెకె రేమా, ఏఐఎఫ్‌డబ్ల్యూ జాతీయ నాయకులు సేలీనా, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాటం నాగభూషణం, వల్లేపు ఉపేందర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి తీర్మానాలు చేస్తామని పేర్కొన్నారు.

త్వరలో టీడీపీ బస్సు యాత్ర

- పార్టీ గెలుపే లక్ష్యం
- త్వరలో రూట్ మ్యాప్, షెడ్యూల్ ను ప్రకటిస్తాం
- శ్రేణులు సర్వం సిద్ధం కావాలి : తెలుగదేశం పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్

నవతెలంగాణ - హైదరాబాద్



తెలంగాణలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా త్వరలో బస్సు యాత్రను చేపట్టనున్నట్టు తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. బస్సుయాత్ర నిర్వహించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు . పార్టీలోని నాయకులందరిని కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే బస్సు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. శనివారం టీడీపి రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో పార్లమెంటు నియోజకవర్గ పార్టీ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత ఎన్నికలు, రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్ర విజయవంతం పై చర్చించారు . ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఇప్పటికి ప్రజల గుండెల్లో బలంగా ఉంద˜న్నారు. నాయకులు వెళ్లిపోయినా క్యాడర్ అలాగే ఉన్నారని ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీని పునర్ నిర్మాణం చేయాలన్నారు. తద్వారా వచ్చే ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా తెలుగుదేశం బస్సు యాత్రను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ యాత్రలో అన్ని స్థాయిల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటారన్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన రూట్ మ్యాప్ తో పాటు షెడ్యూల్ ను ప్రకటిస్తామని చెప్పారు. బస్సు యాత్రను పార్లమెంట్ , అసెంబ్లీ నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు కషి చేయాలని సూచించారు. బస్సు యాత్ర రూట్ మ్యాప్ ఖరారుపై సలహాలు, సూచనలు చేసి అవసరమైన చోట మార్పులు, చేర్పులు సూచించాలని పార్లమెంటు నాయకులకు

సూచించించారు

ప్రజా సమస్యలపై పోరాటాలకు సన్నద్ధం కండి

ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు నాయకులు, పార్టీ శ్రేణులతో సంసిద్ధం కావాలని జ్ఞానేశ్వర్ సూచించారు. స్థానిక సమస్యలతో పాటు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్యకర్తలను సమీకరించి ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టి పార్టీకి ప్రజల మద్దతును కూడగట్టాలన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి ప్రచారం చేయాలని, ఈ దిశగా పార్టీని బలోపేతం చేసుకోవాలని పార్లమెంటు అబ్జర్వర్లను ఆదేశించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్, పార్లమెంటు అబ్జర్వర్లు.. పి.సాయి బాబా, గుల్లపల్లి ఆనంద్, అశోక్ కుమార్ గౌడ్, కూరపాటి వెంకటేశ్వర్లు, నెల్లూరి దుర్గాప్రసాద్, ఇల్లందుల రమేష్, మెట్టుకాడి శ్రీనివాస్, సుభాష్ యాదవ్, పి.గోపాల్ రెడ్డి, అలీ మస్కతి, కృష్ణమాచారి, సంజయ్ కుమార్, యాదా గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కాసాని వీరేష్, టీటీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, పాల్గొన్నారు.

13మంది తహశీల్దార్లకు పదోన్నతి

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో అధికారుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. 13 మంది తహశీల్దార్లు, సచివాలయంలోని సెక్షన్ ఆఫీసర్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమోషన్ పొందినవారిలో కె.మహేశ్వర్, ఎం.సూర్యప్రకాష్, మురళీకృష్ణ, కె.మాధవి, పి.నాగరాజు, ఎల్.అలివేలు, బి.శకుంతల, కె.సత్యపాల్‌రెడ్డి, పి.మాధవిదేవి, వి.సుహాసిని, భూక్య బన్సీలాల్, బి.జయశ్రీ, ఎం.శ్రీనివాస్‌రావు, డి.దేవుజా, డి.ప్రేమ్‌రాజ్, ఐవీ.భాస్కర్‌కుమార్, ఉప్పల లావణ్య, డి.చంద్రకళ, ఆర్‌వీ.రాధాబాయి ఉన్నారు.